www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 12-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 224 | వరంగల్
Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada |Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి సా. 4.05 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 7.52 తదుపరి ఉత్తరాభాద్ర తె. 5.40; వర్జ్యం: సా.4.35-6.02; దుర్ముహూర్తం: ఉ.8.37-9.21, రా.9.47-10.37; అమృతఘడియలు: రా.1.18-2.45; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 5.36

సీజేఐగా జస్టిస్ ఖన్నా

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, ఖర్గే

వచ్చే ఏడాది మే 13వరకు పదవిలో ఖన్నా

తొలిరోజే 45 కేసుల విచారణ 2


భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

తెలంగాణ

నిన్ను మర్చిపోయింది

సంతోషంగా ఫామ్ హౌస్‌లోనే పండుకో.. పది నెలల్లో తెలంగాణ ఏమీ కోల్పోలేదు

నీ ఇంట్లోనే నలుగురికి ఉద్యోగాలు పోయాయ్

బడి దొంగలను విన్నాం.. అసెంబ్లీకి రానోళ్లను చూసినమా!?.. ఇదొక విచిత్ర పరిస్థితి

అసెంబ్లీ జరుగుతుంటే విపక్షం వచ్చి అడగాలి.. కడగాలి.. కానీ, తెలంగాణలో ఉల్టా అయింది

కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజం

ఏఎంవీఐలకు నియామక పత్రాలు అందజేత

డ్రగ్స్ వాడేవాళ్లు చీడ పురుగులని, సామాజిక బహిష్కరణ చేయాలని సీఎం పిలుపు

కొత్త ఉద్యోగులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోకి: పొన్నం


ఏఎంవీఐకి నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్, మంత్రి పొన్నం, ఎంపీ అనిల్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): "పది నెలల్లో తెలంగాణ ఏం కోల్పోయిందో తెలిసి వచ్చిందని నిన్న, మొన్న ఒక పెద్దాయన మాట్లాడుతు న్నడు. ఏం కోల్పోయిందయా.. మీ ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారు. తెలంగాణలో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చాయి. రైతులకు రుణ మాఫీ జరి గింది. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, పేదలకు ఉచిత విద్యుత్తు, రూ.500లకే సిలిండర్‌ను ఈ ప్రభుత్వం ఇస్తోంది. రాష్ట్రానికి ఏమీ బాధ లేదు నాయనా.. నువ్వు సంతోషంగా అక్కడే పండుకో.. నీతో ఏం పని లేదు. తెలంగాణ సమాజం నిన్ను మరిచిపోయింది" అంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీ తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు గాడిద గుడ్డు ఇచ్చారని, అయినా, బుద్ధి మారలేదని విమర్శించారు. ఇప్పటి కైనా మారాలని, ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని, నిర్ణయాల్లో లోపాలుంటే ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా సూచనలు చేయాలని కోరారు. అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎంవీఐ)గా ఎంపికైన 96 మందికి ఉద్యోగ నియామక

మిగతా 13వ పేజీలో...

కాళేశ్వరం కమిషన్

మరో 2 నెలలు

ఫైల్‌పై సీఎం సంతకం

నేడు జీవో విడుదల!

నేడు ఢిల్లీకి రేవంత్

మీడియా సదస్సుకు హాజరయ్యేందుకు..

ఎల్లుండి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి..

13

హిందూ ముస్లింలు 2 కళ్లు

వైషమ్యాలు రెచ్చగొడుతున్న మోదీ పరివార్

సమైక్యతకు కృషి చేస్తున్న గాంధీ పరివార్

ఎవరు కావాలో మైనారిటీలే తేల్చుకోవాలి

ముస్లింలు మాకు ఓటర్లు కాదు.. కుటుంబం

జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

13


కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడికి పాల్పడుతున్న దృశ్యం

లగచర్ల
రణరంగం

ఫార్మా కంపెనీ భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తం

వ్యూహాత్మకంగా ఊర్లోకి రప్పించి అధికారులపై రాళ్లదాడి

వికారాబాద్ కలెక్టర్ జైన్, అదనపు కలెక్టర్‌పై ఆగ్రహం

కడా అధికారికి తీవ్ర గాయాలు, హైదరాబాద్ తరలింపు

కలెక్టర్, అధికారుల వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడి

అంచనా వేయడంలో నిఘా, పోలీసు విభాగాల వైఫల్యం

దాడుల వెనుక ఓ పార్టీ హస్తం ఉన్నట్లు అనుమానం

ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదు: ఐజీ సత్యనారాయణ

దాడి జరగలేదు.. ఆ పదాన్ని వాడొద్దు: వికారాబాద్ కలెక్టర్

ఉద్యోగులపై దాడి హేయం: డిప్యూటీ కలెక్టర్ల సంఘం

తహసీల్దార్ కార్యాలయాల్లో విధుల బహిష్కరణ

పిచ్చోడి చేతిలో రాయి.. వికారాబాద్ రైతులపై పడింది

పచ్చటి పొలాల్లో ఫార్మా చిచ్చు.. హరీశ్ ధ్వజం


కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను చుట్టుముట్టిన మహిళలు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం నిర్వహించ తలపెట్టిన భూ సేకరణ ప్రజాభిప్రాయ సమావేశం రణరంగంగా మారింది. రైతులతో మాట్లాడేందుకు తమ వాహనాలు దిగి సమా వేశం జరిగే స్థలానికి వచ్చిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారులకు వ్యతిరేకంగా గోబ్యాక్, డౌన్ డౌన్ అంటూ రైతులు నినాదాలు చేస్తూ దూసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ సహా

మిగతా 14వ పేజీలో...

ధాన్యం ధర తగ్గిస్తే ఊరుకోం

ఇతర రాష్ట్రాలు సహా ఎక్కడైనా అమ్ముకోవచ్చు.. ఎగుమతికీ స్వేచ్ఛ

సన్నాలకు 500 బోనస్ ఇచ్చే పథకం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు

కాళేశ్వరం నుంచి నీరు ఇవ్వకున్నా కోటిన్నర టన్నుల ధాన్యం ఉత్పత్తి

తేమశాతం సడలించే సత్తా బీజేపీ కేంద్ర మంత్రులకు ఉందా?

మిల్లర్లు సహకరించనిచోట ప్రభుత్వ గోదాములకు ధాన్యం నిల్వలు

టెండరు ధాన్యం మొత్తం వసూలు చేస్తాం.. లేదంటే 25% జరిమానా

మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే బ్యాంకు గ్యారెంటీ నిబంధన

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): "రైతులు ధాన్యం ఎమ్మెస్పీకి అమ్ముకోవటానికి రాష్ట్రంలో రికార్డుస్థా యిలో 7,750 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశాం. 80 లక్షల టన్నులు వచ్చినా, అంతకంటే ఎక్కువ ధాన్యం వచ్చినా కొను గోలు చేయటానికి సరిపడా నిధులు సమకూర్చాం. సెంటర్ల లో అన్ని మౌలిక వసతులు కల్పించాం. చివరి రైతు నుంచి చివరి గింజ ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అదేక్రమంలో అధిక ధరకు ఎక్కడైనా ధాన్యం అమ్ముకోవటానికి రైతులకు పూర్తి స్వేచ్ఛ కల్పించాం. ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోవచ్చు. విదేశాలకు కూడా ఎగుమతి

మిగతా 13వ పేజీలో...

రైతుల్ని ఇబ్బంది పెడితే ఎస్మా: సీఎం

ధాన్యం కొనుగోళ్లకు టోకెన్లు

రైతుల ఆందోళనల నేపథ్యంలో నిర్ణయం

పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

కేంద్ర మంత్రి గిరిరాజ్‌తో కిషన్‌రెడ్డి చర్చలు

సీసీఐ అధికారులతో తుమ్మల చర్చలు సఫలం

13



అక్షరం మసక

బోర్డుపై రాసినది కనిపించట్లేదు!

4.26% మంది విద్యార్థుల్లో సమస్య

హైదరాబాద్‌లో తీవ్రత అధికం

అబ్బాయిల్లో కంటే అమ్మాయిల్లోనే..

సెల్‌ఫోన్లే ప్రధాన కారణం: వైద్యులు

హైదరాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పాఠ శాల విద్యార్థుల్లో కంటిచూపు సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తరగతి గదిలో బోర్డుపై ఉపాధ్యా యులు రాసే అక్షరాలు కనిపించడం వారికి కష్టత రంగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశా లల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 10 లక్షల మందికి పరీక్షలు చేయగా వారిలో 4.26 శాతం మందికి కంటిచూపు సమస్యలు ఉన్నట్టు, వారికి దూరంగా ఉన్నవి స్పష్టంగా

మిగతా 14వ పేజీలో...

మళ్లీ ఐఏఎస్‌ల బదిలీలు

యువజన, పర్యాటక కార్యదర్శిగా స్మితా సబర్వాల్.. పురావస్తు బాధ్యతలూ

గ్రేటర్ హైదరాబాద్ పూర్తి స్థాయి కమిషనర్‌గా ఇళంబర్తి

ఆరోగ్యశ్రీ సీఈవోగా శివశంకర్ లోతేటి.. పంచాయతీ రాజ్ డైరెక్టర్‌గా సృజన


స్మితా సబర్వాల్


ఇళంబర్తి

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కా ర్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్‌ను యువజన సర్వీసులు, పర్యాటక శాఖ కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఐఏఎస్ అధికారులు పనిష్మెంట్‌గా భావించే పురావస్తు శాఖ సంచాలకురాలిగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే, ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలూ నిర్వర్తించాలని ఆదేశించింది. విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి, గవర్నర్ కార్యదర్శి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా మూడు బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశంకు

మిగతా 12వ పేజీలో...

ఐఎఫ్ఎస్‌లకూ
స్థానచలనం

12

చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్‌గా ప్రియాంక వర్గీస్

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్‌గా శివాల రాంబాబు

మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌తో ఏసీ బస్సుల్లో 10% రాయితీ 13

2025 జనవరి 31 వరకు డిస్కౌంట్



సజ్జల భార్గవ్, అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో

బూతు, నీచ పోస్టులు

40 యూట్యూబ్ చానళ్లు.. 400 పైగా అకౌంట్లు

వైసీపీ సోషల్ మీడియా ఆఫీసు నుంచే తతంగం

సునీత, షర్మిలపై పోస్టుల వెనుక అవినాశ్ రెడ్డి

ఆ కంటెంట్‌నే వర్రా రవీంద్రారెడ్డి పోస్ట్ చేశాడు

వర్రా అరెస్టు.. కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్

కడప (క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సజ్జల భార్గవ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాతే బూతులు పెరిగాయని ఏపీలోని కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. షర్మిల, సునీత, వైఎస్ విజయలక్ష్మిపై పోస్టుల వెనుక ఎంపీ అవినాశ్ రెడ్డి 'డిక్టేషన్' ఉన్నట్లు తేలిందన్నారు. సోషల్ మీడియాలో కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులపై వి షం చిమ్ముతున్న ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు, అప్పటి సీఎం

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రప్రదేశ్‌లో రామ్‌గోపాల్ వర్మపై కేసులు 12

అమృత్ టెండర్లపై విచారణ జరపండి

అర్హత లేకున్నా సీఎం బావమరిదికి కట్టబెట్టారు

శోధా కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు

ముఖ్యమంత్రి రేవంత్‌పై చర్యలు తీసుకోండి

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు కేటీఆర్ ఫిర్యాదు

ఇప్పుడే ఢిల్లీలో దిగా.. అప్పుడే వణికిపోతే ఎలా?

మంత్రులను ఉద్దేశించి 'ఎక్స్'లో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రూ.8,888 కోట్ల విలువైన అమృత్ పథకం టెండ ర్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపిం చారు. దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం బీఆర్ఎస్ బృందంతో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. 'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' అనే నిబంధనను ఉల్లంఘించి సీఎం రేవంత్‌రెడ్డి తన బావమరిది సుజన్‌రెడ్డికి

మిగతా 2వ పేజీలో...



కేసుల నుంచి రక్షణకే
ఢిల్లీకి కేటీఆర్

ఫార్ములా ఈ-రేస్‌పై విచారణను అడ్డుకునేందుకు ప్రయత్నం 2

మంత్రులు పొంగులేటి, పొన్నం

ప్రభాకర్‌రావును తీసుకువస్తే.. కేసీఆర్, కేటీఆర్ జైలుకే 3

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


గాయపడిన ఏబీవీపీ కార్యకర్త

బాసర ట్రిపుల్ ఐటీలో..
మరో విద్యార్థిని ఆత్మహత్య

సీనియర్ వేధింపులే కారణమని అనుమానం?

పోలీసులతో కుటుంబ సభ్యుల వాగ్వాదం

క్యాంపస్ ముట్టడి చేపట్టిన ఏబీవీపీ.. ఉద్రిక్తం

కర్రలతో దాడి చేసిన వర్సిటీ సెక్యూరిటీ

పలువురు కార్యకర్తలకు గాయాలు 3

మళ్లీ రగిలిన మణిపూర్

11 మంది కుకీల హతం 2

భద్రతాదళాలు, మిలిటెంట్ల మధ్య ఎదురుకాల్పులు

పోలీస్‌స్టేషన్‌పై దాడులు.. దుకాణాలకు నిప్పు

ఆస్తులు చెప్పం

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజల విముఖత

ఇతర సమాచారం ఇచ్చేందుకూ కొందరి అనాసక్తి

పలు జిల్లాల్లో మందకొడిగా సాగుతున్న కుల సర్వే

ఒక్కో ఫారం నింపేందుకు సిబ్బందికి గంట సమయం

రోజుకు సగటున 6-7 ఇళ్లలో మాత్రమే సేకరణ



హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అన్ని వివరాలు వెల్లడించేందుకు కొందరు ఇష్టపడడంలేదు. ముఖ్యంగా ఆస్తుల విషయంలో గోప్యంగా వ్యవ హరిస్తున్నారు. సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు ఉండగా కొన్నింటికి సమా ధానం చెప్పేందుకు ఆసక్తి కనబరచడం లేదు. అదే సమయంలో సర్వేపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ఎన్యుమరేటర్లు సరైన సమాధానం చెప్పలే కపోతున్నారు. రాష్ట్రంలో శనివారం నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రారంభమైన విషయం

మిగతా 12వ పేజీలో...

సీజేఐగా జస్టిస్ ఖన్నా ప్రమాణం

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని అశోకా హాల్లో ద్రౌపది ముర్ము, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయించారు. సంజీవ్ ఖన్నా ఆంగ్లంలో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రాం మేఘ్వాల్ , మనోహర్ లాల్ ఖట్టర్, కిరెన్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, ఏపీ గవర్నర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అబ్దుల్ నజీర్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ ఖన్నా వయసు 64 ఏళ్లు. 1960 మే 14న ఆయన జన్మించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ వయసు 65 ఏళ్లు. అంటే ఆయన 2025 మే 13 వరకు పదవిలో కొనసాగుతారు. 2019 జనవరి 18న జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని, ఆర్టికల్ 370 రద్దు సహేతుకమేనని, ఈవీఎంలలో లోపాలేమీ లేవని ప్రకటించిన వివిధ ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆయన బెయిల్ ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటీలో లా చదివిన


సీజేఐ గా జస్టిస్ ఖన్నాతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

ఖన్నా హైకోర్టు న్యాయమూర్తి కాకముందు అనేక సంవత్సరాలు న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. ఆయన ప్రఖ్యాత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్‌ఆర్ ఖన్నా సోదరుడి కుమారుడు. ప్రాథమిక హక్కులను రద్దు చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని హెచ్‌ఆర్ ఖన్నా ప్రకటించిన విషయం తెలిసిందే. జస్టిస్ సంజీవ్ ఖన్నా తండ్రి దేవ్‌రాజ్ ఖన్నా గతంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, నూతన సీజేఐ సంజీవ్ ఖన్నాకు 'ఎక్స్' ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కాగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి విపక్షనేత రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు.

50 ఏళ్ల క్రితం ఖన్నా పెద్దనాన్నకు
ఇందిర ఆగ్రహంతో సీజేఐ పదవి దూరం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నాకు పెద్దనాన్న. ఓ కేసులో తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని అప్పటి ప్రధాని ఇందిర.. హెచ్‌ఆర్ ఖన్నాకు సీజేఐ పదవి ఇవ్వరాదని పట్టుబట్టి అనుకున్నది సాధించారు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులపై నాటి ప్రధాని ఇందిర ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఏడీఎం జబల్పూర్ వర్సెస్ శివకాంత్ సుక్లా వాజ్యం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. 'ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులను హరించివేయడం సబబేనా?' అన్నది ఈ వ్యాజ్యం సారాంశం. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా.. ఇందిర నిర్ణయాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. మైనారిటీ తీర్పునే వెలువరించినా.. ఎక్కడా ఎలాంటి జంకు లేకుండా ఆయన నిర్భయంగా వ్యవహరించారు. ఇది ఇందిరకు ఆగ్రహం తెప్పించింది. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్‌గా ఉన్న ఆయనకు సీజేఐ పదవిని దూరం చేసింది. ఖన్నా కంటే జూనియర్‌ను ఇందిర సీజేఐ సీట్లో కూర్చోబెట్టారు.

మణిపూర్‌లో 11 మంది
కుకీ మిలిటెంట్ల హతం

ఇంఫాల్, నవంబరు 11: మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో సోమవారం భద్రతాదళాలు, కుకీ మిలిటెంట్ల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్లు హతమయ్యారు. తొలుత బోరోబెక్రా పోలీసుస్టేషన్‌పై కుకీ మిలిటెంట్లు దాడులకు పాల్పడ్డారు. అనంతరం సమీపంలోని జకురాడొర్ కరోంగ్ గ్రామానికి వెళ్లి బీభత్సం సృష్టించారు. అనేక దుకాణాలకు నిప్పు పెట్టారు. దరిమిలా భద్రతాదళాలు- కుకీ మిలిటెంట్ల మధ్య భారీ స్థాయిలో ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 11 మంది కుకీ మిలిటెంట్లు హతమైనట్లు అధికారులు తెలిపారు. కొంతమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా గాయపడ్డారని వారు వెల్లడించారు. మరోవైపు ఆదివారం మైతేయి గ్రామాలపైన కుకీ ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. జిరిబామ్ జిల్లాలోని థమ్నాపోక్పీ, సబుంకోక్, సనసాబి గ్రామాలకు సమీపంలోని కొండలపై నుంచి తుపాకులు, బాంబులతో దాడులకు పాల్పడ్డారు. పంటకోత కాలం కావడంతో పొలాల్లో పనిచేసుకుంటున్న తమవారిని లక్ష్యంగా చేసుకుని కుకీ వర్గాలు దాడులకు పాల్పడ్డాయని మైతేయిలు ఆరోపించారు. బీఎస్ఎఫ్ జవాన్లు రావడంతో వారు దాడులను నిలిపివేశారని లేదంటే భారీ నష్టం జరిగేదని అన్నారు.

లోకం తీరు



కాలుష్యాన్ని ఏ మతమూ ప్రోత్సహించదు

- ఢిల్లీలో ఏడాదంతా బాణసంచా నిషేధంపై నిర్ణయం తీసుకోండి: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 11: కాలుష్యాన్ని పెంచే కార్యక్రమాలను ఏ మతమూ ప్రోత్సహించదని సోమవారం వ్యాఖ్యానించింది. ఏడాది పొడవునా బాణసంచాను నిషేధించడంపై పక్షం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది. దేశ రాజధాని పరిసరాల్లో వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ 1985లో పర్యావరణవేత్త ఎం.సి.మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై జరిగిన విచారణలో భాగంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కాలుష్యరహిత వాతావరణంలో జీవించడం పౌరుల ప్రాథమిక హక్కని తెలిపింది. ఏడాదంతా బాణసంచా నిషేధంపై భాగస్వాములందరితో చర్చించి ఈ నెల 25లోగా నివేదిక సమర్పించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఒవైసీది రజాకార్ల సంతతి: ఫడణవీస్

ముంబై, నవంబరు 11: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఒవైసీది రజాకార్ల సంతతి అని ఫడ్నవీస్ తాజాగా విమర్శలు సంధించారు. 'ఒవైసీ రజాకార్ల వారసుడు. రజాకార్లు మరఠ్వాడా ప్రజలను హింసించారు' అని అన్నారు. మహారాష్ట్రలో 'ఓటు జిహాద్' మొదలైందని శనివారం ఫడణవీస్ చేసిన వ్యాఖ్యలతో ఈ మాటల యుద్ధానికి తెరలేచింది. 'ఓటు జిహాద్'ను 'ఓటు ధర్మయుద్ధం'తో ఎదుర్కోవాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దీనికి ఒవైసీ స్పందిస్తూ తమ పూర్వీకులు బ్రిటీషు పాలకులపై జిహాద్ చేస్తున్నప్పుడు ఫడణవీస్ పూర్వీకులు తెల్లదొరలకు 'ప్రేమలేఖలు' రాసేవారని విమర్శించారు.

ఈపీఎఫ్‌వోలో 21 వేలకు వేతన పరిమితి!

న్యూఢిల్లీ, నవంబరు 11: కేంద్ర ప్రభుత్వం త్వరలో వేతన జీవులకు శుభవార్త చెప్పనుందా? ఉద్యోగ భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) పరిమితిని రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచనుందా? ఈ ప్రశ్నలకు విశ్వసనీయవర్గాలు ఔననే చెబుతున్నట్లు జాతీయ వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. దీంతోపాటు.. ఉద్యోగుల సంఖ్యను బట్టి కంపెనీల నమోదు విధానం కొనసాగుతుండగా.. ఆ సంఖ్య పరిమితిని తగ్గించనున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అంటే.. ప్రస్తుతం ఉన్న 20 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న కంపెనీలు ఈపీఎఫ్‌వోలో చేరడం తప్పనిసరి. ఈ సంఖ్యను 10-15కు తగ్గించే అవకాశాలున్నాయి. మరోవైపు ఈపీఎఫ్‌వో వేతన పరిమితిని పెంచడం వల్ల ప్రభుత్వంతోపాటు.. ప్రైవేటు రంగంపైనా భారం పడుతోందని.. అయితే, ఉద్యోగులకు మాత్రం మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యనిధికి ఉద్యోగి, యజమాని చెరో 12% వాటాను చెల్లించగా.. యజమాని వాటా నుంచి 8.33% పింఛను పథకానికి.. మిగతాది ఈపీఎఫ్‌లో జమ అవుతుంది. 2014లో చివరిసారి వేతన పరిమితిని సవరించారు.

వితంతు కోడలికి మామ భరణం ఇవ్వక్కర్లేదు

భోపాల్, నవంబరు 11: వితంతువైన కోడలికి ఆమె మామ ఎలాంటి భరణం చెల్లించాల్సిన పనిలేదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు మహమ్మదీయ చట్టం అంగీకరించదని తెలిపింది. భర్త చనిపోవడంతో తన పోషణ నిమిత్తం నెలకు రూ.40వేల భరణం ఇచ్చేలా మామను ఆదేశించాలని కోరుతూ ఓ ముస్లిం మహిళ కోర్టును ఆశ్రయించారు. ఇందుకు గృహ హింస చట్టాన్ని ఆసరాగా తీసుకున్నారు. ఆ చట్టంలోని 18 నుంచి 22 వరకు ఉన్న సెక్షన్లను ప్రస్తావిస్తూ అత్తవారింట్లో నివసించే హక్కు తనకు ఉందని, అందువల్ల భర్త తండ్రే ఆదుకోవాల్సి ఉందని కోరారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నెలకు రూ.3,000 చెల్లించాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి జస్టిస్ హృదేశ్ రాయ్ విచారణ జరిపారు. తన కుమారుడు జీవించి ఉన్నప్పుడు ఆమె ఎప్పుడూ తమ ఇంట్లో కలిసి ఉండలేదని, వారిద్దరు వేరేగా జీవించే వారని పిటిషనర్ వాదించారు. అందువల్ల ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ నాయకుడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. అత్యాచార కేసులలో ఆయన బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ప్రజ్వల్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వేళ ఆరోపణలు వచ్చాయని, రాజకీయంగా కుట్ర జరిగిందని, బెయిల్ మంజూరు చేయాలని కోర్టుకు విన్నవించారు. కానీ, సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించలేదు. నిందితుడు పలుకుబడి ఉన్నవారని, విచారణ సమయంలో ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటూ.. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

పోలీసుల అదుపులో సీరియల్ కిల్లర్..?

- వరుస హత్యలతో చిన్న శంకరంపేటలో కలకలం

చిన్నశంకరంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో వరుస హత్యలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పది రోజుల వ్యవధిలో ఇద్దరు దారుణ హత్యకు గురవడం కలకలం రేపింది. అక్టోబరు 23న చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఓ హత్య జరిగింది. నవంబరు 3న మెదక్-చేగుంట రహదారికి అనుకొని ఉన్న పద్మనాభస్వామి గుట్ట వద్ద బస్టాండ్‌లో దుండగులు ఒకరిని చంపి, దహనం చేశారు. పది రోజుల వ్యవధిలోనే ఈ రెండు ఘటనలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. చిన్నశంకరంపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి హత్య కేసుల్లో జైలుకెళ్లి ఇటీవలే విడుదలయ్యాడు. అతడు పోలీస్‌స్టేషన్ వద్దకు రాగానే ముఖం కనబడకుండా రాకపోకలు సాగిస్తుండటాన్ని గమనించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అతడిపై 10కి పైగా హత్య కేసులు ఉన్నట్లు సమాచారం. మద్యం తాగి ఉన్మాదిలా మారి, పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులను హత్య చేసి, డబ్బులు దొంగిలిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

భారత్‌కూ ఐరన్ డోమ్!

త్వరలోనే దేశానికి పాంట్‌సిర్ గగనతల రక్షణ వ్యవస్థ

- రష్యా కంపెనీతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కీలక ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 11: భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా కీలక ముందడుగు పడింది. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ తరహాలో... రష్యా గగనతలానికి రక్షణ వలయంగా నిలుస్తున్న అత్యాధునిక పాంట్‌సిర్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్-గన్ వ్యవస్థ త్వరలోనే భారత్‌కు కూడా అందుబాటులోకి రానుంది. ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్).. రష్యాకు చెందిన ఆయుధ ఎగుమతిదారు రోసోబొరోనెక్స్‌పోర్ట్ (ఆర్‌వోఈ)తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గోవాలో జరిగిన ఇండియా-రష్యా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ (ఐఆర్‌ఐజీసీ) సబ్ గ్రూప్ సమావేశంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత్, రష్యా మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని ఈ భాగస్వామ్యం నొక్కిచెబుతోంది.



పాంట్‌సిర్ రక్షణ వ్యవస్థ సామర్థ్యం

పాంట్‌సిర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అనేది విమానాలు, డ్రోన్లు, క్షిపణులతోపాటు సైనిక స్థావరాలకు గగనతలం నుంచి వచ్చే ముప్పుని సమర్థవంతంగా ఎదుర్కొనడానికి రూపొందించిన అత్యాధునిక మొబైల్ రక్షణ వ్యవస్థ. దీనిలో ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగిన స్వల్ప, మధ్య శ్రేణి క్షిపణులు ఉంటాయి. అలాగే డ్యూయల్ 30ఎంఎం ఆటోమేటిక్ ఫిరంగులు బహుళ అంచెల రక్షణను అందిస్తాయి. అత్యాధునిక రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్‌ను కలిగి ఉన్న పాంట్‌సిర్ వ్యవస్థ 36 కిలోమీటర్ల దూరంలో, 15 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగిరే లక్ష్యాలను గుర్తించి అలవోకగా ఛేదించగలదు. వేగంగా దూసుకొచ్చే శత్రు ఆయుధాలను అంతే వేగంగా ప్రతిస్పందించి తిప్పికొట్టగలదు. రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించాలనే భారత్ లక్ష్యానికి అనుగుణంగా.. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, రోసోబొరోనెక్స్‌పోర్ట్ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా ఉత్పత్తి, సాంకేతికత బదిలీ, పాంట్‌సిర్ వేరియంట్ల ఉమ్మడి అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించాలని బీడీఎల్, ఆర్‌వోఈ లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఈ నెలాఖరులో రష్యా నుంచి మరో యుద్ధనౌక

రష్యాలో నిర్మిస్తున్న రెండు గైడెడ్ క్షిపణి వ్యవస్థ కలిగిన యుద్ధనౌకల్లో మొదటిది ఈ నెలాఖరులోగా భారత్‌కు చేరనుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వీటి డెలివరీ ఆలస్యమైంది. అలాగే.. రష్యా అందజేయాల్సిన మిగిలిన రెండు 'ఎస్-400' ట్రయంఫ్ గగనతల రక్షణ వ్యవస్థలు 2026 నాటికి భారత్‌కు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు 4,000 టన్నుల బరువున్న యుద్ధనౌకను కొన్ని నెలలుగా కలినిన్‌గ్రాడ్‌లోని యాంటార్ షిప్‌యార్డులో మోహరించారు. డిసెంబరు మొదటి వారంలో రష్యాను సందర్శించనున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యుద్ధనౌకను అప్పగించనున్నారు. భారత్ దీన్ని ఐఎన్ఎస్ తుశీల్‌గా ప్రారంభించనుంది. కాగా, ఈ శ్రేణిలో మరో యుద్ధనౌకను వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు అప్పగించనున్నట్టు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. రష్యా నుంచి నాలుగు గ్రిగొరోవిచ్ క్లాస్ యుద్ధనౌకల కొనుగోలుకు భారత్ 2018 అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకోగా.. రూ.8వేల కోట్లతో వాటిలో తొలి రెండు నౌకలను ఇప్పటికే అందుకుంది.

ఎమ్మెల్యేలను కొనడం..
ప్రభుత్వాలను కూల్చడం!

- మోదీకి తెలిసింది అదే: ఖర్గే

న్యూఢిల్లీ, నవంబరు 11: ఎమ్మెల్యేలను కొనడం, ప్రభుత్వాలను కూల్చడం, ప్రతిపక్షాలను అణచేయడం.. ఇవే ప్రధాని మోదీకి తెలుసంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. బీజేపీ 'విభజన' ఎన్నికల నినాదాలు కేవలం తమకు కావాల్సిన కొందరు వ్యాపారవేత్తల కోసమేనని ఆరోపించారు. సోమవారం ఝార్ఖండ్‌లో పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఖర్గే మాట్లాడారు. అదానీ, అంబానీతో కలసి మోదీ, అమిత్ షా కేంద్రాన్ని నడుపుతున్నారన్నారు. 'ఇచ్చిన హామీలను ఎన్నటికీ నెరవేర్చని ఓ అబద్ధాల కోరు మోదీ.. కనీసం మణిపూర్‌ను సందర్శించే ధైర్యం చేయలేకపోతున్నారాయన.. సుదీర్ఘ బీజేపీ పాలన నడుస్తున్న గుజరాత్‌లో ఏమైనా స్వర్ణయుగం వచ్చిందా..? కాషాయ వస్త్రాలతో సాధువుల్లా వచ్చి కొందరు ముఖ్యమంత్రులు (యోగిని ఉద్దేశించి) అయ్యారు. విభజిస్తే నరికేస్తామంటూ ఉగ్రవాదుల భాష మాట్లాడుతున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఖర్గేను హిందూ వ్యతిరేకి, సనాతన వ్యతిరేకిగా అభివర్ణించింది.

సమాజ విచ్ఛిన్నానికి దేశ వ్యతిరేకుల ప్రయత్నం

- మన సమైక్యతే వారి ఓటమి: మోదీ



అహ్మదాబాద్, నవంబరు 11: తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు దేశ వ్యతిరేకులు సమాజ విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. వారి ఉద్దేశాల తీవ్రతను ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వారిని ఓడించేందుకు మనమంతా సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని ఖేడా జిల్లా వడ్తాల్ పట్టణంలో ఉన్న శ్రీస్వామినారాయణ్ ఆలయ ద్విశతాబ్ది వార్షికోత్సవానికి హాజరైన భక్తులను ఉద్దేశించి ప్రధాని సోమవారం వర్చువల్‌గా ప్రసంగించారు. '2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు పౌరుల ఐక్యత, దేశ సమగ్రత ముఖ్యం. అయితే, దురదృష్టవశాత్తూ కొందరు తమ సంకుచిత మనస్తత్వంతో, తమ స్వార్థ ప్రయోజనాల కోసం కుల, మత, భాష, స్త్రీ-పురుష, గ్రామీణ-పట్టణ పరంగా ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని ఓడించేందుకు మనమంతా సమైక్యమవ్వాలి. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేయడానికి ఆత్మనిర్భరతే తొలి అడుగు' అన్నారు. స్వామినారాయణ్ భక్తులైన సాధువులందరూ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేసే ప్రతిజ్ఞలో దేశంలోని ప్రతి పౌరుడినీ భాగస్వామ్యం చేయాలని కోరారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఆ ఆలయంతో తనకు అనుబంధం ఉందని, ఆలయ ద్విశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఒక నాణేన్ని కూడా విడుదల చేసిందని మోదీ చెప్పారు. భారత సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. కుంభమేళాల ప్రాముఖ్యతను ఇతర దేశాల ప్రజలూ అర్థం చేసుకునేలా స్వామినారాయణ్ భక్తులు కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరి మధ్య ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే పూర్ణ కుంభమేళాకు విదేశీయులనూ భారీగా రప్పించాలని కోరారు. 'ప్రపంచ వ్యాప్తంగా మీ ఆలయాలున్నాయి. ఆ ఆలయాల ద్వారా కుంభమేళా గురించి అవగాహన కల్పించండి. ప్రతి ఆలయం తరఫున కనీసం వంద మంది విదేశీయులను కుంభమేళాకు తీసుకువచ్చేందుకు కృషి చేయండి' అన్నారు.

రాహుల్ అబద్ధాలకు అడ్డుకట్ట వేయండి

రాహుల్‌గాంధీ అబద్ధాలకు అడ్డుకట్ట వేయాలని, మహారాష్ట్ర ఎన్నికల్లో ఆయన చేస్తున్న అసత్య ప్రచారాన్ని నిలువరించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్(ఈసీ)కు ఫిర్యాదు చేసింది. భారత యూనియన్ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా రాహుల్ రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. "మహారాష్ట్రకు రావాల్సిన యాపిల్ ఐఫోన్, బోయింగ్ విమానాల తయారీ యూనిట్లు వేరే రాష్ట్రానికి వెళ్లిపోయాయి" అని రాహుల్ అసత్య ప్రచారం చేస్తున్నారని వివరించింది. మరోవైపు, మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో బీజేపీ ప్రకటనలు మత కోణంలో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఫిర్యాదులో పేర్కొంది.

కేసుల నుంచి రక్షణకే ఢిల్లీకి కేటీఆర్

ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో విచారణపై.. బీజేపీ పెద్దల కాళ్లు మొక్కి తప్పించుకునేందుకే

- త్వరలో పేలే బాంబు ఏంటో తెలిసే వెళ్లారు
- తప్పు చేయకపోతే ఉలికిపాటు ఎందుకు?
- ఆర్‌బీఐ అనుమతి లేకుండా విదేశాలకు 55 కోట్లను ఎలా పంపించారు?: పొంగులేటి
- బీఆర్ఎస్‌ది గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ: పొన్నం

ఖమ్మం రూరల్/హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు చేశారు. తనపై ఉన్న కేసుల నుంచి కాపాడాల్సిందిగా కేంద్రంలోని బీజేపీ పెద్దల కాళ్లు మొక్కేందుకే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో జరిగిన అవకతవకలపై కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతి కోరుతూ గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసి 13 రోజులు అయిందని తెలిపారు. రేపో మాపో గవర్నర్ అనుమతి వస్తుందని భావించే ఆయన ఢిల్లీకి వెళ్లారన్నారు. అమృత్ పథకంలో అవకతవకలపై ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్లారన్నది ప్రజల దృష్టి మరల్చేందుకు చెబుతున్న కథ అని, బీజేపీతో ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ బీఆర్ఎస్ విధానమని చెప్పారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గ్రామంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెల్లి కేసులో బెయిల్ సంపాదించుకున్నట్లే.. ఈ కేసులో తనకూ బెయిల్ కోసం కేటీఆర్ కేంద్ర పెద్దలను కలవడానికి ఢిల్లీ వెళ్లినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. త్వరలో పేలబోయే బాంబు ఏంటో కేటీఆర్‌కు తెలుసునని, బండారం బయటపడుతుండడంతో ఢిల్లీలోని అదానీ, అంబానీతోపాటు బీజేపీ అగ్రనేతలకు పాదాభివందనం చేసి లబ్ధి పొందేందుకు వెళ్లారని ఆరోపించారు. ఏ తప్పూ చేయకపోతే ఎందుకు ఉలికి పడుతున్నారని ప్రశ్నించారు.



కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

ఈ-కార్ రేస్ కోసం నిజంగా రూ.55 కోట్లు ఖర్చు పెట్టి ఉంటే కేటీఆర్ భయపడటం ఎందుకని పొంగులేటి ప్రశ్నించారు. ఒప్పందం కుదరకముందే రూ.55 కోట్లు పంపారని, ఎంవోయూ మీద సంతకాలు పెట్టడానికి ఆయనకు ఉన్న అర్హతేంటని నిలదీశారు. దేశానికి చెందిన డబ్బును ఇతర దేశాలకు పంపాలంటే ఆర్‌బీఐ గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కేటీఆర్ ఎవరి అనుమతి తీసుకుని విదేశాలకు పంపించారో ప్రజలకు చెప్పాలన్నారు. దొరల పదేళ్ల పాలనలో జరిగిన వ్యవహారాలన్నింటినీ ప్రజల ముందు పెడితే గత పాలకులంతా అంతరిక్షంలో దాక్కుంటారేమోనని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది చిన్న విషయం కాదన్నారు. తనను బాంబుల మంత్రి అంటున్న మాజీ మంత్రి కేటీఆర్.. కాళేశ్వరం విషయంలో ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఎవరినీ ఉద్దేశపూర్వకంగా జైల్లో పెట్టాలని తమకు ఉండదని చెప్పారు. పేదలను ఇబ్బందులకు గురి చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోదన్నారు. కాగా, ఫార్ములా ఈ-కారు రేస్‌కు సంబంధించి ఏసీబీ విచారణ జరుగుతోందని మంత్రి పొన్నం తెలిపారు. కేటీఆర్ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా విచారణకు సహకరించాల్సింది పోయి.. తప్పించుకునే ప్రయత్నం చేయడం సబబు కాదన్నారు. రవాణా శాఖ కార్యాలయంలో పొన్నం విలేకరులతో మాట్లాడుతూ.. కారు రేసింగ్‌కు సంబంధించి డబ్బులు చెల్లించామని స్వయంగా కేటీఆరే చెప్పారని, దీనిపై చట్ట ప్రకారం విచారణ జరుగుతుంటే అడ్డుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేటీఆర్ తప్పును అంగీకరించాలన్నారు.

పిచ్చోడి చేతిలో రాయి..
వికారాబాద్ రైతులపై పడింది

- పచ్చటి పొలాల్లో ఫార్మా చిచ్చు: ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సర్కార్ తీరు వల్లే పత్తి కొనుగోళ్లు ఆగాయని ధ్వజం



హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, ఆ రాయే ఇప్పుడు వికారాబాద్ రైతన్నలపై పడిందని ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌పై ఉన్న కోపాన్ని రైతులు వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై చూపారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు దగ్గర్లో ఫార్మా సిటీ కోసం 15 వేల ఎకరాలను కేసీఆర్ హయాంలో సేకరించామని, అన్ని అనుమతులు తెచ్చామని గుర్తు చేశారు. అలాంటి భూమిని వదిలేసి.. పచ్చటి పొలాల్లో ఫార్మా చిచ్చు పెట్టడం తగదన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని సీఎం తన రియల్ ఎస్టేట్ దందా కోసం వినియోగించే కుట్రతో ఈ సమస్యను తెచ్చిపెట్టారన్నారు. కాగా, కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం వల్లే రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయని ఆరోపించారు. పండించిన పంటను కనీస మద్దతు ధరకూ అమ్ముకోలేని దుస్థితికి తెలంగాణ రైతాంగాన్ని చేర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని సోమవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోలు చేయబోమని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ప్రకటిస్తే.. సమస్యకు పరిష్కారం చూపకపోవడం సిగ్గుచేటన్నారు. పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ముఖ్యమంత్రికి.. రాష్ట్రంలో మంత్రులకు రైతుల సమస్యలు పట్టించుకునే సమయం లేదా? అని ప్రశ్నించారు. కాగా, మద్యం అమ్మకాల లక్ష్యం చేరుకోలేదని 30మంది ఎక్సైజ్ సీఐలకు మెమోలు జారీచేయడం కాంగ్రెస్ సర్కారు డొల్లతనాన్ని బయటపెడుతోందని హరీశ్ విమర్శించారు.

అమృత్ టెండర్లపై
విచారణ జరిపించండి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన శోధా కంపెనీకి రూ.1,137 కోట్ల విలువైన పనులను అప్పగించారని ఫిర్యాదులో కేటీఆర్ తెలిపారు. ఏమాత్రం అనుభవం, అర్హత లేని సంస్థకు పనులు అప్పగించడం ద్వారా ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. గతంలో 'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' నిబంధనను ఉల్లంఘించిన సందర్భాల్లో ప్రజాప్రతినిధులపై వేటు పడిందని గుర్తు చేశారు. ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ గనుల కేటాయింపు, బిహారిలాల్ దోబ్రే వర్సెస్ రోషన్ లాల్ దోబ్రే కేసు (1983), ది శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు వర్సెస్ వైరిచెర్ల ప్రదీప్ కుమార్ దేవ్ కేసు (2005), ది జయాబచ్చన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (2001), దివ్య ప్రకాష్ వర్సెస్ కులతార్ చంద్ రాణా (2003) కేసులను ఉదాహరణలుగా కేటీఆర్ ప్రస్తావించారు. 2014లో సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం భూములు కేటాయించిందని, కర్ణాటక ముడా స్కాంలో సీఎం తన భార్యకు భూములు కేటాయించారని, అలాగే రేవంత్‌రెడ్డి అమృత్ టెండర్లలో తన బావమరిదికి మేలు చేశారని ఆరోపించారు. అమృత్ టెండర్ల అవినీతిపై పారదర్శకంగా విచారణ జరిపించాలని, అక్రమాలు నిజమని తేలితే టెండర్లను రద్దు చేసి, సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కేసుల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ పర్యటన అంటూ మంత్రులు చేసిన ఆరోపణలపై 'ఎక్స్'లో స్పందిస్తూ, "జస్ట్ ఢిల్లీలో ల్యాండ్ అయ్యా. ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రకంపనలు



వస్తున్నాయని విన్నా. అప్పుడే వణికిపోతే ఎలా?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మైనారిటీ డిక్లరేషన్ ఏమైంది..?

హామీలివ్వడం తప్ప మైనారిటీలకు కాంగ్రెస్ సర్కార్ చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల ముందు ప్రకటించిన మైనారిటీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో పేద ముస్లిం విద్యార్థులకు నోట్ బుక్కులు, పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఇమామ్‌లు, మౌలానాలకు రూ.12 వేలు ఇస్తామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. మైనారిటీ సబ్ ప్లాన్ పేరిట ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఉపాధి కోసం రూ.వెయ్యి కోట్ల రుణాలిస్తామని.. రూ.లక్ష కూడా ఇవ్వలేదన్నారు. వికారాబాద్‌లో కలెక్టర్‌పై రైతులు తిరగబడటం రేవంత్ పాలనా వైఫల్యమేనని కేటీఆర్ అన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. మాజీ ఎమ్మెల్యే లింగయ్యకు సమన్లు

- ఖద్దరు ప్రమేయంపై విచారణ షురూ
- విచారణకు లింగయ్య గైర్హాజరు
- మరికొందరికి సమన్లు జారీ చేసే అవకాశం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు పోలీసులు అరెస్టవ్వగా.. తాజాగా ఖద్దరు ప్రమేయంపై విచారణ మొదలైంది. దర్యాప్తులో అత్యంతక కీలకమైన ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ(ఎఫ్ఎస్ఎల్)నివేదికలో రాజకీయ నాయకుల ప్రమేయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దర్యాప్తు అధికారులు ఈ కేసులో అరెస్టయిన నలుగురు పోలీసు అధికారుల ఫోన్లు, ఇతర సాంకేతిక పరికరాలను స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. ఇటీవల ఎఫ్ఎస్ఎల్ నివేదిక అందడంతో.. ఈ కేసుతో సంబంధం ఉన్న పొలిటికల్ చిట్టా మొత్తం వెలుగులోకి వచ్చింది. ఈ నివేదిక ఆధారంగా ట్యాపింగ్ కేసుతో సంబంధం ఉన్న గత ప్రభుత్వ నాయకులకు నోటీసులు జారీ చేసి, విచారించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో.. గత శనివారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు సమన్లు జారీ చేశారు. తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా ఆ సమన్లలో ఆదేశాలు జారీచేశారు. ఆ మేరకు లింగయ్య సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట విచారణకు హాజరవ్వాల్సి ఉండగా.. మధ్యాహ్నానికి వస్తానంటూ తొలుత సమాచారం పంపినట్లు తెలిసింది. ఆ తర్వాత అనారోగ్య కారణాలతో విచారణకు రాలేకపోతున్నట్లు చెబుతూ.. గురువారం విచారణకు వస్తానని సమాచారం పంపారు. అయితే.. విచారణకు లింగయ్య సహకరిస్తే.. గత ప్రభుత్వంలో పనిచేసిన మరికొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకుల పేర్లు బయటకు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. వారికి కూడా సమన్లు జారీ చేసి, విచారణకు పిలిచే అవకాశాలున్నాయి. దర్యాప్తు అధికారులు ఇప్పటికే పలువురు మాజీ మంత్రులు, మాజీ/ప్రస్తుత ఎమ్మెల్యేల చిట్టాను ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఆధారంగా సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం లింగయ్యకు సమన్లు జారీ చేశామని, ఆయన విచారణ తర్వాత.. మిగతావారిని విచారిస్తామని అధికారులు చెబుతున్నారు.

అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం

- ప్రత్యేక కమిషన్ చైర్మన్ బూసాని

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు నిర్ధారించే రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక(డెడికేటెడ్) కమిషన్ అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటుందని కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. అన్ని అంశాలు, అందరి అభిప్రాయాలను తీసుకుని సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. సోమవారం కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ విచారణలో ప్రజల నుంచి విలువైన సమాచారం వచ్చిందన్నారు. మంగళవారం స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, సంక్షేమ సంఘాలతో బహిరంగ విచారణను నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా బుధవారం రంగారెడ్డి జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో బహిరంగ విచారణను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో

మరో విద్యార్థిని ఆత్మహత్య

సీనియర్ విద్యార్థి వేధింపులే కారణమా?.. పోలీసులతో కుటుంబ సభ్యుల వాగ్వాదం

- సమగ్ర దర్యాప్తునకు డిమాండ్
- ఏబీవీపీ క్యాంపస్ ముట్టడి.. ఉద్రిక్తత
- కర్రలతో దాడి చేసిన సెక్యూరిటీ
- పలువురు కార్యకర్తలకు గాయాలు
- క్యాంపస్‌లో వరుస ఆత్మహత్యలు
- రెండేళ్లలో 9 మంది బలవన్మరణం





అత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ, యూనివర్సిటీ సెక్యూరిటీ జరిపిన లాఠీచార్జ్‌లో గాయపడ్డ ఏబీవీపీ కార్యకర్త, ఏబీవీపీ విద్యార్థులపై కర్రలతో దాడిచేస్తున్న వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది

బాసర/భైంసా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్-ఐటీలో మరో విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన ఉజ్వల-రవీందర్‌ల కుమార్తె స్వాతి ప్రియ(17) బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్-ఐటీలో పీయూసీ రెండో సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం తోటి విద్యార్థులు అల్పాహారానికి మెస్‌లకు వెళ్లగా.. గదిలో ఒంటరిగా ఉన్న స్వాతి ప్రియ.. ఫ్యాన్‌కు ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు ముందు స్వాతి తన తోటి విద్యార్థినికి మెసేజ్ చేసింది. దాంతో.. కంగారుపడ్డ ఆ విద్యార్థిని వచ్చేలోగా.. స్వాతి ఫ్యానుకు వేళాడుతూ కనిపించింది. కొనఊపిరితో ఉన్న స్వాతిని వెనువెంటనే ఆస్పత్రికి తరలించి ఉంటే.. ప్రాణాలను కాపాడేవారిమని తోటి విద్యార్థినులు చెబుతున్నారు. ఘటనాస్థలిలో ఆరు పేజీల సూసైడ్ నోట్ లభించినట్లు తెలుస్తోంది. స్వాతిప్రియ కుటుంబ సభ్యులు మాత్రం.. సీనియర్ ఇంజనీరింగ్ విద్యార్థి వేధిస్తున్నాడని తమ కూతురు ఫిర్యాదు చేసినా.. వర్సిటీ అధికారులు పట్టించుకోలేదని స్వాతిప్రియ తల్లిదండ్రులు ఆరోపణలు చేశారు. గత నెల 4న, ఈనెల 9న అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోలేదని వాపోయారు. స్వాతి తన స్నేహితురాలి ప్రేమ విషయంలో జోక్యం చేసుకోవడం వల్లే సీనియర్ విద్యార్థి వేధింపులు మొదలైనటుల తెలుస్తోంది. విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏబీవీపీ కార్యకర్తలు క్యాంపస్ ముట్టడికి యత్నించారు. దీంతో.. పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. వర్సిటీ సీఐ అత్యుత్సాహం ప్రదర్శించడంతో.. సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో ఏబీవీపీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో ఓ కార్యకర్తకు తీవ్ర గాయమవ్వగా.. పోలీసులు అతణ్ని ఆస్పత్రికి తరలించారు. సెక్యూరిటీ సిబ్బంది దాడిలో.. మరికొందరు కార్యకర్తలు గాయాలపాలయ్యారు. స్వాతిప్రియ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె మృతదేహాన్ని చూడగానే.. సొమ్మసిల్లి పడిపోయారు. "అక్కయ్యా.. ఎంత పని జరిగింది" అంటూ స్వాతిప్రియ సోదరుడు ఓంసాయి ఆమె కాళ్లపై పడి వెక్కివెక్కి ఏడవడం అక్కడి వారిని కలిచివేసింది. స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని కుటుంబ సభ్యులు మీడియాకు చెప్పారు. తాము వచ్చేలోపే మృతదేహాన్ని భైంసా ఆస్పత్రికి తరలించడంలో ఆంతర్యమేంటని నిలదీశారు. ఓ దశలో పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమ కుమార్తె మృతిపట్ల అనుమానాలున్నాయని, సమగ్ర దర్యాప్తు చేపట్టి.. వాటిని నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భైంసా టౌన్ సీఐ గోపీనాథ్ కలుగజేసుకుని, వారికి సర్దిచెప్పడంతో శాంతించారు.

కలవరపెడుతున్న ఆత్మహత్మలు

ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. గ్రామీణ పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయం పలు కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని మిగిలిస్తోంది. యూనివర్సిటీ లోపాలు విద్యార్థులకు శాపాలుగా మారి.. వారి ప్రాణాలను హరిస్తున్నాయి. అనేక సమస్యల మధ్య విద్యార్థులు చదువు సాగించలేక ఒత్తిడికి గురై అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో ఇక్కడ 9 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 8 మంది మైనర్లు.

విద్యార్థుల ఆత్మహత్యల చిట్టా

తేదీ	విద్యార్థి పేరు
23.08.2022	రాథోడ్ సురేశ్
22.12.2022	భానుప్రసాద్
14.06.2023	వడ్ల దీపిక
15.06.2023	బుర్ర లిఖిత
07.08.2023	జాదవ్ బబ్లూ
26.11.2023	ప్రవీణ్ కుమార్
22.02.2024	శిరీష
15.04.2024	అరవింద్
11.11.2024	స్వాతిప్రియ

ప్రభాకర్‌రావును తీసుకువస్తే.. కేసీఆర్, కేటీఆర్ జైలుకే

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావును భారత్‌కు తీసుకువస్తే కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో అడ్వాన్స్ పాట్ హోల్ జెట్ ప్యాచ్ మిషన్(రోడ్లపై గోతు లు పూడ్చే యంత్రం)ను ఆయన ప్రారంభించారు. అనంతరం రోడ్డుపై గుంతలను సిబ్బందితో మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని ప్రజలు అనుకుంటున్నారని కేసీఆర్ చెప్పడం సిగ్గు చేటని అన్నారు. ఉప్పల్-ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు ప్రారంభించి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని కేసీఆర్‌పై మండిపడ్డారు. రీజినల్ రింగురోడ్డుకు కేంద్రం రూ. 30 వేల కోట్లు ఇస్తానంటే కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. అధికారులపై దాడు లు చేయడం సరికాదని తెలిపారు. బీఆర్ఎస్ వాళ్లకు రాళ్లు వేయడమే వచ్చని, తమకు మా త్రం పూలు వేయడం వచ్చన్నారు. చిలుకూరు బాలాజీ సాక్షిగా ఇక్కడి నుంచే రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే రెండేళ్లలో తెలంగాణలోని ప్రతి పల్లె నుంచి మండలానికి అక్కడి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కృషి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణలోని 12 వేల కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి ఇటీవల మంత్రివర్గంలో చర్చించినట్లు వెల్లడించారు. రెండు నెలల పాటు నిరంతరాయంగా అడ్వాన్స్ పాట్ హోల్ జెట్ ప్యాచ్ మిషన్‌తో రోడ్లపై గుంతలను పూడ్చివేస్తామని చెప్పారు.

'బాలసదనం' ఘటనలో ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

- మరో ఉద్యోగిపై విచారణకు ఆదేశాలు
- రెగ్యులర్ ఉద్యోగిపై చర్యకు స్త్రీ శిశు సంక్షేమ శాఖకు లేఖ
- ఇప్పటికే పోక్సో కేసులో జైలులో ఉన్న నిందితుడు

భువనగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని బాలసదనంలో సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల ఘటనలో ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంకో ఉద్యోగిపై పునర్విచారణకు, మరో రెగ్యులర్ ఉద్యోగిపై చర్యల కోసం సంబంధిత శాఖకు సిఫారసు చేశారు. అక్టోబరు 14వ తేదీన బాల సదనంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవానికి హాజరైన జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అవుట్ సోర్సింగ్ అటెండర్ వెంకట్‌రెడ్డి ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడగా, వారం రోజులు ఆలస్యంగా 20వ తేదీన ఈ ఘటన వెలుగు చూసింది. వెంకట్‌రెడ్డిపై వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై అప్పటి నుంచి జరిగిన పలు దఫాల విచారణ అనంతరం కాంట్రాక్ట్ ఉద్యోగులైన బాలసదనం సూపరింటెండెంట్ లలిత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులును సోమవారం విధుల నుంచి తొలగించారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ ఉద్యోగి పీహెచ్‌సీ అలివేలు పాత్రపై మరోసారి విచారణ చేయాలని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అలాగే బాలసదనం సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ రెగ్యులర్ సూపర్‌వైజర్ మహాలక్ష్మిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు కలెక్టర్ సిఫారసు చేశారు. అక్టోబరు 14వ తేదీన బాలసదనంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రతినిధుల నుంచి వాంగ్మూలం తీసుకోవాలని, అలాగే జరిగిన ఘటనపై సీడబ్ల్యూసీ సకాలంలో స్పందించని తీరుపై సంబంధిత శాఖ కమిషనర్‌కూ కలెక్టర్ ఈ పాటికే లేఖ రాశారు.

బీసీలపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు

- బాధ్యతతో ఇంటింటి సర్వే చేస్తున్నాం
- కులం, ఆధార్, పాన్ వివరాలు ఐచ్ఛికం
- ప్రజలకు ఇష్టమైతేనే వాటిని చెప్పొచ్చు
- వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్



వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌కు బీసీలపై మాట్లాడే అర్హత లేదని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కార్తీక సోమవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చలేదని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవి, ప్రతిపక్ష పదవి, కార్యనిర్వాహక పదవులను ముందుగా ఎస్సీ, బీసీలకు ఇవ్వాలని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కులగణన సర్వేను అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీసీ కమిషన్ వేసి లెక్కలు తేల్చిన తర్వాతనే ఎన్నికలు జరగాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడానికి కారణం అదేనని వివరించారు. ఓట్ల కోసం కాకుండా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాధ్యతతో ఇంటింటి సర్వే చేస్తున్నామని, ప్రభుత్వం బలవంతంగా సర్వే చేయడం లేదని అన్నారు. ఇష్టముంటేనే కులం, ఆధార్, పాన్ వివరాలు చెప్పవచ్చని, అది ఐచ్ఛికమని అన్నారు. సర్వేలో భాగంగా ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్ల విధులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమగ్ర ఇంటింటి సర్వేను విజయవంతం చేయండి: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను(కులగణన) విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. సర్వే ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరిస్తూ వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. బడుగు బలహీన వర్గాల బాగు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే పార్టీని, ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్ర చేస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సూచించారు. సర్వేలో యానిమేటర్లతో పాటు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన "కనెక్ట్ సెంటర్" నుండి రోజువారీగా ఫోన్లు వస్తాయని, పార్టీ నేతలు, కార్యకర్తలకు ఏమైనా సందేహాలుంటే అడిగి నివృత్తి చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు.

20 ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయం సహా రాష్ట్ర వ్యాప్తంగా 20 ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మెదక్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల్ని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారుల్ని ఆదేశించారు. కాగా యాదాద్రి భువనగిరి జిల్లా మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి 14 మందితో ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు. ఈ బోర్డు ఏడాదిపాటు మనుగడలో ఉంటుంది.

అంతర్రాష్ట్ర మండలి స్థాయీ సంఘంలో చంద్రబాబు

- మరో ఆరు రాష్ట్రాల సీఎంలు కూడా...
- పునర్వ్యవస్థీకరించిన కేంద్రం
- చైర్మన్‌గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన అంతర్రాష్ట్ర మండలి స్టాండింగ్ కమిటీని పునర్వ్యవస్థీకరించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్ సింగ్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ కమిటీలో సభ్యులుగా చేర్చారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్ మాన్, ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాఝీ, మహారాష్ట్ర సీఎం షిండే, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్ సభ్యులుగా ఉంటారు. ప్రధాని మోదీ ఆమోదం మేరకు ఈ స్థాయి సంఘాన్ని పునర్వ్యవస్థీకరించారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో అంతర్రాష్ట్ర మండలి సెక్రటరీ పేరిట విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర మండలి ముందు చర్చనీయాంశాలపై ఈ స్థాయి సంఘం సభ్యులు నిరంతరం చర్చిస్తారని మండలి పరిశీలనకు వచ్చే కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు వచ్చిన అంశాలను ఖరారు చేస్తారని, మండలి సిఫారసుల ఆధారంగా తీసుకున్న నిర్ణయాల అమలును పర్యవేక్షిస్తారని, మండలి సూచించే ఏ అంశాలనైన ఈ కమిటీ చర్చిస్తుందని హోం శాఖ తెలిపింది. అవసరమైతేవివిధ రంగాలకు సబంధించిన నిపుణులను, వ్యక్తులను, ఈ మండలి పిలిచి చర్చించే అవకాశాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది.

టీజీపీఎస్సీ చైర్మన్ పదవికి నోటిఫికేషన్

- ఈ నెల 20 వరకు దరఖాస్తులకు అవకాశం
- మహేందర్‌రెడ్డి పదవీ కాలం డిసెంబరు 3న పూర్తి

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత చైర్మన్ మహేందర్‌రెడ్డి పదవీ కాలం డిసెంబరు 3న ముగియనుండడంతో కొత్త చైర్మన్ నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తుదారులు ప్రభుత్వ వెబ్‌సైట్ ఠీఠీఠీ.జ్చిఽజ్చుఽ.జౌఠి.జీ. నుంచి అప్లికేషన్ ఫాంను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వివరాలను నింపిన అనంతరం ఈ నెల 20 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తును ఇటజూట్చఛిఝటఽఖరుఖబ్ఛీఽజ్చుఽ.జౌఠి.జీ మెయిల్ ఐడీకి పంపించాలి. ఇలా వచ్చిన దరఖాస్తుల ద్వారా లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెర్చ్-కమ్-స్క్రీనింగ్ కమిటీ ద్వారా చైర్మన్ ఎంపిక ఉంటుంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం ఇప్పటి వరకు ముగ్గురు చైర్మన్లను నియమించింది. మొదటి చైర్మన్‌గా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిని, రెండో చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి జనార్దన్‌రెడ్డి పనిచేశారు. మూడో చైర్మన్‌గా ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఈ జనవరి 25న నియమితులయ్యారు. కమిషన్ నిబంధనల ప్రకారం చైర్మన్ వయసు 62 ఏళ్లకు మించి ఉండొద్దు. డిసెంబరు 3 నాటికి ఆయన వయసు 62 ఏళ్లు దాటుతుంది. దీంతో మహేందర్‌రెడ్డి స్థానంలో కొత్త చైర్మన్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2034-35నాటికి రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 31,809 మెగావాట్లకు..

- 1.50 లక్షల మిలియన్ యూనిట్లకు వినియోగం
- తెలంగాణ వనరుల సమృద్ధి ప్రణాళిక విడుదల చేసిన సీఈఏ

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యుత్ డిమాండ్ 2034-35నాటికి 31,809 మెగావాట్లకు చేరుతుందని కేంద్ర విద్యుత్ సంస్థ (సీఈఏ) అంచనా వేసింది. వినియోగం 1,50,040 మిలియన్ యూనిట్లకు చేరుతుందని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ వనరుల సమృద్ధి ప్రణాళికను విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠ డిమాండ్ 16,877 మెగావాట్లుగా, వినియోగం 90,962 మిలియన్ యూనిట్లుగా ఉంటుందని పేర్కొంది. వచ్చే పదేళ్లలో 4,684 మెగావాట్ల (2024-25లో 2,284 మెగావాట్లు, 2025-26లో 2,400 మెగావాట్ల ఒప్పందాలు) విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) గడువు ముగియనుందని, ఇదే సమయంలో 2,899 మెగావాట్ల సోలార్ విద్యుత్ వినియోగ ఒప్పందాలు ముగియనున్నాయని తెలిపింది. 2034-35నాటికి సంప్రదాయేతర ఇంధన కొనుగోలు బాధ్యత (రెన్యూవబుల్ పర్చేజ్ అబ్లిగేషన్-ఆర్‌పీవో) 50.50శాతంగా ఉంటుందని స్పష్టం చేసింది. 2034-35లో 31,809 మెగావాట్లలో సగం (15,904 మెగావాట్లు) సంప్రదాయేతర ఇంధన వనరుల వాటా ఉంటుందని పేర్కొంది. కాగా, 2025-26నాటికి 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్లన్నీ అందుబాటులోకి రానున్నాయని సీఈఏ తెలిపింది.

ఖాళీల కాళేశ్వరం!

నెల క్రితమే ఎస్ఈ పదవీ విరమణ.. 2 నెలల క్రితం బదిలీపై వెళ్లిన ఇద్దరు డీఏవోలు

- భర్తీ కాని సూపరింటెండెంట్, రెండు డీఈఈ పోస్టులు
- ఇన్‌చార్జి హోదాలోనే సీఈ కొనసాగింపు



మహదేవపూర్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కార్యాలయాల్లో ఖాళీలు తాండవిస్తున్నాయి. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీ ఉన్న రామగుండం సీఈ కార్యాలయంలోని కీలక పోస్టుల్లో ఒకటి ఖాళీ కాగా మరో పోస్టుకు ఇన్‌చార్జితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. మహదేవపూర్ సబ్ డివిజన్ కార్యాలయంలోనూ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు బదిలీపై వెళ్లడంతోపాటు ఒక సూపరింటెండెంట్, రెండు డీఈఈ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ఓ పక్క మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుతో తనిఖీలు, జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషన్ ప్రాజెక్టు నిర్మాణంపై ఆరా తీస్తుండగా ప్రధానమైన పోస్టులు ఖాళీ అవుతుండటం, వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా ఉన్నతాధికారులు మౌనం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. రామగుండం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో గతంలో పనిచేసిన ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఘటనతో ప్రభుత్వం పక్కన పెట్టగా జగిత్యాల సీఈ సుధాకర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. రామగుండంతో పాటు కరీంనగర్ ఇరిగేషన్ సర్కిల్-2 ఎస్ఈ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇదే సర్కిల్‌లో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కరుణాకర్ రెడ్డి గత సెప్టెంబరు 31న పదవీ విరమణ పొందడంతో ఆ పోస్టు కూడా ఖాళీ అయింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ప్రభుత్వం విచారణ ముమ్మరం చేస్తున్న వేళ ప్రధాన సీఈ పోస్టు ఇన్‌చార్జి వ్యవస్థలో మగ్గడం, ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టుకే ప్రధానమైన లింక్-1లో అధికారులు క్రమంగా ఖాళీ అవుతూ ఆ స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఉన్నవారిపై అదనపు పనిభారం పడుతోందని తెలుస్తోంది. ఈ పోస్టులను ఉద్దేశపూర్వకంగానే భర్తీ చేయకుండా కాలాయాపన చేస్తున్నారా? కొత్తవారికి పదోన్నతులు రాకుండా అడ్డుకుంటున్నారా? అనేది అంతుచిక్కడం లేదు.

సబ్ డివిజన్‌లో ఖాళీ అయిన డీఏవోలు, డీఈఈలు

లింక్-1లో ప్రధానమైన మహదేవపూర్ సబ్ డివిజన్ కార్యాలయంలోనూ సిబ్బంది కొరత వేధిస్తోంది. మేడిగడ్డ, అన్నారం ఈఈ కార్యాలయాల పరిధిలో బిల్లులు, బ్యాంకు గ్యారంటీలతోపాటు ఇతర అకౌంటింగ్ వ్యవహారాలు చూసుకునే రెండు డీఏవో (డివిజనల్ అకౌంటెంట్ అధికారి) పోస్టులు ఖాళీ అయ్యాయి. సెప్టెంబరులో ఏర్పడిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈ పోస్టులు ఖాళీ కాగా నేటికీ కొత్తవారిని నియమించలేదు. విజిలెన్స్, జ్యుడీషియల్ ఎంక్వైరీకి కావాలసిన సమాచారాన్ని అందిచడంలో వీరే కీలకం. ఈ పోస్టులతో పాటు మేడిగడ్డ ఈఈ కార్యాలయానికి సంబంధించి సూపరింటెండెంట్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఇవే కాకుండా సబ్‌డివిజన్ పరిధిలో పనిచేసే అధికారులకే చిన్నకాళేశ్వరం పనులను కేటాయించడం, అన్నారం ఈఈ కార్యాలయ పరిధిలోని రెండు డీఈఈ పోస్టులు ఖాళీ కావడంతో సిబ్బంది కొరత మరింత క్లిష్టంగా మారింది.

ప్రమోషన్ కోసం ప్రయత్నాలు

ప్రస్తుతం రామగుండం ఇరిగేషన్ కార్యాలయ ఇన్‌చార్జి సీఈ (చీఫ్ ఇంజనీర్)గా ఉన్న సుధాకర్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సమయంలో ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజనీర్)గా పనిచేశారు. రామగుండం ఎస్ఈగా పనిచేస్తూనే బదిలీపై వెళ్లిన ఆయన పదోన్నతిపై జగిత్యాల సీఈగా బాధ్యతలు స్వీకరించారు. రామగుండం సీఈ కార్యాలయంతో పాటు కరీంనగర్ సర్కిల్-2కు ఎస్ఈ అదనపు బాధ్యతలు చూస్తున్నారు. మూడు కార్యాలయాలకు బాస్‌గా ఉన్న ఆయన ఈఎన్సీ జనరల్ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అయితే.. బ్యారేజీ నిర్మాణ సమయంలో ప్రధానపాత్ర పోషించిన అధికారి ప్రమోషన్‌పై వెళ్లడం, మరో పదోన్నతి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుండటం ఇంజనీరింగ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇంజనీరింగ్ విభాగంలో బదిలీ, పదోన్నతి, పదవీ విరమణతో ఖాళీ అయిన పోస్టులకు వెంటనే ఇన్‌చార్జిలను లేదా రెగ్యులర్ పోస్టును కేటాయించాల్సి ఉండగా అది జరగకపోవడం ఇంజనీరింగ్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రస్తుతం రామగుండం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో పోస్టింగ్ వచ్చినా సరే డిప్యూటేషన్ వేయించుకుని మరీ వెళ్తున్నారని తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

క్రీడల కుంభమేళా కల!

ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ పోటీలు నిర్వహించాలన్న స్వప్నం సాకారం చేసుకునే దిశగా భారత్ తొలి అడుగువేసింది. 2036లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు తమకు ఆసక్తి ఉన్నదంటూ భారత ప్రభుత్వం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి అధికారికంగా ఓ లేఖ పంపింది. దీంతో సాధారణ ఒలింపిక్స్, ఆ వెంటనే జరిగే పారాలింపిక్స్ నిర్వహణను దక్కించుకునేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించబోతున్నదన్న విషయం స్పష్టమైంది. ఈ క్రీడల ఆతిథ్యం కోసం పోటీ తీవ్రంగా ఉండనుంది. హక్కుల కైవసానికి పోటీపడే దేశాల సంఖ్య రెండంకెల్లో ఉందట. వీటిలో సౌదీ అరేబియా, ఇండోనేసియా, కతార్, తుర్కియే నుంచి భారత్‌కు గట్టిపోటీ ఎదురవవచ్చు. దీనికి ముందు 2030లో జరిగే యూత్ ఒలింపిక్స్‌కు సైతం మనమే వేదికగా నిలవాలని మోదీ ఆకాంక్షించారు.

మన ప్రయత్నాలు సఫలమై భారత్‌కు ఒలింపిక్స్ కేటాయిస్తే అవి ఏ నగరంలో జరుగుతాయన్న విషయమై ఇప్పటికే ఓ స్పష్టత వచ్చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం అహ్మదాబాద్‌కు ప్రధాన వేదికగా అవకాశం ఇస్తారన్న విషయమూ అవగతమైంది. భారత క్రీడాప్రాధికార సంస్థకు చెందిన మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ భారత ఒలింపిక్ స్వప్నాన్ని ఆవిష్కరించారు. మోదీ ఆకాంక్ష నెరవేరితే భారత్ ఈ ఘనతను అందుకున్న నాలుగో ఆసియా దేశంగా గణుతికెక్కుతుంది. ఇంతకుముందు చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లో ఒలింపిక్స్ జరిగాయి. అన్నీ కలిసివచ్చి భారత్‌కు ఆ భాగ్యం దక్కితే.. మన దేశంలో ప్రజాదరణ పొందిన కొన్ని క్రీడల్ని జాబితాలో చేర్చడం దాదాపు ఖరారైనట్టే. వాటిలో టీ20 క్రికెట్, యోగా, కబడ్డీ, ఖో–ఖో, చెస్, స్క్వాష్‌లను పొందుపరుస్తారని భావిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఐఓసీకి ఎన్నికలు జరిగిన అనంతరం మాత్రమే వేదిక ఖరారవుతుంది. ఇక 2036 కంటే ముందు 2028లో అమెరికా, 2032లో ఆస్ట్రేలియాలో ఒలింపిక్స్ జరగనున్నాయి. మరోవైపు భారత్‌కు ఒలింపిక్స్ కేటాయింపు చేయరాదంటూ పాకిస్థాన్ ఓ వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాక్ వేదికగా జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నీకి మన జట్టును పంపేందుకు భారత ప్రభుత్వం నిరాకరిస్తున్న నేపథ్యంలో దానికి పాక్ ప్రతీకారం తీర్చుకోవాలని యోచిస్తోందంట. ఈ మేరకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీని సంప్రదించి, భారత్‌కు నిర్వహణ అవకాశం ఇవ్వరాదని దాయాది దేశం కోరనుందట.


భారత్ వేదికగా 1951, 1982 సంవత్సరాల్లో ఆసియా క్రీడలు, ఆ తర్వాత 2010లో ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడలు జరిగాయి. కామన్వెల్త్ క్రీడలకు సంబంధించి లోపభూయిష్టమైన నిర్వహణ, అవినీతి ఆరోపణలు, భద్రతాపరమైన సమస్యలతో భారత్ ప్రతిష్ఠ మసకబారింది. కామన్వెల్త్ పోటీల నిర్వహణను అస్తవ్యస్తం చేసిన మన వ్యవస్థలు ఒలింపిక్స్ విషయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. క్రీడల కుంభమేళాగా చెప్పుకునే ఒలింపిక్స్ నిర్వహణలో ఖర్చు అంశం అన్నింటిలోకీ అత్యంత ప్రధానమైనది. అనుకున్న అంచనాలు అవధులు దాటడం సర్వసాధారణం. ఆటలు ముగిశాక ఆర్థికంగా కునారిల్లిన దేశాలను చూశాం. ఆటల పండుగను నిర్వహించే చాన్స్ లభిస్తే ఆయా నగరాల్లో కొంతమేర పర్యాటకం అభివృద్ధి చెందవచ్చునుగాక. అలాగే మౌలిక వసతులూ, అంతర్జాతీయ స్థాయి స్టేడియాలు సమకూరుతాయనడంలోనూ సందేహంలేదు. అయితే ఆ తర్వాతే అసలు సమస్య ఉత్పన్నమవుతుంది. అట్టహాసంగా నిర్మించిన స్టేడియాలు తెల్ల ఏనుగుల్లా మారిపోతాయి. స్టేడియాల ఆలనాపాలనా తలకుమించిన భారమవుతుంది. అంతే కాదు, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నది ఆర్థిక నిపుణుల అంచనా. తాజాగా జరిగిన పారిస్ ఒలింపిక్స్ కోసం ఆ దేశం సుమారు 77 వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. అయితే భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఖర్చు విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సి వుంటుంది.

ఓ అధ్యయనం ప్రకారం ఒలింపిక్స్‌ను నిర్వహించిన అనంతరం ఆయా దేశాల ఆర్థిక ప్రగతి తీవ్రంగా మందగించింది. దీనికి ప్రధాన కారణం క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై పెట్టిన ఖర్చు పూర్తిగా నిరుపయోగంగా మారడమే. ఉదాహరణకు 1988 సియోల్ ఒలింపిక్స్ తర్వాతి ఏడాది దక్షిణ కొరియా జీడీపీ దారుణంగా పడిపోయింది. ఇక గ్రీసు, ఏథెన్స్, రియో క్రీడల తర్వాత ఆ దేశాల పరిస్థితి కూడా ఇదే. 2016 రియో క్రీడలకోసం ఉపయోగించిన స్టేడియాల్లో చాలావరకు ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. 1976 ఒలింపిక్స్ నిర్వహించిన కెనడాకు ఆ అప్పులనుంచి బయటపడడానికి మూడు దశాబ్దాలు పట్టింది. ఆతిథ్య దేశాలు నిర్వహణ ఖర్చు విషయంలో అత్యంత ప్రణాళికబద్ధంగా వ్యవహరించినా బిలియన్ డాలర్ల నష్టాలు మామూలే. ఏదేమైనా పోటీల నిర్వహణ అవకాశం భారత్‌కు దక్కుతుందా లేదా అనేది నిర్ధారణ కావడానికి మరికొంత సమయముంది. ఆ అవకాశం భారత్‌కు దక్కితే గత పోటీల ఆతిథ్య దేశాల నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాల్సివుంది. అనవసర ఖర్చులు, ఆడంబరాలకు పోకుండా నియంత్రించుకోవాలి. క్రీడా సంస్కృతి లోపించిన భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహణతోనైనా ప్రజల్లో ఆ దిశగా కొంతమేర అవగాహన ఏర్పడినా అదే పదివేలు.

అక్షరాలను శ్వాసించిన 'జయమ్' నవలా స్రష్ట

'మీ రచనా శక్తికి, శైలికీ నా జోహార్లు. ఇంత గొప్ప వచనం ఈ మధ్య కాలంలో చదవలేదు' అంటూ నాయుని కృష్ణమూర్తి వచన భాగవతం మొదటి భాగానికి బొమ్మలు వేయడానికి అంగీకరిస్తూ బాపు రాసిన ఉత్తరం లోని మాటలివి. కృష్ణమూర్తి అడక్కుండానే 'మిగతా భాగాలకు కూడా బొమ్మలు వేస్తాను పంపించండి' అన్నారు బాపు. నాయుని కృష్ణమూర్తి ఆధునిక వచనంలో రాసిన రామాయణ, భాగవతాలే కాదు, మహాభారతం మూల కథ ఆధారంగా చాలా సరళంగా, సులభ శైలిలో రాసిన 'జయమ్' నవల చాలా ప్రసిద్ధమైంది.

తెల్లని జుట్టు, తెల్లని గడ్డం, తెల్లని ఫ్యాంటుషర్టులో చిరునవ్వుతో ఆప్యాయమైన పలకరింపుతో ఒక తాత్వికుడిలా నడయాడిన నాయుని కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన కథకుడు, నవలాకారుడు, నాటక రచయిత, నిఘంటువుల నిర్మాత, సినీ గేయరచయిత మాత్రమే కాదు, అనేక పత్రికల్లో పనిచేసిన పాత్రికేయుడు, 'స్నేహబాల' సంపాదకుడు కూడా. గుర్రంకొండ మండలం నడించర్ల గ్రామంలో 1951 నవంబర్ 12న ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తి తన 67వ ఏట 2018 మార్చి 1న కన్నుమూశారు. తన 22వ ఏట రాసిన 'యామినీకుంతలాలు' నవలకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఉగాది నవలల పోటీలో మూడవ బహుమతి లభించింది. ఉన్నత విలువలు గల పాత్రలు పడే సంఘర్షణతో అభ్యుదయ భావాలతో ఈ నవల సాగుతుంది. ఎన్ని సమస్యలు వచ్చినా జీవితం నుంచి పారిపోకూడదనే హితవే ఈ నవల సారాంశం. 'మనిషి గుర్రమురోరి మనిషీ', 'ప్రలోభం' నవలలు కూడా రాశారు. కృష్ణమూర్తి ముప్పై కథలు రాశారు. వ్యక్తిగా, రచయితగా ఆయనలో నిరాడంబరత్వమే తప్ప ఎక్కడా ఆవేశం కనిపించదు. పతనమవుతున్న కుటుంబ సంబంధాలు, విలువల పట్ల ఆవేదన కృష్ణమూర్తి రచనల్లో నిండుగా వ్యక్తమైంది.



ఆప్యాయమైన పలకరింపుతో ఒక తాత్వికుడిలా నడయాడిన నాయుని కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన కథకుడు, నవలాకారుడు, నాటక రచయిత, నిఘంటువుల నిర్మాత, సినీ గేయరచయిత, పాత్రికేయుడు. ఆయన కీర్తిశిఖరం 'జయమ్'. మహాభారత మూల కథ ఆధారంగా సృజనాత్మకతను జోడించి రాసిన నవల అది. వ్యాసుడి కాలంలో కౌరవులు, పాండవుల మధ్య జరిగిన ఘర్షణ నిజంగా జరిగిన చరిత్రగా కృష్ణమూర్తి విశ్వసిస్తారు.

ఇంగ్లీషు నేర్చుకునే తెలుగు విద్యార్థుల కోసం మూడు నిఘంటువులను నాయుని కృష్ణమూర్తి తయారు చేశారు. బొమ్మల ద్వారా గుర్తుపట్టడానికి తెలుగు –ఇంగ్లీషు బొమ్మల నిఘంటువు, తెలుగు – ఇంగ్లీషు సచిత్ర నిఘంటువును రూపొందించగా, మూడవదిగా తెలుగు–ఇంగ్లీషు విద్యార్థి నిఘంటువును తయారు చేశారు. తెలుగు పదాలు తెలిసిన విద్యార్థులు వాటిని ఇంగ్లీషులో ఏమంటారో తెలుసుకోవడానికి బొమ్మలతో ఈ నిఘంటువులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తయారు చేశారు. ఏ విశ్వవిద్యాలయాలో, ఏ పరిశోధనా సంస్థలో తయారు చేయవలసిన నిఘంటువుల నిర్మాణాన్ని, ఒక్కడుగా నాయుని కృష్ణమూర్తి భుజానికెత్తుకుని పూర్తి చేశారు.

నాయుని కృష్ణమూర్తి కీర్తిశిఖరం 'జయమ్'. మహాభారత మూల కథ ఆధారంగా సృజనాత్మకతను జోడించి రాసిన నవల అది. వ్యాసుడి కాలంలో కౌరవులు, పాండవుల మధ్య జరిగిన ఘర్షణ నిజంగా జరిగిన చరిత్రగా కృష్ణమూర్తి విశ్వసిస్తారు. కురువంశం తన కళ్లముందే సర్వనాశనం కావడం పట్ల వ్యాకులత చెంది, వంశ నాశనానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ వ్యాసుడు 'జయమ్' పేరుతో కావ్యం రాస్తాడు. వ్యాసుడి తరువాత ఈ కావ్యాన్ని జనమేజయుడికి వైశంపాయనుడు ఎన్నో వివరణలు, పూర్వకథలు, శాస్త్రాలు జోడించి మహాభారతంగా వినిపిస్తాడు. దీంతో వ్యాసుడు రాసిన 'జయమ్' 8,800 శ్లోకాల నుంచి 24 వేల శ్లోకాలుగా పెరిగిపోతుంది. వేల సంవత్సరాల క్రమంలో పౌరాణికులు భారతాన్ని విపరీతంగా పెంచేశారు. స్కాండినేవియన్ సాహితీవేత్త సోరెన్ సోరెన్ సన్ 1883–94 మధ్య మహాభారతం నుంచి మూల కథను వేరు చేయడానికి ప్రయత్నం చేశాడు. ఎనభై ఏళ్ల తరువాత గుజరాత్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అహ్మదాబాద్ బ్రాంచి డైరెక్టర్ ప్రొఫెసర్ కేశవరావు కె.శాస్త్రి కొన్నేళ్లపాటు శ్రమించి మహాభారతం నుంచి మూల కథ 'జయమ్'ను వేరు చేసి 'జయసంహిత'ను ప్రచురించారు. పాండురాజు మరణం తరువాత కుంతీదేవి కుమారులతో హస్తినకు వెళ్లడంతో 'జయమ్' కథ మొదలవుతుంది. కురుక్షేత్ర యుద్ధం ముగిశాక పాండవులు హస్తినాపురానికి తిరిగి రావడంతో నవల పూర్తవుతుంది.

నాయుని కృష్ణమూర్తి అక్షరాలను నమ్ముకున్న వారే కాదు, ఆ అక్షరాలను శ్వాసించిన ఆచరణశీలి. చౌడేపల్లెలో అన్నదమ్ములతో కలిసి విజయవాణి ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించడమే కాదు, అక్కడి నుంచి రాష్ట్రంలోని విద్యార్థుల కోసం 'మా బడి' 'పాఠశాల' అనే విద్యావిషయక పత్రికలను కూడా తీసుకొచ్చారు. దేశమంతా 1991లో చేపట్టిన సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమంలో భాగంగా, మన రాష్ట్రంలో ఎంపికైన చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని నూతన అక్షరాస్యుల కోసం 'వెలుగుబాట' అన్న పత్రికను కూడా తీసుకొచ్చారు. ఈ పత్రికపైన 1995లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ వారు డాక్యుమెంటరీని రూపొందించారు. జిల్లా సాక్షరతా సమితి అకడమిక్ కమిటీ చైర్మన్‌గా నాయుని కృష్ణమూర్తి పదిహేను సంవత్సరాలు పనిచేశారు. రాష్ట్ర లిటరరీ మిషన్‌తో పాటు, కేంద్ర లిటరరీ మిషన్‌లో కూడా సభ్యుడిగా వ్యవహరించారు. బహుముఖీనమైన ప్రతిభకు తోడు, ఆయన మనుషులను ఎంతగానో ప్రేమించారు. ఆ ప్రేమే పునాదిగా ఆయన నలుగురు అన్నదమ్ముల కుటుంబ సభ్యులంతా కలిసి చౌడేపల్లెలో ఇప్పటికీ ఒకే ఇంట్లో ఉమ్మడిగా జీవించడం అరుదైన ఆదర్శం.

● రాఘవ

(నేడు నాయుని కృష్ణమూర్తి జయంతి)

కశ్మీరం ఎటు వెళుతోంది?





■ రాహుల్ కుమార్

చరిత్రను విస్మరించటం మనకు కొత్తకాదు. చరిత్రను తవ్వితీయటమూ వింతకాదు. అలా తవ్వితీయటం మనల్ని ఒక్కోసారి నిర్ఘాంతపరుస్తుంది. నిశ్చేష్టులను చేస్తుంది. ఆగ్రహాన్ని పుట్టిస్తుంది. ఆవేశాన్ని రగుల్చుతుంది. ఆవేదన పొంగేలా చేస్తుంది. నిశ్చితాభిప్రాయాల్ని తలకిందులు చేస్తుంది. ఇంత గాఢ భావోద్వేగాలను కలిగించే చరిత్రను ఒక పట్టాన విస్మరించలేం! నిత్యం ఏదోరకంగా రగిలిపోయే కశ్మీర్‌పై ఇలా తవ్వితీసిన చరిత్ర ఒకటి ఇటీవల జనం ముందుకు వచ్చింది. కశ్మీర్‌టైమ్స్ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ప్రముఖ జర్నలిస్టు అనురాధ భాసిన్ 'ఎ డిస్‌మాంటల్డ్ స్టేట్' అనే పేరుతో రాసిన చరిత్రను విస్మరిద్దామనుకున్నా విస్మరించలేం! ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా కశ్మీర్‌లో జరిగిన పరిణామాలపై ఇప్పటివరకూ వినిపించని కథ వినిపిస్తున్నానంటూ సాహసోపేతంగా ఎన్నో ఘటనలను కళ్ల ముందుంచారు. విస్మరించలేని భావనాశక్తితో ఒక రచన ఊగిపోతే దాంతో విభేదించే శక్తులూ ఉంటాయి. భిన్న ప్రయోజనాలు కాంక్షించే జన సమూహాలున్న సమాజంలో దేన్నీ ఒక దృష్టితో చూడటం అసాధ్యం. అందుకే కశ్మీర్‌పై ఏకాభిప్రాయం రావటం కష్టం! ఏకాభిప్రాయం అసాధ్యమైనా ఉన్న అభిప్రాయాల్లో న్యాయబద్ధమైనవి లేకుండా పోవు. అక్కడి ప్రజలకు సాంత్వన ఇచ్చేవి ఉండకుండా పోవు. హింసను చల్లార్చే మార్గాలను సూచించేవి కనిపించకుండా పోవు. అవేమిటో తెలుసుకోటానికి భాసిన్ రచన ఖచ్చితంగా తోడ్పడుతుంది.

జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో పొందుపరచటం చారిత్రక మహాపాపంగా పరిగణించే ధోరణి ఇప్పుడు ప్రబలంగా ఉంది. ఎటువంటి మినహాయింపుల్లేకుండా సాధారణ రాష్ట్రస్థాయినే కశ్మీర్‌కు ఆనాడు కల్పించి ఉంటే 75 ఏళ్లనాడే సమస్య సమసిపోయేదని రాజకీయంగా ఎంతైనా వాదించొచ్చు. కానీ జమ్మూకశ్మీర్.. భారత్‌లో విలీనమైన ఆనాటి చరిత్రనూ, అప్పటి పరిస్థితులనూ దృష్టిలో పెట్టుకుంటే దాన్ని అంగీకరించటం తేలిక కాదు. కశ్మీర్‌పై వచ్చిన ప్రామాణిక చరిత్రలన్నీ దీన్నే చెబుతాయి. ఆనాటి జమ్మూకశ్మీర్ మహారాజు హరిసింగ్ ప్రేమతో తన రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేయలేదు. పాకిస్థాన్ ప్రోద్బలంతో శ్రీనగర్‌ను చుట్టుముడుతున్న ఆక్రమణదారుల నుంచి రక్షించుకోటానికే భారత్ సైనిక సహాయాన్ని అర్థించారు. సాంకేతికంగా ఆనాటికి వేరే రాజ్యంగా ఉన్న జమ్మూకశ్మీర్‌కు ఆ సాయాన్ని చేయలేమనీ, తమతో విలీనమైతే అందుకు ముందుకు వస్తామని భారత్ తేల్చిచెప్పటంతో గత్యంతరం లేక హరిసింగ్ అంగీకరించారు. విలీనపత్రంపై సంతకం చేసినా పలుషరతులు పెట్టారు. రక్షణ, విదేశీ, కరెన్సీ, కమ్యూనికేషన్స్ మినహా మిగతా అన్ని విషయాలపై భారత ప్రభుత్వం చేసే ఏ చట్టానికైనా తన ఆమోదం ఉండాలని స్పష్టంచేశారు. ఈ షరతుల నేపథ్యంలోనే ఆర్టికల్ 370 వచ్చింది. జమ్మూకశ్మీర్‌లో శాశ్వత నివాసితులు ఎవరన్నది నిర్దేశించటానికి వీలు కలిగించే ఆర్టికల్ 35ఏను కూడా రాజ్యాంగంలో ఆ నేపథ్యంలోనే పొందుపరచారు. 35ఏ ఆర్టికల్ వల్లే భూములపై కశ్మీరు ప్రజలకు ప్రత్యేక హక్కులు వచ్చాయి. ఇతరులు అక్కడ భూములు కొనకుండా నిషేధాలూ కొనసాగాయి. ఉద్యోగాలు జమ్మూకశ్మీర్ ప్రజలకే దక్కేలా చర్యలూ తీసుకున్నారు. ఈ నిషేధాలన్నీ ఆర్టికల్ 35ఏ వల్లే ఆనాడు కొత్తగా వచ్చాయని భావించలేం. హరిసింగ్ పాలనలోనూ అవి ఎంతోకొంత అమల్లో ఉన్నాయి. ప్రజా ఒత్తిడికి తలవొగ్గి వాటిని ఆయన ప్రవేశపెట్టారు. ఇక పాలనపరంగా చూస్తే హరిసింగ్ ప్రభుత్వం ఏ మాత్రం జనరంజకమైనది కాదు. అంతా భూస్వాముల ఆధిపత్యమే ఉండేది. పౌరహక్కుల్లేవు. రాజకీయ హక్కులు అసలే లేవు. కశ్మీర్‌తో పాటు జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాల్లోనూ సంఖ్యాపరంగా అనాడు ముస్లింలే ఎక్కువగా ఉన్నా పాలనలో వారికి భాగం లేదు. కౌలుదారులుగా, కూలీలుగా, వృత్తి జీవులుగా ఉన్న వారిలో ముస్లింలే ఎక్కువ. అధిక సంఖ్యాక ప్రజలకు హక్కులు, అధికారాలు, భూసంపద పంపిణీని డిమాండ్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ ఉనికిలోకి వచ్చింది. భారత్ సైన్యానికి చేదోడుగా నిలిచి ఆక్రమణదారులను తరమటానికి తోడ్పడింది. కశ్మీర్ భారత్‌లో విలీనమయ్యేలా ప్రజాభిప్రాయాన్ని మలచింది. ఎక్కడా జరగని స్థాయిలో భూసంస్కరణలను అమలుపరచింది. భూస్వాముల నుంచి లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని రైతులకు పంచింది. ఇదంతా గడిచిన చరిత్ర. మరి వర్తమానం సంగతేమిటి?

తీవ్ర వివాదానికి కారణమైన ఆర్టికల్ 370 రద్దును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. అసలు ఆర్టికల్ 370 రద్దయి 5ఏళ్లు గడిచిపోయాయి. జమ్మూకశ్మీర్‌కు ఒకనాడున్న ప్రత్యేకతలన్నీ పోయాయి. రాష్ట్రమే రెండు కేంద్రపాలిత ప్రాంతాలైంది. ఏళ్ల విరామం తర్వాత ఎన్నికలూ జరిగాయి. ఫలితాలూ వచ్చాయి. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో నవశకాన్ని ఆరంభించామని ప్రచారం చేసుకున్న బీజేపీ 90 స్థానాలున్న అసెంబ్లీలో 29 సీట్లతో సరిపెట్టుకుంది. కశ్మీర్‌లోయలో ఒక్క స్థానమూ గెలవలేదు. గెలిచినవన్నీ హిందువులు అధికంగా ఉన్న జమ్మూలోనే ఉన్నాయి. మరోవైపు కశ్మీర్‌లో హింసా సంఘటనలూ పెరుగుతున్నాయి. కశ్మీరేతర వ్యక్తులపై దాడులూ కొనసాగుతున్నాయి. ప్రత్యేకతలన్నీ చాలావరకూ తీసివేసి, దేశంలో అమలయ్యే చట్టాలన్నిటినీ జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశామని చెప్పుకొంటున్నప్పటికీ మారిన పరిస్థితులతో ప్రజలు సమాధాన పడినట్టుగా దాఖలాలు కనిపించటం లేదు. ఎందుకిలా జరిగింది? కేంద్ర ప్రభుత్వం ఆశించినట్లుగా జాతీయ జీవన స్రవంతిలో కశ్మీర్ ప్రజలు ఎందుకు కలవలేకపోతున్నారు?

వీటికి సమాధానాలు తెలుసుకోటానికి ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా జరిగిన పరిణామాల గురించి లోతుగా తెలుసుకోవాలి. ఆర్టికల్ 370ని రద్దుచేసిన 2019 ఆగస్టు 5కు చాలా ముందుగానే కశ్మీర్‌లో అరెస్టులు మొదలయ్యాయి. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారని అనుకున్న వాళ్లందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆగస్టు 5 నుంచి కశ్మీర్ అంతా లాక్‌డౌన్ పరిస్థితే నెలకొంది. రాజకీయ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులను గృహనిర్బంధంలో ఉంచారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లను వాడకుండా నిషేధాలను విధించారు. ల్యాండ్‌లైన్ల ఫోన్లపైనా ఆంక్షలు అమలయ్యాయి. ప్రజల మధ్య సమాచారమార్పిడి పూర్తిగా నిలిచిపోయింది. ప్రసార సాధనాల వార్తా సేకరణకు అన్ని వైపుల నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజలకు వివరమైన సమాచారం లభించే పరిస్థితి లేదు. జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసే చట్టాల మంచి చెడులపై అభిప్రాయాలు వెల్లడించే మార్గం ప్రజలకు లేదు. ప్రజల భౌతిక సంచారంపైనా అడుగడుగునా నిషేధాలు అమలయ్యాయని చెబుతూ అనురాధ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. ఆ తర్వాత 2020 మార్చిలో విధించిన కోవిడ్ లాక్‌డౌన్‌తో జనజీవితం మరింత ఆంక్షలమయమైంది. తమ జీవితాలనూ తమ రాజకీయాలనూ తాము అనుసరించాల్సిన ఆర్థిక విధానాలనూ ఇతర రాష్ట్రాలతో తాము కొనసాగించాల్సిన సంబంధాలనూ నిర్దేశించే అనేక నిర్ణయాలు కశ్మీర్ ప్రజల ప్రమేయం లేకుండా జరిగిపోయాయనీ, 1947 తర్వాత ఏ రాష్ట్ర ప్రజలకూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదన్నదే అనురాధ వాదన సారాంశంగా చెప్పుకోవచ్చు. ఆర్టికల్ 370ను కశ్మీర్ భారత్‌లో విలీనం కావటానికి తోడ్పడే విశిష్ట రాజ్యాంగ సాధనంగా గతంలో భావించారు. దాన్ని 2019 ఆగస్టు 5న నిర్వీర్యం చేసినా ఎప్పటి నుంచో దాన్ని బలహీనపరచటం మొదలైంది. పలు రాష్ట్రపతి ఉత్తర్వులతో కీలక కేంద్ర చట్టాలన్నీ కశ్మీర్‌లో అప్పటికే అమలయ్యాయి. అందుకే అది అలంకారప్రాయంగా మిగిలిపోయింది. బలమైన భావోద్వేగ అంశంగా మాత్రమే ఉండిపోయింది. దాన్నొక్కదాన్ని తొలగిస్తే సమస్య జటిలం అయ్యేది కాదు. సంపూర్ణ రాష్ట్ర హోదానీ తొలగించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు చేయటం, శాశ్వత నివాసీయులుగా విద్యా, ఉద్యోగాల్లో కశ్మీర్ ప్రజలకు లభించే ప్రత్యేక హక్కులను నిర్వీర్యం చేయటం, భూములు కశ్మీరేతర ప్రజల్లోకి వెళ్లేలా పలు చట్టాలను మార్చటం, ఇతర రాష్ట్రాల ప్రజలకు ఆస్తుల కొనుగోలుపై ఏదో రూపంలో హక్కులు లభించేలా చూడటం.. ఇప్పుడు తీవ్ర సమస్యలుగా మారాయి. ఈ మార్పులకు కశ్మీర్ ప్రజలు ఎలా సమాధాన పడతారన్నదే సవాల్‌గా మారింది. ఈ మార్పులకు వారు అంగీకరించనంత వరకూ సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న పూచీలేదు!

ప్రత్యేక హక్కులను వదులుకోవటం ఎక్కడా సులభంగా జరగదు. చారిత్రక సందర్భం ఒక్కోచోట ఒక్కో విధంగా ఉండొచ్చు. కానీ ఆ సందర్భంగా ఒనగూడిన హక్కులు స్థిరమైన ప్రత్యేక మనఃస్థితిని కలిగిస్తాయి. అది బలీయంగా ఉన్నంత వరకూ ప్రజల మనస్సుల్లో ప్రత్యేక హక్కుల భావం తొలగిపోదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సందర్భంగా కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం, తెలంగాణ ప్రాంతీయ కమిటీ, తెలంగాణ మిగులు నిధులు, ముల్కీ నిబంధనలు, ఆరుసూత్రాల పథకం, 610 జీవో లాంటివన్నీ దశాబ్దాలపాటు ప్రజల మనస్సుల్లో నిలిచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు దారితీశాయి. నిధులు, నీళ్లు, నియామకాలు తెలంగాణ వాసులకే పూర్తిగా దక్కాలనే ఆకాంక్ష, పట్టుదలను అసలుసిసలైన ప్రజాస్వామ్య కోరికలుగా భావిస్తే కశ్మీర్ ప్రజలు అవే కోరుకుంటే కాదనలేని పరిస్థితే ఉంటుంది. ప్రజాస్వామ్య కోరికను ఒక చోట ఆమోదించి మరొకచోట తిరస్కరించటాన్ని ఎవరూ సమర్థించుకోలేరు. తెలంగాణ రాష్ట్రం అవసరం గురించీ జరిగిన అన్యాయాల గురించీ వాగ్దానభంగాల గురించీ సాగినన్ని చర్చలు ఏ ప్రత్యేక రాష్ట్రోద్యమాల్లోనూ సాగలేదు. సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందించిన సౌలభ్యాలతో చర్చలు, ప్రతిచర్చలు భిన్న వేదికలపై కనీవినీ ఎరగని రీతిలో విజృంభించి బలమైన సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి.

అంతర్జాతీయ సరిహద్దులో కశ్మీర్ ఉండటాన్నీ మతపరమైన సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకుని భిన్న ప్రమాణాలను అనుసరిస్తే దూరాలు పెరుగుతాయి తప్ప తరగవు. ప్రపంచంలో ఎక్కడైనా భూభాగాలపై స్వామ్యాన్ని సాధించటం సులభం. ప్రజల హృదయాలను గెలుచుకోవటం కష్టం. రాజకీయ విసుర్లు ప్రతివిసుర్లతో ఆర్టికల్ 370పై పదేపదే సవాళ్లు చేయటం కంటే కశ్మీరు ప్రజలను సమాధానపరచటానికి మార్గాలను అన్వేషించటం ప్రస్తుతం అత్యవసరం. సంపూర్ణ హక్కులతో రాష్ట్ర హోదాను జమ్మూకశ్మీర్‌కు కలగచేస్తే ఆ దిశగా కీలక అడుగుపడుతుంది. అదికూడా జరక్కపోతే చరిత్ర తిరిగే మలుపులను ఊహించలేం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ప్రపంచంలో ఎక్కడైనా భూభాగాలపై స్వామ్యాన్ని సాధించటం సులభం. ప్రజల హృదయాలను గెలుచుకోవటం కష్టం. రాజకీయ విసుర్లు ప్రతివిసుర్లతో ఆర్టికల్ 370పై పదేపదే సవాళ్లు చేయటం కంటే కశ్మీరు ప్రజలను సమాధానపరచటానికి మార్గాలను అన్వేషించటం ప్రస్తుతం అత్యవసరం. సంపూర్ణ హక్కులతో రాష్ట్ర హోదాను జమ్మూకశ్మీర్‌కు కలగచేస్తే ఆ దిశగా కీలక అడుగుపడుతుంది. అదికూడా జరక్కపోతే చరిత్ర తిరిగే మలుపులను ఊహించలేం!

కశ్మీర్‌టైమ్స్ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ప్రముఖ జర్నలిస్టు అనురాధ భాసిన్ 'ఎ డిస్‌మాంటల్డ్ స్టేట్' అనే పేరుతో రాసిన చరిత్రను విస్మరిద్దామనుకున్నా విస్మరించలేం! ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా కశ్మీర్‌లో జరిగిన పరిణామాలపై ఇప్పటివరకూ వినిపించని కథ వినిపిస్తున్నానంటూ సాహసోపేతంగా ఎన్నో ఘటనలను కళ్లముందుంచారు.

'పునర్విభజన' సమ ప్రాతినిధ్యం కల్పించేనా?



వచ్చే ఏడాది జనగణన ప్రక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. అందులో ఒకటి మహిళా రిజర్వేషన్ చట్టం కాగా, రెండోది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అమలు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. తద్వారా అన్ని ప్రాంతాలు, వర్గాలకు న్యాయబద్ధమైన హక్కుగా తగిన ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరి కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితమవుతుందా? లేక లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను కూడా పెంచుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాలు, ప్రాంతాలకు పారదర్శక ప్రాతినిధ్యం లభించే దిశగా రానున్న జనాభా లెక్కలు ఓ మలుపుగా నిలవాల్సిన అవసరమున్నది.

పదేండ్లకోసారి జనగణన చేయడమనేది పాలన, ప్రణాళికలో చాలా ముఖ్యమైన ప్రక్రియ. జనాభా, ప్రజల స్థితిగతులు, అవసరాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, వనరుల పంపిణీకి జనగణన ఉపయోగపడుతుంది. అంతేకాకుండా నియోజకవర్గాల పునర్విభజనకు కూడా జనాభా లెక్కలే ప్రామాణికంగా నిలుస్తాయి. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా ప్రక్రియ సమర్థవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమమవుతుంది.

భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సుదీర్ఘమైన చరిత్ర ఉన్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు గాను డీలిమిటేషన్ ప్రక్రియను మొదటిసారిగా తీసుకొచ్చారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో భిన్న ప్రాంతాల్లో, భిన్న స్థాయిలో జనాభా కలిగి ఉండటం, విభిన్న వర్గాలు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పిస్తూ సమతుల్యత పాటించేందుకు వీలుగా ఈ ప్రక్రియను చేపట్టారు. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జనాభా నియంత్రణ కార్యక్రమం దక్షిణాది రాష్ట్రాల్లో విజయవంతంగా అమలైంది. అందువల్ల ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉన్నది. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన చర్చ జరుగుతున్నది. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన చేస్తే జనాభా నియంత్రణ, ఆర్థికాభివృద్ధిలో చైతన్యం కనబర్చిన రాష్ట్రాలుగా సీట్ల పెంపులో వెనుకబడిపోవడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలు మూల్యం చెల్లించుకున్నట్టవుతుందని కొందరు పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఉండేందుకు 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు. లేకపోతే, జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాదిన సీట్లు భారీగా పెరిగి, లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురైతే దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక వనరుల పంపిణీ, సామాజిక అభివృద్ధి, ముఖ్యంగా రాజకీయంగా, పాలనలో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకం. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. అంతేకాదు, నియోజకవర్గాల పునర్విభజన ద్వారా మహిళలకు దక్కాల్సిన సీట్ల సంఖ్య కూడా పెరిగే ఆస్కారమున్నది. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేందుకు ఎదుర్కొంటున్న ఆటంకాలు తొలగిపోతాయి.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉన్నది. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. అలాంటి సమగ్ర సమాచారాన్ని విశ్లేషిస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు, భావనలను గౌరవించినట్టు అవుతుంది. ఏండ్ల తరబడి జనాభా వృద్ధి రేటులో స్థిరత్వాన్ని పాటిస్తూ, ఆర్థికాభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు పారదర్శకమైన ప్రాతినిధ్యం లభించే విధంగా 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటిస్తామనే భరోసా కల్పించాలి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సీట్లు కేటాయించాలి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. సమగ్ర, శాస్త్రీయ దృక్పథంతో నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే భారతదేశ సమాఖ్య, ప్రజాస్వామిక స్ఫూర్తి పరిఢవిల్లుతుంది. రాజ్యాంగంలోని మొదటి అధికరణ నిర్దేశించినట్టు 'India that is Bharath, shall be a Union of States' అనే మాటను ప్రతిబింబించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండాలి. అందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజాస్వామ్యానికి, దేశ సమగ్రతకు తలవంపులు తెచ్చే విధంగా డీలిమిటేషన్ ప్రక్రియ చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.

■ బోయినపల్లి వినోద్‌కుమార్

పార్లమెంట్ మాజీ సభ్యులు

సమగ్ర, శాస్త్రీయ దృక్పథంతో నియోజకవర్గాలను పునర్విభజించి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే భారతదేశ సమాఖ్య, ప్రజాస్వామిక స్ఫూర్తి పరిఢవిల్లుతుంది. రాజ్యాంగంలోని మొదటి అధికరణ నిర్దేశించిన 'India that is Bharath, shall be a Union of States' అనే మాటను ప్రతిబింబించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండాలి. అందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.





భద్రకాళి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం

భద్రకాళి ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న మంత్రి సురేఖ

- దేవాదాయ శాఖ మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా భద్రకాళి దేవాలయంలో నిర్వహించిన దీపోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈవో శేషు భారతి, అర్చకులు శేషు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం శ్రీభద్రకాళి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన దీపోత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో మాడవీధులు, రాజగోపురం, వేద పాఠశాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట మండల కేంద్రంలో ఇంటింటి కుటుంబ సర్వే

సర్వేపై.. సందేహాలెన్నో!

- పూర్తి సమాచారం ఇచ్చేందుకు యజమానుల నిరాకరణ
- 'గోప్యత'పై ప్రభుత్వం భరోసానిస్తున్నా వీడని అనుమానాలు
- సర్వేకు సహకరించని సంపన్నులు
- వివరాల సేకరణలో ఎన్యూమరేటర్ల ఇబ్బందులు
- మధ్యాహ్నం వేళ ఇళ్లలో ఎవరూ ఉండని పరిస్థితి
- అసమగ్రంగా సాగుతున్న ఇంటింటి కుటుంబ సర్వే
- ఇంకా మొదలు కాని డాటా కంప్యూటీకరణ
- సిబ్బందిపై పెరుగుతున్న ఒత్తిడి



హనుమకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల, తెగలు, వెనుబడిన తరగతులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ సర్వే ద్వారా తాము సేకరిస్తున్న సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని.. ప్రజలు నిర్భయంగా తమ స్థితిగతుల వివరాలను ఎన్యూమరేటర్లకు చెప్పాలని సూచిస్తోంది. అయినా ప్రజల్లో మాత్రం సందేహాలు వీడటం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. సర్వేకు వెళ్లిన అధికారులతో ప్రజల తమ సందేహాలు, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. దీంతో సర్వే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలోనే సర్వేలో కొందరు వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు.. ముఖ్యంగా సంపన్న కుటుంబాల నుంచి భిన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు. కొన్ని చోట్ల మహిళా ఎన్యూమరేటర్లతో కొందరు అసభ్యంగా మాట్లాడుతున్నారని, ఒక్కొక్కరు వెళ్తే నమ్మడం లేదని చెబుతున్నారు. దీంతో కనీసం ఇద్దరిని పంపాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు పాట్లు

సర్వే ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ, మున్సిపాలిటీ సిబ్బందిని నియమించారు. ఈనెల 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కాగా సర్వే ఫారాలు సకాలంలో అందక కొన్ని చోట్ల ఒక రోజు ఆలస్యంగా మొదలైంది. ఇప్పటికీ ఎన్యూమరేటర్లకు సర్వే ఫారాలు చాలినన్ని అందడం లేదన్న ఫిర్యాదులున్నాయి. కుటుంబ సర్వే విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లి.. మధ్యాహ్నం తర్వాత సర్వేలో ఇంటింటికి వెళుతున్నారు. అయితే పగలు సమయంలో ఇళ్లలో చాలామంది ఉండకపోతుండటంతో వివరాల సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వెళ్లిన ప్రాంతానికే మళ్లీ వెళుతూ వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈనెల 18వ తేదీలోపు గణన పూర్తి చేయాలన్న ఆదేశాలతో చేసేది లేక వారు ఉదయం 6గంటలకే సర్వేకు వెళ్లి 8గంటలకు అటునుంచి అటే స్కూళ్లకు వెళుతున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం స్కూలు అయిపోగానే మళ్లీ సర్వే విధులకు వెళుతున్నారు. కొందరు ఉపాధ్యాయులైతే రాత్రి 8 గంటల వరకు సర్వేలో ఉంటున్నారు. ఈ క్రమంలో అలసి పోయి కొందరు ఉపాధ్యాయులు అనారోగ్యం పాలవుతున్నారు. సర్వే విధులను కేటాయింపులో సహేతుకత లోపించదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ల(ఎస్‌జీటీలు)కు ఎన్యూమరేటర్ల విధులు ఇచ్చి పెద్దగా పని ఒత్తిడి లేని, కాంట్రాక్టు సీఆర్‌పీలను సూపర్వయిజర్లుగా నియమించడం పట్ల ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ (పీటీఐ)లను ఎన్యూమరేటర్లు నియమించగా వీరిలో చాలా మంది తమ పలుకుబడిని ఉపయోగించి మినహాయింపు పొందడంతో ఆ భారం కూడా టీచర్లపైనే పడుతోంది.

ఇన్ని ప్రశ్నలా?

సర్వే ఫారం చాంతాడంత ఉండడం కూడా ఇబ్బందులకు గురి చేస్తోంది. పార్ట్-1, పార్ట్ -2 పేరుతో 75 ప్రశ్నలను గుప్పిస్తుండడంతో ఇంటి యజమానులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పైగా ఇన్ని ప్రశ్నలా? ఇవన్నీ అవసరమా ? అని సర్వే సిబ్బందిపై ప్రశ్నలు వర్షం కురిపిస్తున్నారు. కొందరైతే వివరాలు చెప్పడానికి విసుక్కుంటున్నారు. చాలా ప్రశ్నలు అనవసరమని భావించి జవాబులు చెప్పటానికి నిరాకరిస్తున్నారు. దీంతో ఒక్కో ఇంటిని సర్వే చేయడానికి ఎన్యూమరేటర్‌కు గరిష్ఠంగా 45 నిమిషాలు అంతకన్నా ఎక్కువగానే పడుతోంది. అంతసేపు ఇంటి పెద్ద ఓపిగ్గా కూర్చుని వివరాలు ఇవ్వడం ఇబ్బందిగా భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలో పలు ప్రశ్నలకు జవాబులు ఇవ్వడానికి సమాచారం ప్రజల వద్ద లేకపోవడంతో వెతుక్కోవలసిన పరిస్థితి ఎదురవుతోంది. తమ దగ్గర పత్రాలన్ని తెచ్చి ఎన్యూమరేటర్ల ముందు పడేసి అందులో చూసి రాసుకొమ్మని కూడా అంటున్నారు. సర్వే ఫారంలో పేర్కొన్న ప్రకారం కోళ్లు, గొర్రెలు, పశువులు తదితర వివరాలు ఎందు కంటూ నిలదీస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో సర్వే గణాంకాలిలా..

జిల్లా	కుటుంబాలు	బ్లాకులు	ఎన్యుమరేటర్లు	సూపర్వైజర్లు
హనుమకొండ	3,00,000	1,916	1,916	218
వరంగల్	1,45,882	1,841	1,841	204
జనగామ	1,62,512	1,350	1,350	145
మహబూబాబాద్	2,45,953	1,884	1,884	186
ములుగు	97,552	7,13	7,13	74
భూపాలపల్లి	1,31,030	1,043	1,043	121
మొత్తం	**10,82,929**	**8,747**	**8,747**	**948**

ఏరోజు కారోజు..

పూర్తి చేసిన సర్వే ఫారాలను ఏ రోజు కారోజు ఎంపీడీవో కార్యాలయాల్లో సూపర్వైజర్లకు అప్పగిస్తున్నారు. అయితే ఎన్యూమరేటర్లు వెళ్లే సరికి ఆ సూపర్వైజర్లలో కొందరు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు మళ్లీ అక్కడకు వచ్చే దాకా ఉండి అందచేయాల్సివస్తోందని సమాచారం. ఉదయం సర్వే ఫారాలు తీసుకోవడం, వాటిని తిరిగి ఇచ్చే విషయంలో ఎన్యూమరేటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. సేకరించిన వివరాలను ఏ రోజుకారోజే కంప్యూటరైజ్ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా ఆ ప్రక్రియ ఇప్పటి వరకు ఎక్కడా ప్రారంభం కాలేదని తెలుస్తోంది.

సందేహాలతో అసమగ్రంగా ప్రక్రియ

సర్వేలో చాలా మంది పూర్తి వివరాలు ఇవ్వడానికి వెనుకాడుతుండటం, ఆస్తులు, ఆదాయం, భూములు.. ఇతరత్రా వివరాలు ఇవ్వడం ద్వారా మున్ముందు సంక్షేమ పథకాల్లో కోత పడుతుందేమోనన్న అనుమానాలతో గోప్యత పాటిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ

మిగతా 8వ పేజీలో...



పత్తి కొనుగోల్లు నిలిచిపోయిన నేపథ్యంలో రైతులతో మాట్లాడుతున్న కార్యదర్శి నిర్మల

పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన

- మార్కెట్లో సుమారు 4 గంటల పాటు నిలిచిన కాంటాలు
- ఇబ్బందులు పడిన రైతులు

6

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



- 'సంపూర్ణ అభియాన్' ద్వారా కేంద్రం కృషి
- అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- నీతి ఆయోగ్ సూచించిన రంగాల్లో సత్ఫలితాలు సాధించాలి
- నిరుపేదల అభ్యున్నతికి పాటుపడాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విస్తృత పర్యటన

6

శానిటేషన్ సమస్యలను పరిష్కరించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో 67 ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు అభ్యర్థించే ఫిర్యాదులతో పాటు శానిటేషన్ సమస్యపై అధికారులు దృష్టిసారించి సకాలంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి సమస్య పరిష్కరించాలని అధికారులను సూచించారు. టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల సిబ్బంది ఎల్ఆర్ఎస్‌పై దృష్టిసారించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన జరుగుతుందని టీపీఎస్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు ఎకరువు పెట్టారు. కమిషనర్ నేరుగా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వెంటనే అక్కడి విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 67 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంరాజు, పోలెపాక అనిల్ కుమార్, భాషా నాయక్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 7, హెల్త్, శానిటేషన్ - 7, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 9, టౌన్‌ప్లానింగ్ - 35, తాగు నీటి సరఫరా - 09 మొత్తం 67 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

- గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాలపురం సాయిగణేశ్ కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైనే నిలుస్తూ దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- నెక్కొండ రోడ్డులోని రంగశాయిపేట, శంభునిపేట, గవిచర్ల క్రాస్‌రోడ్డు ప్రాంతంలో చాలా కాలంగా మంచి నీరు రావడం లేదు. అంతే కాకుండా ఈ ప్రాంతానికి చెత్త వేయడానికి స్వచ్ఛ ట్రాక్టర్ రాకపోవడం వల్ల ఇళ్లలో చెత్త పేరుకుపోతుందని ఫిర్యాదు చేశారు.
- వరంగల్ నగరంలోని 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో కోతల బెడద ఉందని కాలనీవాసులు కమిషనర్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- 15 రోజుల్లో కేసులు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి అధికా రులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కలెక్టరట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, ఇతర శాఖల అధికారులతో సోమవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన చైర్మన్ వెంకటయ్యకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మొక్కను అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను డీసీపీలు రవీందర్, సలీమా, ఏసీపీలు తిరుమల్, దేవేందర్‌రెడ్డి, తిరుపతి, కిశోర్‌కుమార్‌లుఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల గురించిన వివరాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లి అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భూ వివాదాలకు సంబంధించిన కేసులు, అట్రాసిటీ కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో జరుగుతుందని హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, పోలీస్ అధికారులను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎంత మంది బాధితులకు పరిహారం అందిందనే వివరాలను జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి శ్రీలతను అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

అనంతరం చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసులను 15 రోజుల్లో పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. హసన్‌పర్తి మండలంలోని మునిపల్లి గ్రామంలో దళితుల భూ సమస్యకు సంబంధించి వారం రోజుల్లో నివేదికను అందజేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని, అదేవిధంగా ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే తప్పకుండా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. సివిల్ రైట్స్ డే నిర్వహణకు సంబంధించి సంవత్సర కాలానికి తహశీల్దార్, ఎస్సై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సివిల్ రైట్స్ డే నిర్వహించకపోతే చర్యలు తప్పవన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల బాధితులకు పరిహారం అందేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ నెల 18వ తేదీన ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంపై మాట్లాడనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మొత్తం 21 కేసులపై తహసీల్దార్ల నుంచి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజుల్లో సమగ్ర నివేదికను కమిషన్‌కు అందజేస్తామన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నూనావత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్‌కుమార్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, జవహర్‌లాల్ నాయక్, చుంచు రాజేందర్, రడపాక పరంజ్యోతి, సింగారపు రవిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- సీకేఎం, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల తనిఖీ



హనుమకొండ ప్రభుత్వ ప్రసూతిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌వీ కర్ణన్

గిర్మాజీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ వైద్య కళాశాలకు బోధన ఆస్పత్రి అయిన సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సీకేఎం ఆస్పత్రిని సందర్శించారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని తనిఖీచేసిన అనంతరం నేరుగా ఇన్‌పేషంట్ బ్లాక్‌కు వచ్చి ప్రసవాల గదిని పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్రచికిత్సలు, వైద్య సేవల గురించి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బేబిరాణి, ఆర్ఎంవోలు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ సత్యజిత్‌రే, డాక్టర్ దిలీప్ వివరించారు. నిత్యం 220 మంది ఇన్‌పేషంట్లు, 400కు పైగా అవుట్‌పేషంట్లు చికిత్స పొందుతుంటారని తెలిపారు. నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అయితే ఆస్పత్రిలో పీజీ వైద్యులు ఎక్కువగా ఉన్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రసవాల సంఖ్య పెంచాలని కమిషనర్ ఆదేశించారు. ఆస్పత్రిలో పరిశుభ్రత, సెక్యూరిటీ

మిగతా 6వ పేజీలో...



కాళోజీ హెల్త్‌వర్సిటీ కొత్త వీసీ నియామకంపై ఉత్కంఠ

- ముగ్గురి పేర్లతో సీఎం వద్దకు ఫైల్?
- పదేళ్లుగా ఒక్కరే ఉపకులపతి

8

102లో పైలట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 102 వాహనాల్లో పైలట్ (డ్రైవర్) ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా 108 ప్రోగ్రాం మేనే జర్ పాటి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, 22 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు, హెవీ ట్రాన్స్‌పోర్ట్ బ్యాడ్జి కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొ న్నారు. ఈ నెల 13వ తేదీన హనుమకొండ కలెక్టరేట్‌లోని 108 కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచిం చారు. మరిన్ని వివరాలకు 91007 99258 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన

4 గంటల పాటు నిలిచిన కాంటాలు

వరంగల్ వ్యవసాయం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ నిబంధనల కారణంగా మిల్లర్లు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శని, ఆదివారాల సెలవుల అనంతరం సోమవారం మార్కెట్‌కు పెద్ద ఎత్తున పత్తి అమ్మకానికి రావాల్సి ఉంది. అయితే మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేయడంలేదన్న సమాచారంతో రైతులు ఎక్కువగా రాలేదు. వచ్చిన వారు సుమారు నాలుగు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల రైతులతో మాట్లాడి విషయాన్ని వివరిం చారు. మరోవైపు రైతులు ఎలాంటి గొడవలు చేయకుండా ఏనుమాముల సీఐ రాఘ వేందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకు మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధి కారుల నుంచి అందిన సమాచారం మేరకు కొనుగోళ్లను ప్రారంభించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రి నేతృత్వంలో చర్చలు

పత్తి కొనుగోళ్లలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం హైదరాబాద్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ లలిత్ కుమార్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, తెలం గాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో చర్చలు జరి పారు. పత్తి కొనుగోళ్లలో తలెత్తుతున్న ఎల్ 1, ఎల్2, ఎల్3తో పాటు తేమ విష యంలో వస్తున్న ఇబ్బందులు, నిబంధనల సడలింపుపై బొమ్మినేని రవీందర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. చివరికి చర్చలు సఫలం కావడంతో కొనుగోళ్లకు అను మతించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సమస్య సద్దుమనిగింది.

సీసీఐ నిబంధనలు కఠినంగా ఉన్నాయి
- బాలు చెన్నారావుపేట రైతు

సీసీఐ నిబంధనల కారణంగా పత్తికి కనీస మద్దతు ధర కూడా దక్కకుండా పోతోంది. అసలే అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కనీసం ధరైనా బాగుంట దని అనుకుంటే అది కూడా అందడం లేదు. పత్తి క్వింటాకు పది వేల రూపాయలు పలికితేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలి.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



రుద్రాక్షలను ప్రదర్శిస్తున్న గంగు ఉపేంద్రశర్మ, దుర్గాప్రసాద్

కాళోజీ జంక్షన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నక్కలగుట్టలోని హరి త కాకతీయ హోటల్లో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మా సం సందర్భంగా రుద్రాక్షలు ధరించడం వల్ల సకల ఐశ్వర్యాలు సమకురుతాయని అన్నారు. ప్రధానంగా కార్తీకమాసంలో పంచముఖి రుద్రాక్ష ధరించడం వల్ల బ్రహ్మ, శివరూపాలను ధర్మించిన వారమవుతామని పేర్కొన్నారు. నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలతో పాటు స్ఫటిక, తులసి, నవరత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలిగ్రాములు, మర్కట శివలింగాలు, దైవికమైన వస్తువులు సరస మైన ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు. జన్మనక్షత్రాన్ని పరిశీలించి అసలైన రుద్రాక్ష లను ఇస్తామని చెప్పారు. ఈ ప్రదర్శన ఈ నెల 20 వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేపాల్ రుద్రాక్షల డైరెక్టర్ జి. పద్మలత తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- సంపూర్ణ అభియాన్ ద్వారా కేంద్రం కృషి
- నీతి ఆయోగ్ సూచించిన రంగాల్లో సత్ఫలితాలు సాధించాలి
- నిరుపేదల అభ్యున్నతికి పాటుపడాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విస్తృత పర్యటన



ములుగు కలెక్టరేట్‌లో సమీక్షలో మాట్లాడుతున్న బండి సంజయ్

భూపాలపల్లి కలెక్టరేట్/మహాముత్తారం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ద్వారా విశేష కృషి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆయన సోమవారం విస్తృతంగా పర్యటించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన విద్య, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, ప్రణాళిక శాఖ అధికారులతో సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో భాగంగా మహాముత్తారం, పలిమెల బ్లాక్‌లో అమలు చేస్తున్న సంపూర్ణ అభియాన్ కార్యక్రమంపై సమీక్షించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ సంపూర్ణ అభియాన్ పారామీటర్స్‌పై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. భూపాలపల్లి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు, నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. మహిళలకు గర్భధారణ అయిన నాటి నుంచే సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో మిల్లెట్ కేంద్రం ఏర్పాటు చేయడం అభినం దనీయమన్నారు. గిరివికాస్ పథకం కింద 186 సర్వీ సులను మంజూరుచేశామని, మరో 136 సర్వీసులను మంజూరు చేయాల్సి ఉందని, దీనిపై తక్షణమే చర్యలు చేపడతామని అన్నారు. ప్రభుత్వ పాఠ శాలల్లో మరుగుదొడ్లు, మంచినీరు, వి ద్యుత్ తదితర సౌకర్యాలను ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నీతి ఆయోగ్ బ్లాక్ విలేజ్ అయిన మహాముత్తారం మండలం కేంద్రంలో పర్యటించిన బండి సంజయ్ వైద్య ఆరోగ్య, ఉద్యాన, డీఆర్డీవో, సంక్షేమ, విద్యా శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అదే ప్రదేశంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. మహాముత్తారం నిమ్మగూడెం నుంచి కనుకునూరు వరకు ఉన్న 16 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి అటవీశాఖ అడ్డుకుంటోందని స్థానికులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అధికారులతో మాట్లాడతానని అన్నారు. ఆయన వెంట కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, వి జయలక్ష్మి ఉన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి

ములుగు (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని మారుమూల వెనుకబడిన ప్రాంతాలు, నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. ములుగు జిల్లాలో ఆయన సోమవారం పర్యటించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయనకు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, జి.సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఆతర్వాత ములుగులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వెనుకబడిన మండలమైన కన్నాయిగూడెంలో నీతి సూచికలను, జూలై నుంచి సెప్టెంబరు వరకు జరిగిన సంపూర్ణత అభియాన్ గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2023లో దేశవ్యాప్తంగా 500ప్రత్యేక బ్లాక్‌లను గుర్తించి ఆప్రాంతాల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 10బ్లాక్‌లను ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలాన్ని ఎంచుకున్నామన్నారు. ఆరు ప్రామాణిక అంశాలుగా తీసుకుని లక్ష్యాన్ని ఏ మేరకు చేరుకో వడంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తుతున్నాయని, తదితర అం శాలను తెలుసుకొనేందుకే జిల్లాకు వచ్చానన్నారు.

ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

(5వపేజీ తరువాయి)

సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య చికిత్సపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య పరికరాలు పాడైనవి ఉంటే వెంటనే వాటిని మరమ్మతు చేయించాలని కమిషనర్ సూచించారు. న వజాత శిశువార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశా రు. ఆస్పత్రి సమస్యలను కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవా లని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా వైద్యాధి కారి డా క్టర్ సాంబశివరావు, హనుమకొండ జిల్లా వైద్యాధి కారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్‌వోలు డాక్టర్ ప్ర కాష్, డాక్టర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

వరంగల్ మెడికల్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీ సుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్‌వి .కర్ణన్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రసూతి ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటరును సందర్శించి రోజుకు ఎన్ని టీపా స్కానింగ్, గైనిక్ స్కాన్‌లు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆ వివరాలను టీ డయాగ్నస్టిక్ హబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ల్యాబ్, వార్డు, నవజాత శిశువుల సంరక్షణ కేంద్రం, మిల్క్ బ్యాంక్, ఐసీటీసీ సెంటర్లను తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్‌లలో ఉన్న వసతులు, పరికరాలు, గైనకాలజిస్టులు, అనస్తీషియా వివరాలు తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. మెడికల్ స్టోర్‌లలో ఉన్న మందుల వివరాలను సైతం పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి గైర్హాజరు, సెలవులో ఉన్న వారి వివరాలపై ఆరాతీశారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, పీపీడీటీటీ డాక్టర్ కె.లలితాదేవి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మీ, ఆర్‌ఎంవో డాక్టర్ అంబరీష్, డాక్టర్ నాగరాజు, వి.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు

పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన వరంగల్ కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ సత్యశారద ప్రజల నుంచి దరఖా స్తులు స్వీకరించారు. పరిశీలించి సంబం ధిత శాఖల అధికారులకు రిఫర్ చేశారు. సకాలంలో పరిష్కరించాలని ఆదేశించా రు. గతంలో వచ్చిన వినతులే మళ్లీ మళ్లీ వస్తున్నాయని, వాటిపై దృష్టి సారించాల ని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 95 వినతులు అందగా ఇందులో రెవె న్యూశాఖకు సంబంధించి 45, కలెక్టరే ట్‌కు 10, జిల్లా ఉపాధి శాఖకు సంబం ధించి 6, వివిధ సమస్యలపై మరిన్ని వి నతులు వచ్చాయి. డీఆర్‌వో విజయల క్ష్మి, ఆర్డీవో ఉమారాణి, జిల్లా పరిషత్ సీ ఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, అధికారులు పాల్గొన్నారు.

వరదనీటితో నష్టపోతున్నాం..
పర్వతగిరి పెద్ద చెరువు
ముంపు బాధిత రైతులు

పర్వతగిరి మండలంలోని పెద్ద చెరువు రిజర్వాయర్‌తో పాటు పోలకమ్మ చెరువు మధ్యలో ఉన్న సుమారు 100 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. రిజ ర్వాయర్ తూములు సరిగా నిర్మించకపో వడంతో నీరు పంట పొలాల నుంచి నీరు వెళుతుండటంతో గత మూడు సం వత్సరాలుగా పంటలు సాగు చేయడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. రిజర్వాయర్ తూములు సరిగా నిర్మించి, పోలకమ్మ చెరువు తూముల ద్వారా నీరు విడుదలయ్యేలా మరమ్మతు చేసి న్యాయం చేయాలి.

అక్రమణదారులపై
చర్యలు తీసుకోవాలి

సోమయ్య, రెడ్లవాడ,
నెక్కొండ మండలం, వరంగల్

రెడ్లవాడ గ్రామంలో సర్వేనెంబర్ 391లోని 5 ఎకరాల 30 గుంటల భూ వి ని నారబోయిన ఎల్లయ్యకు కౌలుకు ఇ చ్చి హైదరాబాద్‌కు వలస వెళ్లాం. అయి తే మాకు తెలియకుండానే నారబోయిన ఎల్లయ్య 2 ఎకరాల 20 గుంటల భూమి ని తన పేరిట అక్రమంగా పట్టా చేయిం చుకున్నాడు. ఆయనపై చర్యలు తీసు కొని మాకు న్యాయం చేయాలి.

పది పరీక్ష ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లా లోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 10వ తర గతి చదువుతున్న విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 18వ వరకు పరీక్ష ఫీ జు చెల్లించాలని డీఈవోలు మామిడి జ్ఞానేశ్వర్, దౌలాగర్ వాసంతి సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో డిసెం బరు 2 వరకు, రూ. 200 అపరాధ రుసుముతో డిసెంబరు 12 వరకు, రూ. 500 అపరాధ రుసుముతో డిసెంబరు 21 వరకు పరీ క్ష ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

నాస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)పై ఉపాధ్యాయులందరూ శ్రద్ధ వహించాలని డీఈవో దౌలాగర్ వాసంతి అన్నారు. సోమవారం హనుమ కొండ భీమారంలోని సిల్ స్టోర్క్ పాఠశాలలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రిన్సిపా ల్స్‌తో విద్యాశాఖలో అమలవుతున్న కార్యక్రమా ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాఠశాలల్లో విద్యార్థులు ఏయే సామర్థ్యాల్లో వెనకబడి ఉన్నారో గుర్తించి వారిలో ఆయా సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో రాంధన్, రాధ, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, డీఎస్‌వో శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

నేటి పారామెడికల్ కౌన్సెలింగ్ వాయిదా

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12వ తేదీన నిర్వహిం చాల్సిన డిప్లోమా పారా మెడికల్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకట నలో తెలిపారు. తదుపరి కౌన్సెలింగ్ నిర్వహించే తేదీని ప్రకటిస్తామని, అభ్యర్థులు ఎలాంటి అయో మయానికి గురి కావద్దని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా కేటీఆర్ మాటలు : కూరపాటి

బాలసముద్రం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : బీసీ సామాజిక వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నిక ల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాజీ మంత్రి కేటీఆర్ విలేకరుల సమావేశంలో డిమాం డ్ చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నదని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అభిప్రాయ పడ్డారు. సోమవారం హనుమకొండ బాలసము ద్రంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన విలే కరుల సమావేశంలో మాట్లాడారు. అనేక మంది ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ లో తొమ్మిదిన్నర ఏళ్లపాటు కుటుంబ, వారసత్వ , ఆధిపత్య, నిరంకుశ పాలన కొనసాగించిన కుటు ంబానికి వెనుకబడిన కులాల గురించి ప్రజాస్వ మ్యం గురించి మాట్లడే నైతిక హక్కు లేదని అన్నారు. అధికార పీఠాన్ని అధిష్టించి కుటుంబా నికి, దగ్గరి బంధువులను అధికార పదవుల్లో కూర్చోబెట్టి రాష్ట్ర వనరులను దోపిడీకి గురి చేసి న పాలనను ప్రజలు ఇంకా మరిచిపోలేదని అన్నారు. సమావేశంలో సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, చెన్నూరి రమేష్, బగ్గి రాజు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

సామూహిక అర్చనలు, అభిషేకాలు



ఆకారపు వారి దేవాలయాల్లో సామూహిక అభిషేకాలు చేస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో కార్తీక పూజలు కొనసాగుతున్నాయి. కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో భక్తులు శివా లయాలను సందర్శించి అభిషేకాలు నిర్వహించారు. భక్తుల ఆరాధనలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలతో ఆలయాల్లో అధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. ఉదయం 4 గంటల నుంచే శివాలయాల్లో పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని కాశీబుగ్గ శివాలయం, రామన్నపేటలోని రామలింగేశ్వరుడు, మట్టెవాడలోని భోగేశ్వరు డు, పిన్నవారివీధిలోని దుర్గేశ్వరుడు, ఆకారపు వారి గుడిలోని కాశీ విశ్వేశ్వరుడు, దాసాంజనేయ ఆలయంలోని శివుడు, దత్తక్షేత్రంలోని సచ్చిదానందేశ్వరుడు, గురుధా మంలోని శివుడు, రంగంపేటలోని భద్రేశ్వరుడు, ఓసిటీలోని శివాలయం, కరీమాబాద్‌లో ని బొమ్మలగుడి, ఖిలావరంగల్‌లోని శంభులింగేశ్వరాలయం, శివనగర్‌లోని రామాల యం, పెరుకవాడలోని శివాలయంల్లో కార్తీక సోమవారం అభిషేకాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సామూహికంగా అభిషేకాలను ఆచరించారు. సా యంత్రం దీపాలను వెలిగించి ఆకాశ దీపాన్ని దర్శించుకున్నారు.

చిట్‌ఫండ్ ఎదుట బాధితుల ఆందోళన

పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ



చిట్‌ఫండ్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

బాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమ కు చిట్టి డబ్బులు ఇవ్వడంలేదంటూ హనుమకొండ బాలసముద్రంలోని ఓ చిట్‌ఫండ్ కంపెనీ ఎదుట బాధి తులు సోమవారం ఆందోళన చేశారు. పోలీసులు, బాధి తుల కథనం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సదరు చిట్‌ఫండ్ కంపెనీకి డబ్బులు కట్టినవారికి తిరిగి ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని వివిధ జి ల్లాల నుంచి తరలొచ్చిన బాధితులు సుమారు 400 మంది సంస్థ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీ తో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హనుమ కొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి సీఐ సత్యనారాయ ణరెడ్డి, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఈ క్రమంలో బాధితులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. చిట్‌ఫండ్ యజ మాని మధ్యవర్తిగా కొందరు వ్యక్తులతో పోలీసులు మా ట్లాడి బాధితులకు న్యాయం చేయాలని చెప్పడంతో మధ్యవర్తిగా వచ్చిన వారు రూ.2లక్షల లోపు ఉన్నవారికి డిసెంబరు, జనవరి నెలల్లో డబ్బులు చెల్లిస్తామని, కొంద రికి భూములను రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇవ్వడం తో గొడవ సద్దుమణిగింది. హనుమకొండ, సుబేదారి పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

వినతులు స్వీకరించిన మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ సోమవారం ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి విన తులను స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలోనే ఉండి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదే శించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్ని పనులున్నా తాను ముందు నియోజకవర్గ ప్రజల సమస్యల పరి ష్కారానికే ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు కూరగాయల మార్కెట్‌కు మంత్రి సురేఖ

వరంగల్ వ్యవసాయం, నవంబరు11: (ఆంధ్రజ్యోతి): వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను మంగళవారం ఉదయం మంత్రి కొండా సురేఖ సందర్శించనున్నారు. వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడి మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు తెలిసింది.

కల్యాణ మండప నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

కాశిబుగ్గ(ఆంధ్రజోతి): కాశిబుగ్గ శ్రీ రంగనాథ స్వామి ఆలయ స్థలంలో శివ పార్వ తుల కల్యాణ మండపం నిర్మించడానికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సోమవారం స్థానికులు మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే కల్యాణ మండపం నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓ సిటీలోని శ్రీ సీతారా మాంజనేయ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో కార్తిక మాసంలో కొన్ని సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులు మంత్రికి తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో ఏటా నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేశా మని, అయితే ప్రభుత్వ పరంగా చలువ పందిళ్లు, షెడ్లు, నీటి, విద్యుత్ సౌకర్యం కల్పిం చాలని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలిశాల ఆనంద్ కుమార్, ప్రధాన కార్య దర్శి దాసరి రాజేష్ తదితరులు మంత్రికి విన్నవించగా ఆమె స్పందించి వెంటనే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దొడ్డు రకం వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలి

ఎంపీ ఈటల రాజేందర్



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఈటల రాజేందర్

జనగామ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆంక్షలు లేకుండా సన్న, దొడ్డు రకం ధాన్యా నికి రూ.500 బోనస్ ఇవ్వాలని మల్కాజిగిరి ఎంపీ, బీ జేపీ జాతీయ నాయకులు ఈటల రాజేందర్ ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్ లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈటల మాట్లా డుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన ప్యాడీ క్లీనింగ్ మిషన్ లేక పోవడంతో రైతులు గంటకు రూ.వెయ్యి చెల్లించి ప్రైవేట్ ప్యాడీ క్లీనింగ్ మిషన్ రెంట్‌కు తీసుకొని ధాన్యం విక్రయిస్తు న్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ప్యాడీ క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని, రైతులు పండించే ప్రతి క్వింటాలు ధాన్యానికి రూ.500బోనస్ చెలిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చి న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హమాలీల చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని, కేం ద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలను కల్పిం చాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పు డు మిల్లులకు తరలించాలన్నారు. ఒక్కబస్తా 41 కిలో ల కాంటా వేసిన మిల్లులకు ధాన్యం తరలించాక మళ్లీ తాలు, మట్టి పేరుతో ధాన్యం కట్ చేసి రైతులను మో సం చేయవద్దన్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు సమస్యల గురించి ప్రభుత్వం మిల్లర్లతో చర్చలు జరి పిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేద ని కొనుగోళ్లు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ఆరుట్ల దశమంత్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, కత్తుల లక్ష్మి, సౌడ రమేశ్, మహం కాళి హరిశ్చంద్రగుప్త, బొమ్మకంటి అనిల్ గౌడ్, ఎలబో యిన రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట క్వింటాల్	క్వింటా గరిష్ఠ ధర	క్వింటా కనిష్ఠ ధర
మక్కలు (బిల్టీరకం)	2495	2080
పల్లికాయ (సూక)	5010	4000
కందులు	....	....
పెసళ్లు	....	....
పత్తి	6960	5500
పసుపు (కాడి)	11427	10565
పసుపు (గోల)	10806	10023
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	14000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341 ఏసీ	14000	11000
దేశీ ఏసీ	......	.....
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

క్రైం కార్నర్

భార్యపై దాడి చేసిన భర్త.. కేసు నమోదు

హసన్‌పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీకి చెందిన బిల్ల శాలిని, రణదీర్‌లు ఇద్దరు దంపతులు. 19 ఏళ్ల క్రితమే వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు అశ్రిత (10) అయాన్ష్ (7). గత మూడు సంవత్సరాలుగా బిల్ల రణధీర్ మద్యానికి బానిసై అప్పులు చేస్తూ పనిపాట లేకుండా కాలం గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే రణదీర్ తన భార్య శాలినిని తల్లి గారింటి నుంచి రూ.2 లక్షలు తీసుకొని రావాలంటూ తరచూ వేధింపులకు గురిచేసేవాడు. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు నిర్వహించి సర్ది చెప్పినప్పటికి అతడిలో మార్పు రావడం లేదు. ఈ క్రమంలోనే సోమవారం రోజున రణధీర్ తన భార్య శాలినిపై దాడి చేయగా ఇదే గ్రామంలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. దీంతో రణదీర్ కూడా శాలిని తల్లిగారింటికి వెళ్లి ఆమెతో పాటు ఆమె తండ్రి సాయిరి శివాజీ, తమ్ముడు సాయిరి రాకేష్‌పై ఇనుప సలాకుతో దాడి చేసి గాయపర్చగా రాకేష్ కుడి చేతికి ఇనుప చువ్వ గుచ్చుకొని తీవ్ర రక్తస్రావం అయ్యింది. బాధితురాలు శాలిని ఫిర్యాదు మేరకు ఆమె భర్త రణధీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

బావ బామ్మర్దుల ఘర్షణ


గాయపడిన రణధీర్

హసన్‌పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీకి చెందిన బిల్ల రణదీర్, సాయిరి రాకేష్‌లు ఇద్దరు బావబామ్మర్దులు. పద్మశాలి కాలనీకి చెందిన సాయిరి శివాజీ కూతురు శాలినిని రణధీర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరి మధ్య గత మూడేళ్లుగా తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే రణధీర్ సోమవారం తన భార్య శాలిని ఆమె తల్లిగారింట్లో గొడవపడుతుండగా మామ శివాజీ, బామ్మరిది రాకేష్‌లు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వినకుండా రణదీర్ తన చేతిలో ఇనుప చువ్వతో వారిపై దాడి చేయగా అప్రమత్తమైన రాకేష్ ఇంటి ఆవరణలో ఉన్న బీరు సీసా తీసుకొని రణధీర్‌పై దాడి చేశాడు. దీంతో రణధీర్‌కు మూడు చోట్ల గాయాలై తీవ్ర రక్తస్రావం కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలును ఫోన్‌లో వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టి రాలేదని, ఎవరు ఫిర్యాదు చేయలేదని రణధీర్ భార్య శాలిని ఫిర్యాదు చేయగా రణధీర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

వరంగల్‌సిటీ, నవంబరు11: (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవి శానిటరీ షాపులో చోరీ చేసిన నిందితులను మామునూరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ రాఘువేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 16వ తేదీన లేబర్‌కాలనీ ఏనుమాముల వంద ఫీట్ల రోడ్‌లో గల శ్రీ వైష్ణవి శానిటరీ షాపు తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు లక్షా యాభై వేల రూపాయల సామాన్లు ఎత్తుకెళ్లారని షాపు యజమాని ఎలుగం సతీష్ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన ఏనుమాముల ఎస్‌ఐ శ్రీకాంత్ సోమవారం ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో నిందితులు పల్లకొండ ఉపేందర్, కటకం ప్రణయ్‌లను అరెస్ట్ చేసి చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాఘువేందర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 30 మందికి మెజిస్ట్రేట్ ఎ.వెంకటేష్ రూ. 28,500 జరిమానాతో పాటు ఇద్దరికి సామాజిక సేవా శిక్షను విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి 32 మంది పట్టుబడగా 30 మంది కి జరిమానా విధించడంతో పాటు శంభునిపేట ప్రాంతానికి చెందిన మహమ్మద్ షబ్బీర్, ఆత్మకూరుకు చెందిన బయ్యా ప్రభాకర్‌కు రెండు రోజుల సామాజిక సేవ శిక్షను విధించారని తెలిపారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన తొమ్మిది మందికి రూ. 9000 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి


వరంగల్ కలెక్టరేట్‌లో ఆజాద్ చిత్రపటం వద్ద కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారుల నివాళి


హనుమకొండ కలెక్టరేట్‌లో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

బాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తో కలిసి దాస్యం వినయ్‌భాస్కర్ అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినికాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్, ఖలీల్, సీనియర్ నాయకులు సుంచు కృష్ణ, మైనార్టీ నాయకులు నయీమొద్దీన్, షఫీ, ఖుద్దూస్, రామ్మూర్తి, జానకిరామ్, వెంకన్న, విద్యార్థి నాయకులు, ప్రశాంత్, వీరు, మహేష్, రఘు, దేవి, రాజు, అరవింద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● వడ్డేపల్లి: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం మైనార్టీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● వరంగల్ కలెక్టరేట్: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ సత్యశారద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వో విజయలక్ష్మీ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి రమేశ్, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ: కలెక్టరేట్‌లో సోమవారం మౌలానా అబుల్ కలాం జయంతి నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, డీఎండబ్ల్యూవో మురళీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● శంభునిపేట: దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా, మైనారిటీ దినోత్సవాలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ తోటకూర శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కేడీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎడమ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివన్నారు. నూతన జాతీయ విద్యా విధానం-2020 పెను మార్పులను తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో భగీరథ్, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, పీఎల్ఎన్ మూర్తి, శైలజ, శ్రీధర్, సుస్మిత, కృష్ణవేణి, గీత, షరీఫ్, సమీనా, డాక్టర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేటలోని అరవింద పబ్లిక్ స్కూల్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్య ప్రాముఖ్యత గురించి కరస్పాండెంట్ పంచకం నర్సయ్య విద్యార్థులు వివరించారు. అదేవిధంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 దేశ అభివృద్ధికి సంకేతం అని స్కూల్ ప్రిన్సిపాల్ శేర్ల అనిల్ కుమార్ అన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరికలు



రైల్వే మజ్దూర్ యూనియన్‌లో చేరిన సంఘ్ నాయకులు

గిర్మాజిపేట, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రైల్వే సంఘ్ వరంగల్ శాఖ చైర్మన్ రాజ్‌కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు రైల్వేసంఘ్‌కు రాజీనామా చేసి సోమవారం రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ సమక్షంలో మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లోని రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రవీందర్ మాట్లాడుతూ రైల్వే కార్మికుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేసే కార్మిక సంఘం రైల్వే మజ్దూర్ యూనియన్ అని అన్నారు. డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్‌ను భారీ మేజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకు ముందు వరంగల్, ఎలుగూరు రైల్వేస్టేషన్‌లలో మజ్దూర్ యూనియన్ గెలుపు కోరుతూ ప్రచారం చేశారు.

ఈ కార్యక్రమాలలో రైల్వే మజ్దూర్ యూనియన్ వరంగల్ చైర్మన్ ముకుందం, కార్యదర్శి యుగంధర్, నాయకులు సమ్మయ్య, రాజేందర్, జానీ, బాబురావు, భాస్కర్‌రావు, సుధాకర్, సురేష్, రాజ్‌కుమార్, మహేష్, కుమార్, దినేష్, సతీష్, మహేష్, శ్రీనివాస్, చారి, రాజేష్, శ్రవణ్ కుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో హనుమకొండ చాంపియన్స్ పతిభ

వరంగల్ స్పోర్ట్స్ నవంబరు11:(ఆంధ్రజ్యోతి) : ఎఫ్ఎస్‌కేపీ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు గోవా రాష్ట్రంలో మపుసాలోని స్పోర్ట్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 24వ అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో హనుమకొండ నయీంనగర్ లోని హనుమకొండ చాంపియన్స్ కరాటే అకాడమీకు చెందిన క్రీడాకారులు సత్తాచాటి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టారు. అకాడమీకి చెందిన భరత్ కుమితి ఫైటింగ్ విభాగంలో స్వర్ణం, కటాస్‌లో కాంస్య, ఆదిత్య కుమితిలో రజతం, కటాస్‌లో కాంస్య, పొన్న యశ్వంత్, కుమితిలో స్వర్ణం, కటాస్ లో రజత పతకాలు సాధించారని కోచ్ రెడ్డబోయిన భరత్ తెలిపారు. ఈ మేరకు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటీ పతకాలు సాధించిన క్రీడాకారులను నిర్వహకులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు విద్యార్థుల వినతి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతిని కల్పించాలని ఆ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు వందలాది జాతి గర్వించదగ్గ విద్యార్థి నాయకునలు అందించిన ఘనత ఆర్ట్స్ కళాశాలకు ఉందన్నారు. అలాంటి కళాశాలలో చదువుతున్న పేద మధ్య తరగతి విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోవడంతో ప్రైవేటు హాస్టళ్ల ఫీజుల భారాన్ని భరించలేక చదువులు ఆపివేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బంక హరికృష్ణ, సాయి, మురళి, సురేష్ పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి

హేయమైన చర్య

టీజీవో, టీఎన్‌జీవో నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై కొంతమంది రైతుల పేరుపై జరిపిన దాడిని ఖండిస్తున్నామని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, టీఎన్‌జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్‌లు సోమవారం వేర్వేరు ప్రకటనలో ఖండించారు. దోషులు ఎంతటి వారైనప్పటికి చట్టపరిధిలో శిక్షించాలన్నారు.

దాడిని ఖండిస్తున్నాం..

వరంగల్ కలెక్టరేట్,(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై రైతుల పేరుతో కొంత మంది దాడి చేశారని, అదేవిధంగా కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, కార్యదర్శి గాజె వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. దోషులు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు.

● వరంగల్ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి, తహసీల్దార్‌లపై జరిగిన దాడి హేయమైన చర్య అని ట్రెసా రాష్ట్ర నాయకులు రియాజుద్దీన్, జి.రాజ్‌కుమార్ అన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే

ప్రధాని మోదీ అబద్ధాలు

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

బాలసముద్రం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ అగ్రనేత ఇండియా కూటమి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రిజర్వేషన్లపై పధాని మోదీ అబద్దపు విమర్శలు చేస్తున్నారని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోదీ, అమిత్‌షాల పాలనలో భారతదేశ ప్రజల మధ్య వ్యవస్థపరంగానే అనైక్యతను కొనసాగిస్తూ దేశాన్ని గుజరాతి వ్యాపారులు అంబానీ-ఆదానీల పెట్టుబడి దార్లకు దేశంలోని వనరులను, కార్మిక శ్రమను దోచిపెట్టేందుకు కుల వ్యవస్థను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అగ్ర కులాల కుట్ర


అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

వడ్డేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అగ్ర కులాల కుట్రేనని, వర్గీకరణతో సామాజిక న్యాయం జరగదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ పనికల శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా చైర్మన్ బండి అశోక్ అన్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణతో ఎస్సీ సామాజిక వర్గంలోని 58 ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. అశాస్త్రీయమైన ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణను అడ్డుకొని తీరుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నేతలు పొనుగంటి లక్ష్మీనారాయణ, కాలేశ్వరపు రామన్న, సాధు కుమారస్వామి, దండు మోహన్, ఎలుకసుగుణ, కూనమల్ల అనిత, దుబాసి రాజేశ్వరి, దండ్రె సదానందం, సూరాసి విక్రమ్, బొల్లం వెంకటయ్య, సంపతి రఘు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిగూడెం పాఠశాలను అభివృద్ధి చేస్తాం



డిజిటల్ క్లాస్‌లు ప్రారంభిస్తున్న సింగారెడ్డి శౌరిరెడ్డి

బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి

మడికొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 46 డివిజన్ కుమ్మరిగూడెం ప్రభుత్వ పాఠశాలను ఒంటిమామిడిపల్లి పాఠశాల తరహాలో అభివృద్ధి చేస్తామని బాల వికాస సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి అన్నారు. బాల వికాస సంస్థ సౌజన్యంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఆర్‌వో వాటర్ ప్లాంట్, ఫర్నీచర్‌ను, అలాగే ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆర్థిక సహాయంతో నిర్మించిన నీటి ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శౌరిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం గత ఆరు నెలలుగా ప్రైవేటు టీచర్లను ఏర్పాటు చేసి పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలకు నీటి ట్యాంకు ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ పాఠశాలకు ఎలాంటి సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాజీపేట ఎంఈవో బండారు మనోజ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ నల్లమారి రమేష్, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రవిందర్, బాల వికాస ఐటి మేనేజర్ శివరామ్, విద్యాకమిటీ చైర్మన్ కల్వచర్ల నవత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అరూరి కవిత, కర్ర హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొల్ల కురుమల సమస్యలను పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరికి మధుకర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ మూగ జీవాల మేత కోసం ఉపయోగపడే 559, 1016, 432 జీవోలను అమలు చేసి గొల్లకురుమలకు న్యాయం చేయాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు రూ.2 లక్షల నగదు బదిలీ చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన గొర్రెల కాపర్లకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సారంగం, ఉపాధ్యక్షుడు కావటి సారయ్య, మైలరాజు, జిల్లా కమిటీ సభ్యులు జక్క రవి, పులిపాటి శ్రీనివాస్, కడిదల రామారావు, అబర్ల రాజు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హనుమకొండ టౌన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ సూచించారు. సోమవారం నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో కేరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ మాటాడుతూ.. యువత సెల్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా ఉంటూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమతో తామే పోటీపడుతూ గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమయం చాలా విలువైనదని దానిని వృధా చేయకుండా కష్టపడి చదివి కళాశాలకు, తల్లితండ్రులకు పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ ముత్యాల సురేశ్, ఏవో మురళి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటు


ఎంసీపీఐ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

గిర్మాజిపేట, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామిజిక విశ్లేషకుడు, రైతు శ్రేయస్సుకు నిరంతరం తపించే రైతాంగ ఉద్యమకారుడు ప్రొఫెసర్ మరిగంటి యాదగిరి ఆకస్మిక మృతి బాధాకరమని, ఆయన మృతి రైతాంగ ఉద్యమాలకు తీరనిలోటని రైతు సంఘాలు నాయకులు అన్నారు. సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయంలో అఖిల భారత రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ యాదగిరి సంతాప సభ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, అఖిల భారత రైతు సంఘాల రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా డిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతాంగ ఉద్యమంలో యాదగిరి పాల్గొని రైతన్నలకు అండగా నిలిచారని కొనియాడారు. వామపక్ష ఉద్యమాలకు అండగా నిలిచారని అన్నారు. రైతాంగ, వామపక్ష ఉద్యమాల బలోపేతమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని, ఈ దిశగా రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు నర్రా ప్రతాప్, కన్నం వెంకన్న, జగదీశ్వర్, నగేష్, కృష్ణ, గణేష్, రాజు, సంతోష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాకారులను అభినందించిన కలెక్టర్


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ఐ క్రీడల్లోని వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడా కారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అభినందించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో క్రీడాకారులందరిని ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు పేరు తేవడం హర్షణీయమని, జాతీయ స్థాయిలో జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, ఎస్జీఎఫ్ఐ సెక్రెటరి దస్రునాయక్, పీడీల సంఘం ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, పీడీలు, కోచ్‌లు గ్రేసమ్మ, రాజేశ్వరి, అరుణ్, వెంకటేశ్వర్లు, బాలమురళికృష్ణ, శ్రీధర్, రాముడు, కుమార స్వామి, రాజు, కిషన్, దేవేందర్, కైలాష్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బంధన్ ఆస్పత్రిలో తనకు జరిగిన అన్యాయంపై హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్యకు జర్నలిస్టు కృష్ణ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విచారణలో హాస్పిటల్ యాజమాన్యం తప్పు చేసినట్లు రుజువైతే హాస్పిటల్ లైసెన్స్ సైతం రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు జర్నలిస్టులు పాల్గొన్నారు.


డాక్టర్ అప్పయ్యకు వినతిపత్రం అందజేస్తున్న తూర్పు జర్నలిస్టులు

సీఎం రేవంత్‌రెడ్డికి అహంకారం పనికిరాదు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు గండ్ర, దాస్యం తదితరులు

మాజీ ఎమ్మెల్యేలు గండ్ర రమణారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్

బాలసముద్రం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల తెలంగాణను సాకారం చేసి, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అహంకారంతో మాట్లాడడం తగదని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల విమర్శలను బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్‌లు ఖండించారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించి ఏడాది గడిచినా బీసీ డిక్లరేషన్ అమలు చేయకపోగా ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నిస్తే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి బీఆర్ఎస్ నాయకులపై అవినీతి ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ కార్యాలయాన్ని బుల్డోజర్‌లతో కూల్చి వేస్తామని మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేస్తే ప్రజలే కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలపై దృష్టి సారించి ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎదురుదాడులు చేయిస్తోందని అన్నారు.

దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తామని, కాంగ్రెస్ నాయకుల అవినీతిని ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తామని విమర్శించారు. బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ ఏమైందని సీఎంను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అప్పటి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. సమగ్ర సర్వేలో వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని సర్వే కోసం వెళ్తున్న అధికారులను ప్రజలు నిలదీస్తున్నట్లు వినయ్‌భాస్కర్ తెలిపారు. బీసీల ఓట్లు దండుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దోపిడీ పాలన చేస్తుందన్నారు. మేము ఉద్యమం చేసి జైలుకెళ్లామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జైలుకు ఎందుకెళ్లారో అందరికి తెలుసన్నారు. కాంగ్రెస్ 10 నెలల పాలనను చూసి ప్రజలు చెంపలు వేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, చెంచు కృష్ణ, నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు


మాట్లాడుతున్న రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపకుడు పల్లపు సమ్మయ్య

కాజీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కులు, వారి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదు.. బీసీలను అన్ని రంగాల్లో అణగతొక్కిందే బీఆర్ఎస్ అని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో సోమవారం వల్లపు సమ్మయ్య మాట్లాడారు. కేటీఆర్ వరంగల్ పర్యటనలో బీసీలపై వల్లమాలిన ప్రేమ వెలిబుచ్చారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీల హక్కులు కాలరాసిన విషయం మర్చిపోలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఐటీడీఏ, మైనార్టీ కార్పొరేషన్‌లకు రుణాలు ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది, బీసీలలో ఉన్న వడ్డెర కులానికి వడ్డెర ఫెడరేషన్ నిధులు ఇవ్వకుండా పాలక మండలిని నియమించకుండా చేసింది బీఆర్ఎస్ కాదా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం చేసేందుకు కులగణన చేస్తుంటే కేటీఆర్ ఇలా మాట్లాడడం అన్యాయం అన్నారు. మీడియా సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొంత ఐలయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొంత మురళి తదితరులు పాల్గొన్నారు.



రైతు రాజకొంరయ్యకు పట్టాదార్ పాస్ పుస్తకం ఇస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ (ఫైల్)

పండుటాకులను పట్టించుకోకపోతే..

చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే

» వారసులూ తస్మాత్ జాగ్రత్త » వృద్ధులకు అండగా సీనియర్ సిటిజన్ యాక్టు



భీమదేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమను కనిపెంచి జీవితాన్ని ఇచ్చి.. వృద్ధాప్యానికి చేరుకున్న తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోవడం లేదు కొందరు వారసులు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన వారు కఠినంగా వ్యవహరిస్తున్నారు. చివరకు అనాథ శరణాల యాలు, వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న సంఘటనలనూ చూస్తు న్నాం. కొందరైతే కన్నవారిపై కర్కషంగా దాడులు చేస్తున్న ఘట నలూ చూస్తున్నాం. అలాంటి వాటికి విరుగుడు మందులా 2005 లో నాటి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్ యాక్టును అమల్లోకి తెచ్చింది. వృద్ధ తల్లిదండ్రుల పేరిట ఉన్న స్థిర చరాస్తులను వారసులు తమ పేర్లపై పట్టాలు చేసుకొని.. ఆ తర్వాత కన్నవారిని పట్టించుకోని సంఘటనలున్నాయి. ఈ నేప థ్యంలో 2005లో అమల్లోకి వచ్చిన సీనియర్ సిటిజన్ యాక్టు ఆ వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలుస్తోంది. కర్క శత్వం ప్రదర్శించిన వారసులను చట్టం ముందు దోషులుగా నిలబెడుతోంది.

వ్యవసాయ భూములను పట్టాలు చే యించుకున్న తర్వాత తల్లిదండ్రుల బాగో గులు పట్టించుకోని వారసుల పట్ల తీవ్రం గా స్పందిస్తోంది. వారి పేరిట తల్లిదం డ్రులు చేసిన స్థిర చర ఆస్తులకు సంబం ధించిన పట్టాలను రద్దు చేసి తిరిగి ఆ వృద్ధ తల్లిదండ్రులకే చెందేలా సీనియర్ సిటిజన్ యాక్టు పనిచేస్తోంది. అలాగే ఉద్యోగాలు చేసే పిల్లల తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేత నం నుంచి రూ. 10వేలు ఇచ్చే వెసులు బాటు ఉంది. ఇవి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి ఉంటాయి. అయితే వేధింపులు, కర్కశత్వం మరీ ఎక్కువగా ప్రదర్శించిన వారసులపై ఘటన తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉం టుందని అధికారులు చెబుతున్నారు. ఈ చట్టంపై గతంలో అంతగా అవగాహన లేకపోవడంతో అంతగా ఫిర్యాదులు అందలేదు. కానీ ఇటీవల కాలంలో అధికారులు సీని యర్ సిటిజన్ యాక్టుపై ప్రచారం కల్పిస్తుం డడంతో ఎంతోమంది వృద్ధులు తమకు భరోసా కావాలంటూ కార్యాలయాల మెట్లు తొక్కుతున్నారు. దాంతో 'వారసులూ తస్మాత్ జాగ్రత్త!' అంటూ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి కేసు..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తా ఫాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాజకొంరయ్య తనకున్న 4.12 ఎకరాలను తన కుమారుడు రవి పేరిట పట్టా చేయిం చాడు. కానీ ఆ తర్వాత రవి తన తండ్రి బాగోగులను చూడక పోవడంతో పాటు ఒకటి రెండుసార్లు రాజకొంరయ్యపై దాడి కూడా జరిగింది. దీంతో సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలు సుకున్న రాజకొంరయ్య భీమదేవరపల్లి తహసీల్దార్, హనుమ కొండ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

వారు విచారణ చేసి రవికి చేసిన పట్టాను రద్దు చేశారు. తిరిగి 3.20ఎకరాలను రాజకొంరయ్యకు పట్టా చేసి ఇవ్వడం ఇటీ వల సంచలనం రేపింది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో తొలిసారి సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేయడంతో అందరిలోనూ అప్రమత్తత పెరిగింది.

డివిజన్ పరిధిలో 12 ఫిర్యాదులు



రాథోడ్ రమేష్, ఆర్డీవో, హనుమకొండ

హనుమకొండ డివిజన్ పరిధిలో సీనియర్ సిటిజన్ యాక్టు కింద 12 ఫిర్యాదులు అందాయి. వీటిపై ఆయా పరిధిలోని తహసీల్దార్లు విచారణ జరుపు తున్నారు. వృద్ధ తల్లిదండ్రులు, వారి పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పట్టించుకోకపోతే కుమారులపై చేసిన వ్యవసాయ భూముల పట్టాను తిరిగి వృద్ధ తల్లిదండ్రులకే చేసే వెసులుబాటు సీనియర్ సిటిజన్ యాక్టుకు ఉంది. అలాగే ఉద్యోగాలు చేసే వారు తమ వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూడకపోతే వారి వేతనం నుంచి రూ.10వేలు భరణంగా ఇవ్వాల్సి ఉంటుంది.

సీనియర్ సిటిజన్ యాక్టు పవర్ ఫుల్



ప్రవీణ్, తహసీల్దార్, భీమదేవరపల్లి

సీనియర్ సిటిజన్ యాక్టు పవర్ ఫుల్ గా మారింది. ఈ యాక్టుపై విస్తృతంగా ప్రచారం నిర్వహి స్తున్నాం. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రు లను పట్టించుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉంటుంది. అలా చేయకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తే ఈ యాక్టు ద్వారా వారసులు పట్టా తిరిగిచ్చేడం, వేతనం నుంచి భరణం ఇవ్వడం లాంటివి ఎదుర్కోవాల్సి ఉంటుంది. వృద్ధులపై మరీ కర్కశంగా వ్యవహరిస్తే జైలు శిక్షకూడా పడే అవకాశం ఉంటుంది.

మమ్మల్ని పట్టించుకోవడం లే..

» కుమారులపై కలెక్టర్‌కు దంపతుల ఫిర్యాదు » జనగామ జిల్లాలో ఘటన

చిలుపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వారసత్వంగా వచ్చిన భూమిని అమ్మగా వచ్చిన డబ్బు ను తమకు ఇవ్వకుండా, అనారోగ్యంతో బాధపడుతున్న తమను పట్టించుకోవడం లేదంటూ వృద్ధ దంప తులు తమ కుమారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. జనగా మ జిల్లా చిలుపూర్ మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన శెట్టబోయిన వెంకట కిష్టయ్య దంపతులకు నలుగురు కుమారులు. ఓ కుమారుడు వివాహానంతరం అత్తగారింటికి ఇల్లరికం పోగా.. మిగిలిన ముగ్గురు కుమారులకు తమకు ఎనిమిదెకరాల్లో తలా రెండున్నరెకరాలు పట్టా చేశారు.

మిగిలిన 30 గుంటల భూమిని వెంకటకిష్టయ్య తన పేరిట ఉంచుకున్నాడు. ఈ క్రమంలోనే అన్న దమ్ముల పాలుకు సంబంధించి మరో ఎకరన్నర భూమి వెంకటకిష్టయ్య వాటాకు రాగా.. దాన్ని వి క్రయించగా వచ్చిన డబ్బులను కూడా కుమారులే తీసుకున్నారు. కానీ వెంకటకిష్టయ్య వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటం, వైద్యు లు ఓ కాలును తొలగించడంతో ఇబ్బందులు మొద లయ్యాయి. ఈ సమయంలో కుమారులు తమను పట్టించుకోకపోగా అవసరాలకు డబ్బులు ఇవ్వాలని కోరితే పట్టించుకోవడం లేదని కలెక్టర్ ఎదుట వాపోయినా ఆ తండ్రి చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న వెంకట కిష్టయ్య దంపతులు

అడ్డురాని వైకల్యం

» పారా తైక్వాండోలో ఓరుగల్లు యువకుడి సత్తా
» అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైన గౌతమ్‌యాదవ్



గౌతమ్‌యాదవ్‌తో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు11: (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడు ఒకప్పుడు తైక్వాండో శిక్షకుడిగా ఎంతో మంది క్రీడాకారులకు శిక్షణ నిచ్చి.. అనేక వేదికపై స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించేలా వారిని తీర్చి దిద్దారు. కానీ విధి ఆడిన వింత నాటకంలో మృత్యు వుకు చేరువై కోలుకుని వీల్‌చైర్‌కే పరిమిత మయ్యాడు. అయినా మొక్కవోని ధైర్యంతో ముందడుగు వేసి ఆటలకు వైకల్యం అడ్డుకా దని నిరూపించాడు. అంతర్జాతీయ స్థాయి సీని యర్ పారా తైక్వాండో పూమ్‌సే చాంపియ న్‌షిప్ 2024 పోటీలకు ఎంపికై స్ఫూర్తిగా నిలు స్తున్నాడు వరంగల్ జిల్లా పైడిపల్లికి చెందిన గౌతమ్ యాదవ్.

స్వతహాగా తైక్వాండో శిక్షకుడైన గౌతమ్ ఎం తో మంది క్రీడాకారుకులకు శిక్షణనిచ్చారు. 2020లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రం గా గాయపడిన గౌతమ్ మృత్యువు ఒడి నుంచి బయటపడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. కొన్ని నెలల పాటు వీల్ చైర్‌కే అంకితమైన ఆయన మొక్కవోని దీక్ష, ఆత్మవిశ్వాసంతో తన కు నచ్చిన తైక్వాండో క్రీడపై ఉన్న అసక్తితో పారా తైక్వాండోను ఎంచుకున్నాడు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పలు పతకాలను సొంతం చేసుకొని ఆట లకు అంగవైకల్యం అడ్డుకాదని నిరుపించిన గౌ తమ్ ఈ నెల 9, 10 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ యూనివర్సిటీలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పూమ్‌సే 51విభాగంలో గౌతమ్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం కొల్లగొట్టారు.

అక్కడి నుంచి ఈ నెల 24నుంచి 28వరకు బహ్రెయిన్ దేశంలో జరిగే 1వ అంతర్జాతీయ స్థాయి సీనియర్ పారా తైక్వాండో పూమ్‌సే చాంపియన్‌షిప్ 2024 పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా గౌతమ్‌ను భారత తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వీణాకు మారి, హర్యానా తైక్వాండో అసోసియేషన్ అధ్య క్షుడు వినోద్‌కుమార్, తెలంగాణ పారా తైక్వాం డో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్ దిలీప్, ప్రధాన కార్యదర్శి ఎల్లావుల గణేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రవి, ఉమ్మ డి వరంగల్ జిల్లా అసోసియేషన్ బాధ్యులు, సీని యర్ క్రీడాకారులు అభినందించారు.

చంద్రాపూర్ ఎన్నికల పరిశీలకుడిగా రామకృష్ణ

హనుమకొండ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర చంద్రాపూర్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ నియమితుల య్యారు. ఈ మేరకు ఏఐసీసీ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఏఐసీసీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి చంద్రాపూర్ పార్టీ అభ్యర్థి ప్రవీణ్ నానాజీ బద్వేకర్ గెలుపు కో సం శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా రామకృష్ణ పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ ఉప కార వేతనాల కోసం వరంగల్ జిల్లాలోని బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెను కబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థు లు తమ వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో డిసెంబరు 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యం విద్యార్థుల వివరాలను నమోదు చేయించాలని సూచించారు.

నేడు కోటి దీపోత్సవం

హాజరు కానున్న మంత్రి సురేఖ

న్యూశాయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : న్యూశాయంపేటలోని ధోనగుట్టపై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవా రం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవా లయ చైర్మన్ గ్రంధి సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మం త్రి కొండా సురేఖ హాజరవుతున్నట్లు గ్రంధి సత్యవతి ఆ ప్రకటనలో తెలిపారు.

ఐడీలు కేటాయించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2024 డీఎస్సీ ద్వారా ఉద్యోగా లు సాధించిన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీ లు కేటాయించి సకాలంలో వేతనాలు అందే వి ధంగా చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ వరం గల్ జిల్లా ప్రధానకార్యదర్శి సి. సుజన్ ప్రసా ద్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం ఏటీ వో పరంజ్యోతికి ట్రెజరీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కాలయాపన చేయ కుండా కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారికి సకాలంలో వేతనాలు అందే విధంగా ట్రెజరీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, షకీల్ మోయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ వర్సిటీ సందర్శన

కేయూ క్యాంపస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మరో ఇద్దరూ సభ్యులు రాంబాబు నాయక్ , రేణుకుంట్ల ప్రవీణ్‌లు సోమ వారం కాకతీయ యూని వర్సిటీని సందర్శించారు. వర్సిటీ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ కె.అనితారెడ్డి, చిర్రరాజులతో కలిసి ఘనంగా సన్మానించారు. వర్సిటీలో నెలకున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



చైర్మన్ వెంకటయ్యను సన్మానిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

అనంతరం వర్సిటీ క్యాంపస్‌లోని దూరవిద్య కేంద్రాన్ని సందర్శించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో కేయూ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, ఇతర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. కేయూ దూరవిద్య కేంద్రాన్ని మరింత బలోపేతం చేయాలని, అడ్మిషన్లు పెంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అడ్మిషన్లు పెంచేందుకు యూజీసీ చైర్మన్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులతో ముచ్చటించారు. వి ద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు తమకు హాస్టల్‌లేదని, ల్యాబ్ తమ కళాశాలకు దూరంగా ఉందని తెలిపారు. క్యాంపస్‌లోని ల్యాబ్, వర్క్‌షాప్‌లకు వెళ్ళేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. వి ద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. వర్సిటీ అధికారులతో మాట్లాడి వి ద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరిరామచంద్రం, ప్రొఫెసర్ జి.హన్మంతు, వరలక్ష్మి, డాక్టర్ సుజాత, డాక్టర్ కొట్టేభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీల హక్కులను కాపాడాలి

» విశాఖపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది జహ ఆరా » కేయూలో బాలగోపాల్ 14వ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పురుషా ధిక్య సమాజంలో స్త్రీల హక్కులను చిత్తశుద్ధితో కాపాడాలని వి శాఖపట్నంకు చెందిన ప్రముఖ న్యాయవాది జహ ఆరా పిలుపునిచ్చారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన మానవ హక్కుల నేత డాక్టర్ కె.బాలగోపాల్ 14వ ఎండోమెంట్ లెక్చర్ జరిగింది. ప్రముఖ హక్కుల నేత, ప్రొఫెసర్ జి. హరగోపాల్, యూజీసీ న్యూ ఢిల్లీ మాజీ న్యాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పాల్గొన్న సదస్సులో జహ ఆరా ముఖ్య అతిథిగా హాజరై 'స్త్రీల హక్కులు.. న్యాయ వ్యవస్థ పాత్ర' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. చదువుతో వి జ్ఞత పెరు గాలన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకూడదన్నారు. మహిళా సాధికారత పెరుగాలన్నారు. మానవ హక్కుల ను మహిళ హక్కు లని అభివర్ణించారు. మహిళ చట్టాలను చిత్తశుద్ధితో అమ లు చేయాలని స్పష్టం చేశారు. యూజీసీ న్యూఢిల్లీ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. బాలగోపాల్ సమాజంపై కమిట్‌మెంట్ కలిగి న ఉద్యమకారుడని చెప్పారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల కోసం చిత్తశుద్ధితో అందరం పనిచేయా లన్నారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవితా న్ని ప్రజల కోసం త్యాగం చేసిన బాలగోపాల్ త్యాగాన్ని యువత అందిపు చ్చుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. బాలగో పాల్ గొప్ప మానవతావాది అని చెప్పారు. సదస్సు ప్రారంభంలో బాలగోపా ల్ సతీమణి వసంతలక్ష్మి, కుమారుడు ప్రభాత్‌లతో కలిసి బాలగోపాల్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జహ ఆరాను శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానిం చారు. సదస్సులో వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్ లాల్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియం త్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, ప్రొఫెసర్ బైరు వెంకట్రా మిరెడ్డి, ప్రొఫెసర్ కృష్ణయ్య, మాజీ వీసీ ప్రొఫెసర్ కె.సీతారామారావు, పాలక మండలి సభ్యులు చిర్రా రాజు, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, పుల్లూరి సుధా కర్, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే తదితరులు పాల్గొన్నారు.



బాలగోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, హరగోపాల్, తదితరులు

కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నియామకంపై ఉత్కంఠ

» ముగ్గురి పేర్లతో సీఎం వద్దకు ఫైల్ ? » పదేళ్లుగా ఒక్కరే ఉపకులపతి

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాళోజీ నారా యణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ముగ్గురు పేర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు ఫైల్ చేరినట్లు విశ్వసనీయ సమాచారం. పది సంవత్సరాలుగా ఓసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ఉపకులపతిగా కొనసాగు తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన వీసీ నియామకం చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 1987 లో ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో విజయవాడలో హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి 2014 రాష్ట్ర విభజన జరిగే వరకు అనేక మంది ఉపకుల పతు లుగా నియామకమయ్యారు. వీరిలో అత్యధికులు ఆంధ్ర ప్రాంతా నికి చెందిన వారు అందులోనూ ఉన్నత వర్గానికి చెందిన వారే ఎక్కువగా ఉండడం విశేషం. అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఉపకు లపతిగా ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించగా.. ఆయన పదేళ్లుగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యావేత్తలకు ఉపకులపతిగా అవకా శం కల్పించాలని డిమాండ్ వినిపిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనుభవం, అర్హత ఉన్న ప్రొఫెసర్ల వివరాలు ఉన్నాయని సమాచారం. రాష్ట్రంలో 65 వైద్య కళాశాలలు, వీటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో పారా మెడికల్ కోర్సులు బోధించే కళాశాలలు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోనే ఉన్నాయి. ఇంత టి విశిష్టత కలిగిన ఈ విశ్వవిద్యాలయానికి బోధన అనుభవం, నైతిక ప్రవర్తన కలిగిన వ్యక్తితోపాటు సామాజిక న్యాయం జోడించి ఉపకుల పతి ఎంపిక చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

సర్వేపై.. సందేహాలెన్నో!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ల ద్వారా వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందిన వివరాలను కూడా చెప్ప కుండా దాచేస్తున్నారు. దళిత బంధు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఇంకా ఇతర పథకాల ద్వారా పొందిన సాయం విషయాన్ని కూడా దా చేస్తున్నారు. ఆధార్‌కార్డు వివరాలు తెలియజే యడం ఐచ్ఛికం అని చెప్పడంతో వాటిని కొంద రు ఇస్తుండగా.. మరికొందరు ఇవ్వడం లేదు. ఇంటింటి సర్వేకు వెళ్లిన ఎన్యూమరేటర్లను ఎన్ని కల హామీల అమలుపై నిలదీస్తున్నారు. నిరుపే ద, మధ్య తరగతి ఇళ్లవారు సహకరించినంతగా సంపన్నులు, విలాసవంతమైన విల్లాల్లో నివాస ముంటున్నవారు వివరాలు ఇవ్వడానికి ముం దుకు రావడం లేదని తెలుస్తోంది. ఆర్థిక, సామా జిక, విద్య కుల సర్వే నిరుపేదలకు సంబంధించిందని వారు భావిస్తున్నందు వల్లనే వివరాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. విలాసవంతమైన కొన్ని ఇళ్ల గేట్లు వేసి ఉండడం, ఆ ఇళ్లలో కుక్కలు ఉండడం, ఎన్నిసార్లు కాలింగ్ బెల్ కొట్టినా స్పందన లేకపో వడం కూడా వివరాల సేకరణలో కష్టమవుతు న్నదని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. కొందరై తే కులగణనకు వచ్చామని చెబితే మాకవసరం లేదని ముఖం మీదే తలుపు లేస్తున్న చేదు అనుభవాలను కూడా వారు ఎదుర్కొంటున్నట్టు సమాచారం. సంప్రదాయ కులవృత్తిని ఎంచుకొని దాని ద్వారానే ఉపాధి పొందుతున్న వారి వివరా లు నమోదుకు అవ కాశం లేకుండాపోవడంతో ఆయా కుల సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లను ఈ విషయమై నిలదీస్తున్నారు. సర్వే ఫారంలో కుల వృత్తి కాలం ఎందుకు లేదని, దానిపై ఆధారపడి బతుకుతున్న వారి ఆర్థిక, ఉపాధిని ప్రభుత్వం ఎలా లెక్కిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్ అదరహో



జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

» విద్యార్థులతో సందడిగా మారిన గురుకులం
» పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్
» తొలి రోజు హుషారుగా పోటీలు

మరిపెడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరిపెడ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సోమవారం భద్రాద్రి 10వ జోన్ స్పోర్ట్స్ మీట్ పోటీలు అదరహో అనిపించాయి. విద్యార్థుల సంబరాలు అంబ రాన్ని అంటాయి. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోత్ రాంచం ద్రునాయక్ ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడాజ్యోతిని వెలి గించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సోషల్ వెల్ఫేర్ వి ద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భద్రాద్రి ఫోర్త్ జోన్ పరిధిలోని కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 11 గురుకుల పాఠశాలలకు చెందిన 935 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని తొలి రోజు తమ ప్రతిభను చాటారు. పోటీల ప్రారంభం సందర్భంగా తొర్రూరు, మరిపెడ బాలికల గురుకుల విద్యార్థులు తమ నృత్యా లతో హోరెత్తించారు. వర్ధన్నపేట గురుకుల పాఠశాలకు చెందిన వి ద్యార్థులు యోగా ఆసనాలతో అదరగొట్టారు. తొలి రోజు స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

స్పోర్ట్స్ మీట్ సందర్భంగా వివిధ గురుకుల పాఠశాలల విద్యా ర్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ సభికులను, విద్యార్థులను ఆకట్టు కుంది. మరిపెడ, తొర్రూరు గర్ల్స్ గురుకుల విద్యార్థులు త్రివర్ణ రంగుల దుస్తులు ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వివిధ గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆయా స్కూల్స్ క్రీడా దుస్తులు ధరించి అతిథులకు వందన సమర్పణ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే బంగారు భవిష్యత్

సీఎం రేవంత్‌రెడ్డితోనే నిరుపేద విద్యార్థులకు బంగారు భవిష్య త్ ఉందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. సోమవారం రాంచంద్రునాయక్ భద్రాద్రి జోన్ 10వ స్పోర్ట్స్ మీట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హాస్టల్, గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వడా నికి మెస్ చార్జీలను 40 శాతం పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులకు గ్రూప్-1 స్థాయి ఉద్యోగం కల్పిం చిన విషయాన్ని ఉదహరించారు. జిల్లాకో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అలోచన చేస్తోందన్నారు. తాను సైతం సోషల్ వెల్ఫేర్, ఆర్‌జేసీ పూర్వ విద్యార్థినే అని అన్నారు.

అటల్లో ఉండడంతో పుస్తకాలను నమ్మి డాక్టరయ్యానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటి కొమ్ము యుగేందర్‌రెడ్డి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీఎస్‌వోలు, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో వి జయ, ప్రిన్సిపాల్ దయాకర్, మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీశ, మాజీ సర్పంచ్ రాంలాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజ్‌దీన్, మీడియా ఇన్‌చార్జ్ నరేందర్, పీడీ వంగ రవి, వెంకటేశ్వర్లు తదిత రులు పాల్గొన్నారు.

11 రకాల ఆటల పోటీలు

ఈ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా 11 రకాల ఆటల పోటీలకు మరి పెడ సోషల్ వెల్ఫేర్ స్కూల్ వేదికగా నిలిచింది. అండర్-14, 17, 19 విభాగాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క పాఠ శాల నుంచి 85మంది విద్యార్థుల చొప్పున 11 గురుకుల పాఠశాలల నుంచి మొత్తం 935 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. వారికి సహాయకులుగా ఆయా గురుకుల పాఠశాలల పీడీలు, పీఈటీలు, గైడ్, ఎస్కార్ట్ టీచర్లు పాల్గొన్నారు. తొలి రోజు 600 మీటర్స్ రన్నింగ్, 5కే రన్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. 600 మీటర్ల అండర్-14 వి భాగంలో నితిన్(మణుగూరు), సీహెచ్.రిషి(మరిపెడ), జి.గణేశ్(దమ్మపేట) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకు న్నారు. 5కే రన్ అండర్-17లో జె.గౌతమ్(దమ్మపేట), కె.రవితేజ(దమ్మపేట), కె.మణికాంత్(సత్తుపల్లి), అండర్-19 విభాగంలో బి.దిలీప్(పాల్వంచ), జీఎల్‌కే మదన్‌సా యి(పాల్వంచ), కె.ప్రతాప్(నర్సంపేట), లాంగ్‌జంప్ అండర్-14, 17, 19 విభా గంలో ఎస్.శ్రీకాంత్(పాల్వంచ), కె.గౌత మ్(పాల్వంచ), ఎం.నితిన్(మణుగూరు), కె.ఆనంద్(ఏఆర్‌పల్లి), జి.అభినయ్(పాల్వంచ), బి.మోహన్(టి.పాలెం), ఎం.శ్రీరామ్(దమ్మపేట), ఎం.కాంతి(టి.పాలెం), జి.శశిధర్(మరిపెడ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.



యోగా ఆసనాలు చేస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్
మంగళవారం • 12 నవంబరు 2024





నెలలు నిండకుండా పుట్టే పిల్లలు సాధారణ పిల్లల్లా ఆరోగ్యంగా ఎదగాలంటే పుట్టింది మొదలు అనుక్షణం పదిలంగా కాపాడుకోవాలి. అందుకు అవసరమైన అత్యాధునిక వైద్య సదుపాయాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే ఆస్పత్రినే ఎంచుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా పిల్లలు నెలలు నిండకుండా పుట్టే పరిస్థితులను తొలగించుకోవాలి. అందుకు ఏం చేయాలో, ఎలా నడుచుకోవాలో వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

నవంబరు 17 వరల్డ్ ప్రిమెచ్యూర్ డే

నెలలు నిండకుండా పుడితే?

తొమ్మిది నెలలు నిండినప్పుడే బిడ్డ పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటాడనే విషయం మనందరికీ తెలిసిందే! కానీ కొందరు పిల్లలు 37 నుంచి 40 వారాల కంటే ముందు పుట్టేస్తూ ఉంటారు. ఈ పిల్లలే ప్రిమెచ్యూర్ బేబీస్. అరుదుగా కొన్ని సందర్భాల్లో 24 నుంచి 26 వారాలకే ప్రసవం అయిపోతూ ఉంటుంది. ఈ కోవకు చెందిన పిల్లల పట్ల రెట్టింపు అప్రమత్తతతో వ్యవహరించవలసి ఉంటుంది. నెలలు నిండకుండా పుట్టే పిల్లల్లో ప్రధాన అంతర్గత అవయవాలు పూర్తిగా ఎదిగిన స్థితిలో ఉండవు. ఎంత ముందుగా ప్రసవమైపోతే, పిల్లల్లో సమస్యలు అంత తీవ్రంగా ఉంటాయి. కాబట్టి ఈ పిల్లలకు పుట్టిన వెంటనే తక్షణ వైద్య సహాయం అవసరమవుతుంది.

మొదటి గంటే ప్రధానం

నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు మిగతా పిల్లలతో సమానంగా ఎదగలేరన్నది అపోహ మాత్రమే! పుట్టిన మొదటి గంటలోగా అన్ని వసతులూ ఉన్న ఆస్పత్రిలో వైద్య సేవలను అందించగలిగితే, ఈ పిల్లలు అన్ని విధాలా సాధారణ పిల్లల్లాగే ఎదిగే సామర్థ్యాన్ని సమకూర్చుకోగలుగుతారు. అందుకోసం ఆస్పత్రిలో సరిపడా పరికరాలు, నియో నేటల్ కేర్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది ఉండాలి. పుట్టిన మొదట గంట మీదే బిడ్డ ఆరోగ్యం, భవిష్యత్తు ఆధారపడి ఉంటాయి.

నెలలు నిండకుండా పుట్టే పిల్లల్లో ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థలు పూర్తిగా ఎదగని స్థితిలో ఉంటాయి. కాబట్టి పుట్టిన వెంటనే వెంటిలేటర్ సహాయంతో కృత్రిమ శ్వాసను అందిస్తూ, ఐవి ద్వారా పోషకాలను అందించాలి. అలాగే నాడీవ్యవస్థ మెరుగు పడడం కోసం ఇంక్యుబేటర్ సహాయంతో కృత్రిమ వెచ్చదనాన్ని అందించాలి. 24 వారాలకు పుట్టిన పిల్లలు, 28 వారాలకు పుట్టిన పిల్లల కంటే బలహీనంగా ఉంటారు. తల్లి గర్భంలో బిడ్డ గడిపే ప్రతి రోజూ కీలకమైనదే! కాబట్టి బిడ్డ ఎంత ముందుగా ప్రసవించినా, తల్లి గర్భాన్ని మరిపించే సదుపాయాలు కల్పిస్తూ, తగిన పోషణను కూడా అందించగలిగితే నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు కూడా నెలలు నిండిన తర్వాత పుట్టిన పిల్లలతో సమానంగా ఆరోగ్యంగా ఉంటారు. అయితే అందుకోసం పుట్టింది మొదలు నెలలు నిండేవరకూ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే ఉండవలసి ఉంటుంది.

నెలలు ఎందుకు నిండడం లేదు?

ఇందుకు కారణం బిడ్డలో ఉండవచ్చు, గర్భిణిలో ఉండవచ్చు. తల్లికి అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, మూత్రపిండా ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు, ఉమ్మనీరును ప్రసవానికి ఎంతో ముందగానే కోల్పోయి, ప్రసవం కానప్పుడు నెలలు నిండకుండా పిల్లలు పుట్టే అవకాశాలుంటాయి. కృత్రిమ గర్భధారణలో కూడా ఈ సమస్య ఉంటుంది. అలాగే గర్భంలో బిడ్డ ఎదుగుదల క్షీణించినప్పుడు, బిడ్డలో జన్యుపరమైన సమస్యలు ఉన్నప్పుడు, కవలలు, ముగ్గురు పిల్లలతో గర్భం దాల్చినప్పుడు కూడా పిల్లలు నెలలు నిండకుండా పుట్టే అవకాశాలుంటాయి. అలాగే మొదటిసారి నెలలు నిండకుండా ప్రసవమైపోతే, రెండోసారి కూడా ఇదే పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి ఈ పరిస్థితి పునరావృతం అవకుండా ఉండడం కోసం, కారణాన్ని కచ్చితంగా తెలుసుకుని దాన్ని అరికట్టడంతో పాటు, గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో మెలగాలి.

అన్ని సదుపాయాలు ఉండేలా...

నెలలు నిండకుండా ప్రసవానికి దారి తీసే ఆరోగ్య సమస్యలున్న గర్భిణులు, ఆరో వారం నుంచే అప్రమత్తంగా ఉండాలి. మొదటి ప్రసవం 24 వారాలకు జరిగిపోతే, రెండో ప్రసవం అంతకంటే రెండు వారాల ముందే జరిగిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన తల్లులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా తల్లీబిడ్డలు ఇద్దరికీ అవసరమైన వైద్యసేవలు అందుబాటులో ఉండే ఆస్పత్రులనే ఎంచుకోవాలి. అందుకోసం లెవల్ త్రీ ఎన్‌ఐసియు ఉన్న ఆస్పత్రులనే ఎంచుకోవాలి. ఇలాంటి ఆస్పత్రుల్లో ప్రసూతి వైద్యులతో పాటు, పసికందుల వైద్యులు కూడా అందుబాటులో ఉంటారు. ఇలా అన్ని జాగ్రత్తలు పాటించగలిగితే తల్లీ బిడ్డా ఆరోగ్యాలను పుంజుకుని, క్షేమంగా ఇంటికి చేరుకోగలుగుతారు.

తల్లి పాలు అమృత సమానం

బిడ్డ వయసుతో సంబంధం లేకుండా పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించడం మొదలుపెట్టాలి. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు కూడా కచ్చితంగా తల్లి పాలు ఇవ్వవలసి ఉంటుంది. అయితే నెలలు నిండకుండా పిల్లలు పుట్టిన సందర్భాల్లో తల్లికి పాలు ఎక్కువగా తయారు అవకపోవచ్చు. ఆ సందర్భాల్లో బ్రెస్ట్ పంప్ ద్వారా చుక్కల మోతాదులో పాలను సేకరించి, ట్యూబ్ ద్వారా ఎన్‌ఐసియులో ఉంచిన పసికందుకు అందించవలసి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ పొందిన నర్సులు ఆస్పత్రుల్లో ఉంటారు. అరుదుగా కొన్ని సందర్భాల్లో తల్లి పాలిచ్చే పరిస్థితి లేనప్పుడు, తల్లి పాల బ్యాంక్ నుంచి పాలను తెప్పించి, పసికందుకు పట్టించవలసి ఉంటుంది. ఇలా బిడ్డ ఆస్పత్రిలో ఉన్నంత కాలం, పరిపూర్ణంగా కోలుకునే వరకూ పాల బ్యాంకు నుంచి పాలను ఉచితంగా పొందే సదుపాయం కూడా ఉంది.

ఇంటికి చేరుకున్న తర్వాత...

పూర్తిగా ఆరోగ్యాన్ని పుంజుకుని ఇంటికి చేరుకున్న పసికందులను, ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా పిల్లల వైద్యులకు చూపిస్తూ ఉండాలి. డిస్చార్జ్ అయిన 48 గంటలకు ఒకసారి, తర్వాత వారానికొకసారి, ఆ తర్వాత నెలకొకసారి... ఇలా ఏడాది పాటు వైద్యులకు చూపిస్తూ ఉండాలి. కంటి చూపు, ప్రాణ శక్తి, ఎదుగుదలలను ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి.

గర్భానికి శరీరాన్ని సిద్ధం చేసి...

నెలలు నిండకుండానే ప్రసవమైపోవడానికి తీవ్ర ఆరోగ్య సమస్యలే కారణం కాదు. రక్తలేమితో కూడా ఇలా జరగవచ్చు. ఇతరత్రా ఆరోగ్య సమస్యలేవీ లేకపోయినా, రక్తలేమి కలిగి ఉంటే, నెలలు నిండకుండా ప్రసవమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితికి దారి తీయకుండా ఉండాలంటే గర్భం దాల్చడానికంటే ముందు నుంచే మహిళలు గర్భానికి శరీరాన్ని అన్ని విధాలా సంసిద్ధం చేయాలి. అధిక రక్తపోటు, మధుమేహాలను అదుపులో పెట్టుకోవాలి. ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా చూసుకోవాలి. నెలసరి సమస్యలను సరిదిద్దుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, వైద్యులు సూచించే రక్తవృద్ధికి తోడ్పడే టానిక్కులు, మల్టీ విటమిన్ సప్లిమెంట్లు తీసుకోవాలి.

కంగారూ మదర్ కేర్ కీలకం



పుట్టినప్పుడు రెండున్నర కిలోల కంటే తక్కువ బరువుండే పిల్లలకు కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమవుతుంది. మరీ ముఖ్యంగా కేవలం 700 గ్రాముల బరువుతో కూడా పిల్లలు పుడుతూ ఉంటారు. ఇలాంటి పిల్లలకు 'కంగారూ మదర్ కేర్' అవసరమవుతుంది. ఎలాంటి అచ్ఛాదన లేకుండా తల్లీ, బిడ్డా శరీరాలు ఒకదానికొకటి తగిలేలా, తల్లి స్పర్శనూ, వేడినీ బిడ్డ పొందే వెసులుబాటు ఉండే కంగారూ మదర్ కేర్‌తో, బిడ్డ ఎదుగుదల మెరుగ్గా ఉంటుంది. అలాగే తల్లులతోపాటు, తండ్రులూ, అమ్మమ్మ, తాతయ్యలు కూడా కంగారూ మదర్ కేర్‌కు అర్హులే! ఈ కేర్‌తో నాడీ, ఇంద్రియ వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. బిడ్డకు పరిపూర్ణ ప్రయోజనం దక్కడం కోసం రోజు మొత్తంలో 8 నుంచి 10 ఎనిమిది గంటల పాటు కంగారూ మదర్ కేర్‌ను కొనసాగించాలి. ఇలా బిడ్డ బరువు 3 నుంచి 4 కిలోలకు పెరిగేవరకూ కొనసాగించాలి.

- డాక్టర్ నిటాషా బగ్గా
పిడియాట్రీషియన్ అండ్ నియోనటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.



చిట్కా

తులసి తింటే?

ఎన్నో దశాబ్దాలుగా సంప్రదాయ వైద్య విధానంలో తులసిని ఉపయోగిస్తున్నారు. దీన్లోని ఔషధగుణాలు కొన్ని రుగ్మతలకు చక్కని విరుగుడుగా పని చేస్తాయి. అవేంటంటే....

- **ఒత్తిడి:** తులసితో శరీరంలోని కార్టిసాల్ మోతాదులు సంతులనమై ఒత్తిడి అదుపులోకొస్తుంది. దాంతో నాడీవ్యవస్థ సామర్థ్యం పెరగడంతో పాటు, మానసిక ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి.
- **వ్యాధినిరోధకశక్తి:** తులసిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. దీనికి సూక్ష్మజీవులు, ఫంగస్, బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడే గుణాలుంటాయి. కాబట్టి తులసి తీసుకోవడం ద్వారా వ్యాధినిరోధకశక్తి పెరిగి, వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.
- **జీర్ణశక్తి:** పొట్టలోని ఆమ్ల ఉత్పత్తిని ప్రేరేపించడం ద్వారా జీర్ణ ప్రక్రియను మెరుగుపరిచే శక్తి తులసికి ఉంటుంది. కడుపు ఉబ్బరం, అజీర్తిలను తొలగించి జీర్ణక్రియ సాఫీగా సాగడానికి సహాయపడుతుంది.



- **మధుమేహం:** తులసిని క్రమం తప్పక తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర మోతాదులు తగ్గుముఖం పడతాయి. వంశపారంపర్యంగా మధుమేహం సంక్రమించే అవకాశాలున్న వాళ్లు క్రమం తప్పకు తులసిని తింటే, ఈ సమస్య దరి చేరకుండా ఉంటుంది.
- **చర్మం:** దీన్లోని యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యానికి సహాయపడతాయి. మొటిమలు తొలగి, చర్మం కాంతివంతంగా మారుతుంది.
- **ఇలా తినొచ్చు:** తులసి ఆకులను వేడి నీళ్లలో మరిగించి, తేనె కలుపుకుని తాగొచ్చు. సలాడ్స్‌లో కలుపుకుని తినొచ్చు.

కంటి రక్ష

కళ్లు నీళ్లు కారకుండా...

కొంతమంది వెలుగును చూడలేరు. ఎండ వెలుగులోకి వెళ్లగానే కళ్ల నుంచి నీరు కారిపోతూ ఉంటాయి. ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉండేవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల నుంచి కళ్లను రక్షించడం కోసం, కళ్లలో ఉండే, లాక్రిమల్ గ్రంథులు ప్రేరేపితమై కళ్లకు తేమనివ్వడం కోసం నీళ్లను స్రవిస్తాయి. అయితే కొందర్లో ఈ గ్రంథులు అవసరానికి మించి పని చేస్తూ ఉంటాయి. మరీముఖ్యంగా డ్రై ఐ సిండ్రోమ్, అలర్జీలు ఉన్న వాళ్లలో ఈ గ్రంథులు అతిగా స్పందిస్తాయి. దాంతో వెలుగును చూసిన వెంటనే కళ్ల నుంచి నీరు స్రవించడం మొదలుపెడుతుంది. ఈ లక్షణానికి తోడు నొప్పి, మంట, దురద, చూపులో మార్పు లాంటి అదనపు లక్షణాలు కనిపిస్తే, ఆ పరిస్థితిని 'కెరటైటిస్'గా పరిగణించి, వైద్యులను కలవాలి. ఫొటోఫోబియా ఉన్నవాళ్ల కళ్లు వెలుగును తట్టుకోలేవు. ఈ కోవకు చెందినవాళ్లు వెలుగులోకి రాగానే కళ్లను చికిలిస్తూ ఉంటారు. ఈ లక్షణాన్ని కూడా వైద్యులు కచ్చితంగా అంచనా వేయగలుగుతారు. అత్యధిక అతినీలలోహిత కిరణాలకు బహిర్గతం కావడం, గాలి కాలుష్యాల వల్ల కూడా వెలుగుకు కళ్లు అతిగా స్పందించి నీళ్లు కారతాయి. ఇలాంటి సమస్య ఉన్నవాళ్లు అతినీలలోహిత కిరణాలను అడ్డుకునే చలువ కళ్లద్దాలు వాడుకోవడంతో పాటు, వైద్యులు సూచించే కంటి చుక్కలు కూడా వాడుకోవాలి. కళ్లలోని కన్నీటి నాళాలు వాతావరణ ప్రభావాలకు గురి కాకుండా అన్ని వైపులా మూసి ఉండే చలువ కళ్లజోడులను పెట్టుకోవాలి.



వ్యాయామం

6-6-6

నడక ఆరోగ్యకరం. అయితే ఆ నడకకు కూడా ఒక క్రమపద్ధతి ఉండాలి. అప్పుడే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. అలాంటి ఒక పద్ధతే 6-6-6. ఈ నడక నియమాలను అనుసరిస్తే అనారోగ్యం దరిచేరదు.

6 నిమిషాల పాటు శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేయడం (వార్మప్).. 6 నిమిషాలను చల్లబరచటం.. ఉదయం ఆరు గంటలకు లేదా సాయంత్రం ఆరు గంటలకు 60 నిమిషాల పాటు నడవడమే 6-6-6 నడక నియమం. అంటే రోజుకు 60 నిమిషాలు నడవాలి. ఒకే సారి 60 నిమిషాలు నడవలేకపోతే- ఉదయం 30 నిమిషాలు, సాయంత్రం 30 నిమిషాలు కూడా నడవవచ్చు. ఈ సమయాలు ఉద్యోగులకు సైతం అనువుగా ఉండడం, పొందే ఫలితం మెరుగ్గా ఉండడంతో ఈ కొత్త నడక నియమం ఈ మధ్య కాలంలో సర్వత్రా ఆదరణ పొందుతోంది. ఈ నియమంతో ఎలాంటి ఫలితాలు దక్కుతాయంటే...

ఉదయం నడక

ఉదయం ఆరు గంటలకు నడవడం వల్ల, శరీరంలో కొవ్వు కరిగే వేగం పెరుగుతుంది. ఉదయం శరీరం హుషారుగా ఉంటుంది. కాబట్టి చలాకీగా నడవగలుగుతాం. తాజా గాలి పీలుస్తూ, చకచకా నడవగలుగుతాం! దాంతో రక్తప్రసరణ మెరుగవుతుంది. మనసు ఉల్లాసంగా ఉంటుంది. ఏడు గంటలకు నడక పూర్తయిపోతుంది. కాబట్టి రోజులో చాలా సమయం మిగిలి ఉంటుంది.

సాయంకాలం నడక

రోజు మొత్తంలో శరీరంలో పోగయ్యే ఒత్తిడికి సాయంకాలపు నడక విరుగుడుగా పని చేస్తుంది. నడకతో శరీరం అలసి, రాత్రికి కమ్మని నిద్ర పడుతుంది. రోజంతా కుర్చీలో కూర్చుని ఉద్యోగాలు చేసే వాళ్లు సాయంకాలం గంట పాటు నడవడం వల్ల శరీరంలో చురుకుదనం పెరుగుతుంది. కండరాల నొప్పులు అదుపులోకొస్తాయి.



వారానికి ఐదుసార్లు

గుండె, ఊపిరితిత్తులు బలపడతాయి. శ్వాసకోస సమస్యలు, హృద్రోగాల ముప్పులు దరి చేరకుండా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మానసికోల్లాసం దక్కుతుంది. శరీరం చురుగ్గా మారి, పనులన్నీ సులభంగా చేసుకోగలుగుతాం! అలాగే అదనపు క్యాలరీలు ఖర్చయి, శరీర బరువు అదుపులో ఉంటుంది.

జాగ్రత్తలు

ఒక రోజులో ఎంత సేపు నడవాలనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వయస్సు ఆధారంగా.. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా.. వైద్యుల ఇచ్చే సలహా ఆధారం ఎంత సేపు నడవాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలి.

ఛాతీ తెరవకుండా గుండె సర్జరీ

గుండెకు శస్త్రచికిత్స అనగానే ఛాతీ మీద పెద్ద కోత కళ్ల ముందు మెదులుతుంది. పెళ్లీడు యువతకు ఇదొక పెద్ద అవరోధమే! కానీ ఇప్పుడా సమస్య లేదు. తాజా మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీలతో పక్కటెముల మధ్య నుంచి గుండెకు చికిత్స చేసే వెసులుబాటు కలుగుతోంది. ఈ శస్త్రచికిత్సకు ఎవరు అర్హులో తెలుసుకుందాం!



ఛాతీ తెరిచి చేసే సంప్రదాయ సర్జరీలతో కోత, కోలుకోడానికి సమయాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా పెద్దల్లో ఎముక అతుక్కోడానికి ఎక్కువ సమయం పడుతూ ఉంటుంది. అలాగే మధుమేహుల్లో కూడా కోత మానడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇక పెళ్లీడు యువత శరీరం మీద పెద్ద గాటు ఏర్పడుతుందనే భయంతో గుండె సర్జరీలను వాయిదా వేస్తూ ఉంటారు. ఇలా సంప్రదాయ గుండె సర్జరీలకు కొన్ని చిక్కులున్నాయి. వీటిని అధిగమిస్తూ తాజాగా అత్యాధునిక సాంకేతిక పరికరాలు, రోబోట్ల సహాయంతో చిన్న కోతతో గుండెకు శస్త్రచికిత్స చేసే మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు అందుబాటులోకొచ్చాయి.

ఎవరు అర్హులు?

ఈ శస్త్రచికిత్సకు అన్ని వయసుల వాళ్లూ అర్హులే అయినప్పటికీ, పైచర్మానికీ గుండెకూ మధ్య ఉన్న దూరం కీలకంగా మారుతుంది. పక్కటెముకల మధ్య నుంచి కోత పెట్టి, గుండెను చేరుకోవలసి ఉంటుంది కాబట్టి ఆ మార్గం సులువుగా ఉందో లేదో ముందుగానే పరీక్షించుకోవలసి ఉంటుంది. మరీ ముఖ్యంగా తొడ దగ్గరి రక్తనాళం వ్యాసార్థాన్ని ముందుగానే తెలుసుకోవాలి. ఈ రక్తనాళం సన్నగా ఉన్నా, ఛాతీ మరీ వెడల్పుగా ఉన్నా, మినిమల్లీ ఇన్వేసివ్ శస్త్రచికిత్స సాధ్యపడదు. ఈ సమస్యలేవీ లేకుండా భౌతిక ప్రమాణాలన్నీ కుదిరిన వాళ్లకు వయసుతో సంబంధం లేకుండా ఈ చికిత్సను ఎంచుకోవచ్చు.

ఏ సమస్యలకు?

ఇన్‌ఫెక్షన్, పుట్టుకతో వెంట తెచ్చుకునే సమస్యల వల్ల గుండెలోని రెండు ప్రధాన నాళాల్లో ఇబ్బందులు తలెత్తుతూ ఉంటాయి. కొన్నిసార్లు నాళాల్లో అవరోధాలు ఏర్పడవచ్చు లేదంటే వాటి నుంచి రక్తం బయటకు వచ్చేస్తూ ఉండవచ్చు. ఇలాంటప్పుడు నాళాలను మార్చే శస్త్రచికిత్సల కోసం ఈ తరహా విధానాన్ని ఎంచుకోవచ్చు. అలాగే అకస్మాత్తుగా తలెత్తే గుండెపోట్లకు కూడా ఈ విధానాన్ని ఎంచుకోవచ్చు. ఇలా నాళం మరమ్మత్తు, నాళం స్థానంలో కొత్త నాళాన్ని అమర్చడం, కొరొనరీ ఆర్టరీ బైపాస్‌లతో పాటు, పుట్టుకతో వెంట తెచ్చుకునే కొన్ని గుండె జబ్బులకు, మరీ ముఖ్యంగా గుండెలో రంధ్రాలకు కూడా ఈ సర్జరీని ఆశ్రయించవచ్చు. మధుమేహులకు ఈ సర్జరీ ఎంతో ఉపయోగకరం. ఛాతీ ఎముక కత్తిరించి చేసే గుండె శస్త్రచికిత్సతో మధుమేహుల్లో ఇన్‌ఫెక్షన్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. చిన్న కోతతో ఆ ముప్పు తక్కువగా ఉంటుంది.

సర్జరీ ఇలా...

ఈ సర్జరీలో ప్రత్యేకమైన పరికరాలను వినియోగిస్తారు. ల్యాప్రోస్కోపిక్ సర్జరీలలో ఉపయోగించే పరికరాలను పోలిన వాటినే ఈ శస్త్రచికిత్సలో కూడా ఉపయోగిస్తారు. అయితే వాటి కంటే ఇవి మరింత సన్నగా ఉంటాయి. కాబట్టి కోత ఐదు నుంచి పది సెంటీమీటర్లకు మించదు. ప్రోబ్స్, వాటి చివర అమర్చి ఉండే కెమెరాలతో గుండెను స్పష్టంగా పరిశీలిస్తూ, వైద్యులు సమర్థంగా చికిత్సను పూర్తి చేయగలుగుతారు. అరుదుగా కొన్ని సందర్భాల్లో, కొంత మందిలో, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ మొదలుపెట్టిన తర్వాత, ఓపెన్ హార్ట్ సర్జరీని ఆశ్రయించక తప్పని పరిస్థితులు కూడా తలెత్తుతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో శస్త్రచికిత్స విఫలమైందని అనుకోడానికి వీల్లేదు. కొంతమందిలో అంతర్గత భౌతిక మార్పుల వల్ల ఈ సర్జరీ సాధ్యపడకపోవచ్చు. అలా మినిమల్లీ ఇన్వేసివ్ నుంచి ఓపెన్ హార్ట్ సర్జరీకి మరలే అవకాశాలు ఐదు నుంచి పది శాతం మేరకే ఉంటాయి.

ప్రయోజనాలు ఎక్కువ

- కోత, నొప్పి, కోలుకునే సమయం తక్కువ
- కోత ఛాతీ పక్కన ఉంటుంది కాబట్టి స్పష్టంగా కనిపించదు
- ఎముక కత్తిరించే అవసరం ఉండదు
- ఆస్పత్రి నుంచి నాలుగు రోజుల్లో ఇంటికి చేరుకోవచ్చు
- ఒకటి రెండు వారాల్లో వాహనాలు నడపవచ్చు

- డాక్టర్ గిరిధర్ ప్రసాద్
సీనియర్ కార్డియో థొరాసిక్, మినిమల్లీ ఇన్వేసివ్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్.



ఐటమ్ సాంగ్స్‌తో అదరగొడుతూ




స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా పలు సినిమాల్లో నటిస్తూ రాణిస్తున్నారు. ఒప్పుడు గ్లామర్ పాత్రలతో అదరగొట్టిన తమన్నా...ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు, పలు వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ మిల్కీ బ్యూటీ దక్షిణాదిలో కేవలం ప్రత్యేక సాంగ్స్‌లో మాత్రమే కనిపిస్తున్నారు. గతేడాది జైలర్ సినిమాలో ఐటమ్ సాంగ్‌లో మెరిసిన తమన్నా...ఇటీవల స్త్రీ-2 చిత్రంలో స్పెషల్ సాంగ్‌తో అదరగొట్టారు. ప్రస్తుతంలో తెలుగులో 'ఓదెల2' అనే సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఆమె నటించిన క్రైమ్ అండ్ థ్రిల్లర్ హిందీ మూవీ 'సికందర్ కా ముఖద్దర్' నవంబరు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవనుంది.

డాక్టరు, డైరెక్టర్ ఒకటయ్యారు!



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, డాక్టర్ ప్రీతి చల్లా వివాహ బంధంతో ఒకటై కొత్త ప్రయాణం ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం వైభవంగా జరిగింది. డాక్టర్ ప్రీతి హైదరాబాద్‌లో గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. సెన్సిటివ్ కథలను ఎన్నుకొని అద్భుత చిత్రాలను రూపొందించే దర్శకుడిగా పేరొందిన క్రిష్ ప్రస్తుతం అనుష్క హీరోయిన్‌గా 'ఘాటీ' చిత్రాన్ని తీస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.



జపాన్‌లో రిలీజ్ అవుతున్న కల్కి

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ' వచ్చే ఏడాది జనవరి 3న జపాన్‌లో జరిగే షోగాట్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమవుతుంది. జపాన్ సినీ దిగ్గజం కబాటా క్రైజో ఆధ్వర్యంలో ట్విన్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండడంతో కల్కి గ్లోబల్ జర్నీలో మరో అధ్యాయం మొదలవుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'కల్కి' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 12 వందల కోట్లకు పైగా వసూలు చేసి, 2024లో అత్యధిక వసూళ్లు చేసిన భారతీయ చిత్రంగా రికార్డ్ నెలకొల్పింది. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపిక తదితరులు నటించారు.

ప్లీజ్.. అలా పిలవొద్దు

తన అభిమానులతో పాటు సినీ ప్రముఖులకు అగ్రనటుడు కమల్ హాసన్ ఓ విజ్ఞప్తి చేశారు. తనను 'ఉలగనాయకన్' (విశ్వనటుడు) అంటూ పిలవొద్దని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. కమల్ హాసన్, లేదా కమల్ లేదా కేహెచ్ అని పిలిస్తే చాలని సూచించారు. కళ కంటే కళాకారుడు గొప్పకాదని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయ చిత్రపరిశ్రమలో అగ్రహీరోగా ఉన్న కమల్ హాసన్‌ను అనేక మంది 'ఉలగనాయగన్' అంటూ సంబోదిస్తుంటారు. ఇకపై అలా పిలవొద్దని ఆయన కోరారు. 'నాపై మీకున్న అపారమైన ప్రేమాభిమానాల వల్ల 'ఉలగనాయగన్' అంటూ ముద్దుగా పిలుస్తుంటారు. మీ ప్రేమకు ఎన్నటికీ కృతజ్ఞుడను. సినిమా కళ అనేది ఒక వ్యక్తి కంటే గొప్పది.



అలాంటి కళను మరింతగా నేర్చుకుంటూ పరిణామం చెందుతున్న నిత్యనూతన విద్యార్థిని నేను. ఇతర కళల తరహాలోనే సినిమా కూడా ప్రతి ఒక్కరికీ చెందినది. ప్రతిభావంతులైన కళాకారులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకుల కలయికతోనే సినిమా రూపుదిద్దుకుంటుంది. కళ కంటే కళాకారుడు గొప్పవాడు కాదన్నది నా ప్రగాఢ విశ్వాసం. నిరంతర అభ్యాసంతోనే పురోగతిని సాధించవచ్చు' అని కమల్ విజ్ఞప్తి చేశారు. గతంలో హీరో అజిత్‌ను ఆయన అభిమానులు 'తల' అంటూ సంబోధించేవారు. దీన్ని గ్రహించిన అజిత్.. తనను 'తల' అని పిలవొద్దని అజిత్ లేదా అజిత్ కుమార్ లేదా ఏకే అని మాత్రమే పిలవాలని విజ్ఞప్తి చేసిన విషయం తెల్సిందే.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

టార్గెట్ రెండు సార్లు మిస్ అయింది..
ఈ సారి గట్టిగా కొడతా



వరుణ్‌తేజ్

'టార్గెట్ రెండు సార్లు మిస్ అయింది. ఈ సారి మాత్రం గట్టిగా కొడతా.నేను మామూలుగా మాటలు చెప్పే వ్యక్తిని కాదు. కానీ 'మట్కా' చూసి నమ్మకంతో చెబుతున్నా. ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది' అని చెప్పారు వరుణ్‌తేజ్. ఆయన హీరోగా నటించిన 'మట్కా' చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం వైజాగ్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'ఒక మాస్ సినిమా చేద్దాం.. అందరికీ నచ్చే చిత్రం చేద్దాం అనుకుంటున్న తరుణంలో దర్శకుడు కరుణకుమార్ 'మట్కా' కథతో వచ్చారు. ఆయనతో కలసి పని చేయడం నిజంగా నా అదృష్టం. సినిమా రిలీజ్ అయిన తర్వాత అందరూ ఆయన గురించి మాట్లాడుకుంటారు.ప్రతి సినిమా రిలీజ్ ముందు ఓ టెన్షన్ ఉంటుంది. అలా టెన్షన్ పడుతున్నప్పుడు రామ్‌చరణ్ అన్నయ్య ఫోన్ చేసి ఎమోషనల్ సపోర్ట్ ఇచ్చారు' అంటూ ఈ చిత్ర నిర్మాతలకు, నటించిన నటీనటులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా తర్వాత వరుణ్ తేజ్ పరిశ్రమలోని టాప్ మాస్ హీరోల్లో ఒకరవుతారని నిర్మాతల్లో ఒకరైన రామ్ తాళ్లూరి చెప్పారు. 'వైజాగ్‌కు ఓ చరిత్ర ఉంది. అందులో ఓ భాగాన్ని ఈ సినిమాగా చూపిద్దాం అనుకున్నాను. వైజాగ్‌లో ఒకప్పుడు జరిగిన కథ ఇది. కథ వినగానే ఫస్ట్ సిట్టింగ్‌లోనే వరుణ్‌తేజ్ ఓకే చేశారు. మనిషిలోని మంచీచెడు గురించి మాట్లాడే సినిమా ఇది' అని దర్శకుడు కరుణకుమార్ చెప్పారు. చరిత్రలో నిలిచిపోయే సినిమా ఇదనీ, మెగాఫ్యాన్స్ తొడ కొట్టి చెప్పవచ్చని మరో నిర్మాత డాక్టర్ విజయేందర్ రెడ్డి చెప్పారు.

దిల్ రాజు డ్రీమ్స్... కొత్త సినిమాలు



ప్రముఖ నిర్మాత దిల్ రాజు కొత్త నిర్మాణ సంస్థను ప్రకటించారు. 'దిల్ రాజు డ్రీమ్స్' పేరుతో నెలకొల్పిన ఆ ప్రొడక్షన్ హౌజ్ చిత్ర పరిశ్రమలో కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించనుంది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కొత్త నిర్మాణ సంస్థ గురించిన వివరాలను దిల్ రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'యంగ్ జనరేషన్‌తో సినిమాలు చేయాలని ఉంది. గతంలో నా జర్నీలో అన్నీ అద్భుతమైన సినిమాలే వచ్చాయి. స్టార్ హీరోలందరితో చేశాం. ఇండస్ట్రీకి వచ్చి 30 ఏళ్లు అయింది. ఇప్పుడు మాకు కంటెంట్‌కి కొదవ లేదు. వరుస సినిమాలు చేస్తున్నాం. న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేయాలని కొత్త బేనర్ 'దిల్ రాజు డ్రీమ్స్' ప్రారంభిస్తున్నాం. 'దిల్ రాజు డ్రీమ్స్'కు అనేక టీమ్స్‌ను ఏర్పాటు చేశాం. కథలు, సినిమాల నిర్మాణం, విడుదల వరకు న్యూ టాలెంట్‌ను సపోర్ట్ చేయాలనేదే మా ఆలోచన. దీనికోసం ఒక వెబ్‌సైట్‌ని కూడా ఏర్పాటు చేశాం. త్వరలోనే దానిని లాంచ్ చేయనున్నాం. ఇదంతా కార్పొరేట్ స్టయిల్‌లో ఆర్గనైజ్డ్ సిస్టమ్‌గా ఉంటుంది. స్క్రిప్ట్ రివ్యూ పేరుతో ఎక్స్‌పెరిమెంట్ కూడా చేయాలనుకుంటున్నాం. 'జటాయి' అనే పాన్ ఇండియా సినిమా నా డ్రీమ్ ప్రాజెక్ట్. ఆ సినిమా వివరాలను త్వరలోనే తెలియజేస్తాం' అని చెప్పారు.

కొత్త సినిమా కబుర్లు...

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమాను జనవరి 10న రిలీజ్ చేయబోతున్నాం. సంక్రాంతికి అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదల ఉంటుంది. నితిన్‌తో చేస్తున్న 'తమ్ముడు'ని శివరాత్రికి రిలీజ్ చేయనున్నాం. ఇవి కాకుండా నితిన్, వేణు కాంబినేషన్‌లో 'యల్లమ్మ', యష్ మాస్టర్ హీరోగా ఒక సినిమా, ఆశిష్ హీరోగా చేస్తున్న 'సెల్ఫిష్'... ఇలా అనేక సినిమాలతో బిజీగా ఉన్నా.

ముందస్తు బెయిల్ ఇవ్వండి
నటి కస్తూరి హైకోర్టులో పిటిషన్



తెలుగు ప్రజలను కించపరిచేలా ఇటీవల వ్యాఖ్యలు చేసిన సీనియర్ నటి కస్తూరి.. తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. తెలుగువారిపై చేసిన వ్యాఖ్యల పట్ల విచారణ వ్యక్తం చేసిన తర్వాత కూడా రాజకీయకక్ష కారణంగా తనపై కేసు నమోదుచేశారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కేసులో కోర్టు విధించిన అన్ని షరతులకు కట్టుబడి ఉంటానని, అందువల్ల తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు మంగళవారం రానుంది. కస్తూరిపై మదురై, సేలం, చెన్నై తదితర ప్రాంతాల్లో పలు ఫిర్యాదులు నమోదైన విషయం తెలిసిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

చిత్రపురి కాలనీలో అనర్హుల రిజిస్ట్రేషన్లు రద్దు



తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలుగు సినీ పరిశ్రమపై కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రపురి కాలనీలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేరు మీద జూనియర్ ఆర్టిస్టుల కోసం, క్యారెక్టర్ ఆర్టిస్టుల కోసం స్థలాలు కేటాయించిందని గుర్తు చేశారు. ఇందులో అనర్హులుంటే వారి రిజిస్ట్రేషన్లు రద్దు చేసి ఆ స్థలాలను తెలంగాణ ఆర్టిస్టులకు ఇవ్వాలనేది తన ఉద్దేశం అని అన్నారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించిన తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా కోమటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "వారానికి నలుగురు, ఐదుగురు నిర్మాతలు వారి సినిమాల పోస్టర్ లాంచ్ చేయాలని కోరుతూ తన వద్దకు వస్తుంటారని, వారిని తాను అడిగితే థియేటర్లు దొరకడం లేదని అంటున్నారని అన్నారు. అలాంటి వాళ్లు రిలీజ్ డేట్ అనౌన్స్‌కి ముందే తనను సంప్రదిస్తే, మీకు సపోర్ట్‌గా ఉండి థియేటర్లు ఇప్పిస్తానని హామి ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. ఒక పాన్ ఇండియా సినిమా అంటూ ఐదారుగురు హీరోలకో, డైరెక్టర్లకో పరిమితమైతే ఎలా అని మంత్రి ప్రశ్నించారు. పాన్ ఇండియా సినిమా రిలీజ్ అవుతోంది, పెద్ద బడ్జెట్‌తో తీశాం, మాకు రేట్లు పెంచుకునే అవకాశం ఇవ్వండి అని కొందరు తన వద్దకు వస్తున్నారని, అలాంటి వారికి సమయం ఇవ్వనని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో టాలెంట్ కలిగిన నటులు ఎందరో ఉన్నారని, వారికి తమ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతిభ కలిగిన తెలంగాణ నటీనటులకు గుర్తింపు దక్కడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, వైస్ ప్రెసిడెంట్ గురురాజ్, సెక్రటరీలు జేవీర్, కాచం సత్యనారాయణ, టీ మా ప్రెసిడెంట్ రశ్మీ ఠాకూర్, ప్రసాద్ సంస్థల అధినేత రమేశ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దీపికకు వరం.. ఐశ్వర్యకు కలవరం




కొన్ని కొన్ని విషయాల గురించి వింటుంటే తమాషాగా అనిపిస్తుంటుంది. సినిమాల్లో మొదట ఒక తారను అనుకుని చివరికి మరొకరిని తీసుకోవడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది. ఇలాంటి మార్పుల వల్ల ఆయా తారల కెరీర్ కీలకమైన మలుపు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఐశ్వర్య, దీపిక.. అందంలో, అభినయంలో సమ ఉజ్జీలే. ఐశ్వర్య చేయాల్సిన రెండు చిత్రాలు 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' చివరి క్షణంలో ఆమె చేజారి దీపికకు దక్కాయి. సల్మాన్ ఖాన్, ఐశ్వర్య జంటగా 'బాజీరావు మస్తానీ' చిత్రాన్ని తీయాలని దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ 2003లో ప్లాన్ చేశారు. అంతా సవ్యంగా జరుగుతుందనుకుంటున్న సమయంలో అప్పటివరకూ ప్రేమికులుగా ఉన్న సల్మాన్, ఐశ్వర్య బ్రేకప్ చెప్పేసుకుని విడిపోవడం, ఆ వార్త వైరల్ కావడంతో భన్సాలీ ముందే మేల్కొన్నారు. వీరిద్దరిని ఆయన వద్దనుకున్నారు. అప్పుడు హీరోయిన్‌గా దీపికను తీసకున్నారు. అలాగే అల్లాఉద్దీన్ ఖిల్జీగా షారుఖ్‌ఖాన్‌నీ, రాణి పద్మావతిగా ఐశ్వర్య బచ్చన్‌ని పెట్టి "పద్మావత్' చిత్రాన్ని తీయాలని భన్సాలీ ప్లాన్ చేశారు. కానీ ఒక నరహంతకుడి పాత్రను పోషించడానికి షారుఖ్ ఖాన్ ఆసక్తి చూపించకపోవడంతో షారుఖ్‌నే కాదు ఐశ్వర్యను కూడా మార్చేశారు భన్సాలీ. మళ్లీ ఆ అవకాశం దీపికకే దక్కింది. 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' చిత్రాలు ఒక్కొక్కటీ రూ 950 కోట్లు వసూలు చేయడంతో హీరోయిన్‌గా దీపిక జాతకమే మారిపోయింది.

'ధూం ధాం'గా ఎంజాయ్ చేస్తున్నారు

- ప్రొడ్యూసర్, రైటర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన సినిమా 'ధూం ధాం'. సాయి కిశోర్ దర్శకత్వంలో ఎం.ఎస్.రామ్ కుమార్ నిర్మించారు. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ నేపథ్యంలో చిత్రం సక్సెస్ గురించి ప్రొడ్యూసర్ రామ్ కుమార్, రైటర్ గోపీ మోహన్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు.

- రామ్ కుమార్ మాట్లాడుతూ' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఒక థియేటర్‌లో కామన్ ఆడియన్స్‌తో కలసి హీరో చేతన్ సినిమా చూశారు. వారు మూవీని బాగా ఎంజాయ్ చేయడం గమనించి హ్యాపీగా ఫీలయ్యారు. సక్సెస్‌ఫుల్ హీరోలంతా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఇంప్రెస్ చేసిన వాళ్లే. చేతన్ కూడా అలాగే పేరు తెచ్చుకున్నారు. ఈ రోజుల్లో థియేటర్స్‌కు జనం పెద్దగా రావడం లేదు. మేము ఆశించినంత కలెక్షన్స్ లేకున్నా సంతృప్తికరంగానే వసూళ్లు ఉన్నాయి. మా సంస్థలో తరవాత చిత్రాన్ని మరికొద్ది రోజుల్లో అనౌన్స్ చేస్తాం. బయట హీరోలతో సినిమాలు చేసే ఉద్దేశం లేదు. చేతన్‌తోనే మా నెక్స్ట్ మూవీ ఉంటుంది' అని తెలిపారు.
- రచయిత గోపీ మోహన్ మాట్లాడుతూ' మేము అనుకున్నట్లే సాంగ్స్‌ను, కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వెన్నెల కిషోర్ క్యారెక్టర్‌కు ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రొడ్యూసర్ రామ్ కుమార్, హీరో చేతన్ ఇద్దరూ కామెడీ లవర్స్. నా నెక్స్ట్ మూవీ గల్లా జయదేవ్ రెండో అబ్బాయితో ప్లాన్ చేస్తున్నా. నా డైరెక్షన్‌లోనే ఆ సినిమా చేస్తా. ఆ వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు.

వెయ్యేళ్ల కిందటి వీరుడి పాత్ర



డైరెక్టర్ శివ

సూర్య హీరోగా తెరకెక్కిన భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'కంగువ'. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. శివ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని కె.ఈ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈనెల 14 సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మూవీ హైలెట్స్‌ను మీడియాకు వివరించారు చిత్ర దర్శకుడు శివ. 'కొన్ని స్క్రిప్ట్స్‌ని జ్ఞానవేల్‌కి చెప్పినప్పుడు, వాటిలో 'కంగువ' ఆయనకు బాగా నచ్చింది. ఈ కథను హీరో సూర్యకు చెప్పమన్నారు. సూర్యకు స్క్రిప్ట్ చెప్పాను. చాలా బాగుంది మూవీ చేద్దాం అని సూర్య అన్నారు. అలా 'కంగువ' జర్నీ మొదలైంది. త్రీడీ మూవీస్‌లో 'కంగువ' బెస్ట్ అవుతుంది. కంగువ, ఫ్రాన్సిస్ అనే రెండు పాత్రల్లో సూర్య కనిపిస్తారు. 'కంగువ' వెయ్యేళ్ల కిందటి వీరుడి పాత్ర. ఈ పాత్రకు హద్దులు లేవు. ఫ్రాన్సిస్‌ను కొన్ని అంశాలతో కంట్రోల్ చేయవచ్చు. ఉధిరన్ అనే క్యారెక్టర్‌ను బాబీ డియోల్ చేస్తున్నారు. 'కంగువ'లో ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించాలని ప్రయత్నించాం. ఎందుకంటే ఇప్పటి ట్రెండ్‌లో ప్రేక్షకులు స్క్రీన్ మీద కొత్త ప్రపంచాన్ని, నేపథ్యాన్ని చూసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ గొప్ప సంగీతాన్ని అందించారు. చిత్రంలో ఒక సర్‌ప్రైజింగ్ అతిథి పాత్ర ఉంటుంది. అది 'కంగువ' సీక్వెల్‌కు లీడ్ ఇస్తుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతి స్టార్ హీరోతో సినిమా చేయాలని ఉంది. నా దగ్గర ఇంట్రెస్టింగ్ స్క్రిప్ట్స్ ఉన్నాయి. అవకాశం వస్తే తప్పకుండా తెలుగు స్టార్స్‌తో సినిమాలు చేస్తాను.

నటితో దర్శకుడి ఎంగేజ్‌మెంట్



సుహాస్ హీరోగా నటించిన 'కలర్ ఫొటో' చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్‌రాజ్ ఓ ఇంటివాడు అవుతున్నారు. 'కలర్ ఫొటో' చిత్రంలోనే నటించిన చాందినీ రావుతో ఆయన వివాహం డిసెంబర్‌లో జరుగనుంది. ఆ చిత్ర నిర్మాణ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. సోమవారం జరిగిన తమ వివాహ నిశ్చితార్థ ఫొటోలను సందీప్ రాజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి.

ఇన్ ప్రోగ్రెస్

ఎన్టీఆర్ ఎంపిక చేసిన కథ



నార్నే నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందిన 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. సంపద హీరోయిన్. ఈ సినిమా గురించి నిర్మాత చింతపల్లి రామారావు మాటాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే వెరైటీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ అంశాలతో నిర్మించాం. జూనియర్ ఎన్టీఆర్ ఎంతో మెచ్చి ఎంపిక చేసిన కథ ఇది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు అద్భుతంగా చిత్రాన్ని రూపొందించారు. మా హీరో నార్నే నితిన్ నటించిన 'ఆయ్', 'మ్యాడ్' చిత్రాల తరహాలో హ్యాట్రిక్ హిట్ సాధిస్తుంది' అని చెప్పారు.

కోర్టు నేపథ్యంలో సాగే కథ



త్రిగుణ్, దీప్శిక ప్రధాన పాత్రలు పోషించిన 'ఉద్వేగం' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. త్రిగుణ్‌కు ఇది 25వ సినిమా. కోర్టు నేపథ్యంలో సాగే ఈ సినిమాను మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో జి.శంకర్, ఎల్.మదు నిర్మించారు. శ్రీకాంత్ భరత్, సురేశ్ నాయుడు, పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. సినిమా టీజర్ ప్రేక్షకాదరణ పొందిందనీ, సినిమా కూడా వారిని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉందనీ నిర్మాతలు చెప్పారు.

బిజినెస్

భాంజు రూ.139 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యార్థులకు సులభంగా గణితంలో మెలకువలు నేర్పే ఎడ్యుకేషన్ స్టార్టప్ కంపెనీ 'భాంజు' కొత్తగా 1.65 కోట్ల డాలర్లు (సమారు రూ.139.22 కోట్లు) సమీకరించింది. సిరీస్-బీ ఫండింగ్ ద్వారా ఈ నిధులు సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఎపిక్ క్యాపిటల్, 23 వెంచర్స్, ఎయిట్ రోడ్స్, లైట్‌స్పీడ్ వెంచర్స్ అనే సంస్థల నుంచి కంపెనీ ఈ నిధులు సమీకరించింది. ఈ నిధులతో తమ కార్యకలాపాలను అమెరికా, బ్రిటన్, పశ్చిమాసియా దేశాలకూ విస్తరిస్తామని భాంజు ఫౌండర్, సీఈఓ నీలకంఠ భాను తెలిపారు.

హైదరాబాద్‌లోనూ 'టెక్‌ఎక్స్‌పిడైట్'

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ 'గేమ్స్ 24X7' తన 'టెక్ ఎక్స్‌పిడైట్' కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు విస్తరించింది. ఈ కార్యక్రమం ద్వారా కృత్రిమ మేధ (ఏఐ), గేమింగ్, ఇన్‌క్లూజివ్ టెక్నాలజీ రంగాలకు చెందిన స్టార్టప్ కంపెనీలకు ప్రత్యేక యాక్సిలరేషన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఏడబ్ల్యూఎస్ సంస్థ ఇందుకు క్లౌడ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుంది.

పదేళ్లలో రూ.84 లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల ద్వారా భారత కుటుంబాలకు సమకూరిన సంపద ఇది

దశాబ్ద కాలంలో రూ.714 లక్షల కోట్ల సంపద వృద్ధి

అందులో 11% ఈక్విటీల నుంచి.. : మోర్గాన్ స్టాన్లీ



న్యూఢిల్లీ: భారత కుటుంబాలు తమ ఆస్తుల్లో కేవలం 3 శాతం షేర్లలో పెట్టుబడిగా పెట్టడం ద్వారా గత పదేళ్లలో స్టాక్ మార్కెట్ నుంచి లక్ష కోట్ల డాలర్లు (రూ.84 లక్షల కోట్ల పైమాటే) ఆర్జించి ఉంటాయని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. గత పదేళ్లలో భారత కుటుంబాలు తమ సంపదను 8.5 లక్షల కోట్ల డాలర్ల (రూ.714 లక్షల కోట్లు) మేర పెంచుకున్నాయని.. అందులో 11 శాతం స్టాక్ మార్కెట్ నుంచి గడించాయని మోర్గాన్ స్టాన్లీ నివేదిక వెల్లడించింది. అయితే, ఈక్విటీల్లో భారత కుటుంబాల పెట్టుబడులు ఇప్పటికీ చాలా తక్కువేనని మోర్గాన్ స్టాన్లీ ఇండియా ఎండీ రిధమ్ దేశాయ్ అన్నారు. మొత్తం ఆస్తుల్లో 3 శాతంగా ఈక్విటీ పెట్టుబడులు ముున్ముందు సంవత్సరాల్లో రెండంకెల స్థాయికి పెరగవచ్చన్నారు. మరిన్ని విషయాలు..

- కంపెనీ వ్యవస్థాపకుల ఈక్విటీ వాటాలను సైతం పరిగణనలోకి తీసుకుంటే, భారత కుటుంబాల సంపద గత దశాబ్దకాలంలో 9.7 లక్షల కోట్ల డాలర్లు పెరిగిందని.. అందులో 20 శాతం లేదా 2 లక్షల కోట్ల డాలర్లు స్టాక్ మార్కెట్ నుంచి సమకూరిందని అంచనా.
- ప్రస్తుతం భారత కుటుంబాల ఆస్తుల్లో ఈక్విటీల వాటా చాలా తక్కువే అయినప్పటికీ, గత పదేళ్లలో స్టాక్స్ వీరి పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ముున్ముందు ఈ పెట్టుబడులు మరింత వేగంగా వృద్ధి చెందనున్నాయని నివేదిక అంచనా వేసింది.
- బంగారం సైతం అతిపెద్ద సంపద సృష్టికర్తగా ఉంది. గత పదేళ్లలో పసిడి ద్వారా సంపద 22 శాతం పెరిగింది.
- 2014 మార్చిలో 1.2 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న భారత లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్.. గత పదేళ్లలో భారీగా వృద్ధి చెంది ప్రస్తుతం 5.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. మార్కెట్ క్యాప్ పరంగా ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్ మనదే.
- ప్రపంచ మార్కెట్ క్యాప్‌లో భారత్ స్టాక్ మార్కెట్ వాటా 2013లో 1.3 శాతంగా ఉండగా.. 2024 నవంబరు నాటికి 4.3 శాతానికి పెరిగింది. వర్ధమాన దేశాల్లో రెండో అత్యధిక వాటా మనదే.
- గత దశాబ్ద కాలంలో బంగారం, ఈక్విటీలే అత్యుత్తమ ప్రతిఫలాలు అందించాయి. భారత కుటుంబాల ఆస్తుల్లో అత్యధిక వాటా స్థిరాస్తులదే అయినప్పటికీ, వాటి విలువ మాత్రం మిగతా వాటితో పోలిస్తే అంతగా పెరగలేదని మోర్గాన్ స్టాన్లీ నివేదిక పేర్కొంది.

ఒక షేరుకు రెండు షేర్లు

ఎన్ఎండీసీ బోనస్ ఇష్యూ

సెప్టెంబరు త్రైమాసిక లాభంలో 17% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ.. వాటాదారులకు 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రెండు ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. బోనస్ షేర్ల జారీకి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. కాగా కంపెనీ వాటాదారుల అనుమతికి లోబడి ఈ షేర్ల జారీ ఉంటుందని తెలిపింది. అర్హులైన వాటాదారులకు రికార్డు తేదీ నాడు ఈ బోనస్ షేర్లను జారీ చేయనున్నట్లు పేర్కొంది. 2008 తర్వాత కంపెనీ బోనస్ షేర్లను జారీ చేయటం ఇదే తొలిసారి. అప్పుడు కూడా కంపెనీ 2:1 నిష్పత్తిలోనే బోనస్ షేర్లను జారీ చేసింది. కాగా కంపెనీ అధీకృత మూలధనాన్ని కూడా రూ.400 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పెంచేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని ఎన్ఎండీసీ తెలిపింది.

క్యూ2 లాభం రూ.1,196 కోట్లు: సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ఎన్ఎండీసీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 17%వృద్ధి చెంది రూ.1,195.63 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.1,024.86 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 22 శాతం వృద్ధితో రూ.4,335.02 కోట్ల నుంచి రూ.5,279.68 కోట్లకు పెరిగింది.

హైదరాబాద్‌లో అపర్ణ దక్కన్ టౌన్

- 123 ఎకరాల్లో టౌన్‌షిప్ ఏర్పాటు
- తొలి దశలో రూ.2,851 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక రెసిడెన్షియల్ వెంచర్ ప్రారంభించింది. గోపన్‌పల్లి-గచ్చిబౌలి ప్రాంతంలో 123 ఎకరాల్లో ఈ అల్ట్రా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా జీ+44 ఫ్లోర్లతో తొమ్మిది టవర్లు నిర్మిస్తారు. ఇందులో 99 ఇండిపెండెంట్ ప్రీమియం బంగ్లాలు. ఈ అల్ట్రా లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలో ఒక్కో త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్ విస్తీర్ణం 1,478 ఎస్ఎఫ్‌టీ నుంచి 2,237 ఎస్ఎఫ్‌టీ మధ్య ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ టౌన్‌షిప్ ప్రాజెక్ట్ తొలి దశ కోసం కంపెనీ రూ.2,851 కోట్లు ఖర్చు చేయనుంది.

బీఓఐ లాభం రూ.2,421 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,421 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం ఏకంగా 61 శాతం పెరిగింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.1,458 కోట్ల నుంచి రూ.2,373 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.16,659 కోట్ల నుంచి రూ.19,872 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం 4%పెరిగి రూ.5,986 కోట్లుగా నమోదైంది.

హైదరాబాద్ నుంచి క్యాథే పసిఫిక్ సర్వీసులు

క్యాథే పసిఫిక్ సంస్థ హైదరాబాద్ నుంచి హాంకాంగ్‌కు నేరుగా విమాన సర్వీసులను పునరుద్ధరించింది. వచ్చే ఏడాది మార్చి 30 నుంచి ప్రారంభమయ్యే ఈ సర్వీసుకు బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభించారు. హాంకాంగ్-హైదరాబాద్ మధ్య ఎయిర్‌బస్ ఎ330-300 విమానాన్ని క్యాథే నడుపుతుంది. ఈ విమానంలో బిజినెస్, ఎకానమీ క్లాస్‌లుంటాయి.

కేఫిన్‌టెక్, క్యామ్స్ జేవీ

ఎంఎఫ్ సెంట్రల్ నిర్వహణ కోసం జాయింట్ వెంచర్ (జేవీ)ను ఏర్పాటు చేయాలని కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (క్యామ్స్), కేఫిన్‌టెక్ టెక్నాలజీస్ నిర్ణయించాయి. ఈ జేవీ ఈక్విటీలో రెండు సంస్థలకు సమాన వాటా ఉంటుంది. ఈ జేవీ ద్వారా మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) మదుపరులకు అవసరమైన సమగ్ర సేవలు అందించాలని నిర్ణయించాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,760 ▼	72,200 ▼	1,02,000 ▼
ముంబై	76,840 ▼	70,385 ▼	90,859 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	117
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	102
విశాఖపట్నం	111	అనంతపురం	102
గోదావరి	117		

ఆద్యంతం ఊగిసలాటలే..

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. 1,100 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. 79,001.34 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని, 80,102.14 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 9.83 పాయింట్ల లాభంతో 79,496.15 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 6.90 పాయింట్ల నష్టంతో 24,141.30 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్ షేరు ఏకంగా 8.18 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా నిలిచింది.

రఘు వంశీ చేతికి యూకే కంపెనీ

పీఎంసీ గ్రూప్‌లో 100% వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వైమానిక, రక్షణ రంగ కంపెనీలకు కీలకమైన ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరికరాలు సరఫరా చేసే రఘు వంశీ గ్రూప్ తన కార్యకలాపాలను బ్రిటన్‌కు విస్తరిస్తోంది. ఇందుకోసం బ్రిటన్ కేంద్రంగా పనిచేసే పీఎంసీ గ్రూప్ ఈక్విటీలో 100 శాతాన్ని కొనుగోలు చేసింది. ఇందుకు దాదాపు రూ.100 కోట్లు చెల్లించినట్టు సమాచారం. పీఎంసీ గ్రూప్ ప్రపంచంలోని మేటి ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలకు అవసరమైన కీలక విడిభాగాలు తయారుచేసి సరఫరా చేస్తుంటుంది. ప్రస్తుతం ఈ కంపెనీకి బ్రిటన్‌లో మూడు ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. దాదాపు 100 మంది ఉద్యోగులతో గత ఏడాది రూ.180 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

వ్యూహాత్మక ముందడుగు

పీఎంసీ గ్రూప్‌ను కొనుగోలు చేయడం వ్యూహాత్మక ముందడుగు అని రఘు వంశీ గ్రూప్ తెలిపింది. ఇప్పటికే వైమానిక, రక్షణ రంగాల్లో పట్టున్న తమకు పీఎంసీ కొనుగోలు ద్వారా ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లోనూ అంతర్జాతీయ మార్కెట్లో ముఖ్యంగా యూరోపియన్ మార్కెట్లో మరింత బలం పెంచుకునే అవకాశం ఏర్పడిందని రఘు వంశీ గ్రూప్ ఎండీ వంశీ వికాస్ చెప్పారు. ప్రస్తుతం రఘు వంశీ గ్రూప్ ఆదాయంలో 95 శాతం వైమానిక, రక్షణ రంగాల ద్వారా, ఐదు శాతం ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలకు ప్రెసిషన్ పరికరాల సరఫరా ద్వారా సమకూరుతోంది. పీఎంసీ కొనుగోలుతో ఆయిల్ అండ్ గ్యాస్ పరిశ్రమ వాటా వెంటనే 25 శాతానికి చేరుతుందని వికాస్ చెప్పారు.



మార్కెట్లోకి సరికొత్త డిజైర్

సెడాన్ విభాగంలో వాటా పెంపుపై మారుతి ఫోకస్

న్యూఢిల్లీ: సెడాన్ విభాగంలో మార్కెట్ వాటా పెంచుకోవడం తమ లక్ష్యమని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషి టకూచి అన్నారు. ఎంట్రీ లెవెల్ చిన్న కార్ల అమ్మకాలు క్షీణించినప్పటికీ గ్రామీణ మార్కెట్ల పునరుజ్జీవం ఆ నష్టం భర్తీ కావడానికి దోహదపడిందని ఆయన చెప్పారు. సోమవారం ఆయన సరికొత్త కాంపాక్ట్ సెడాన్ డిజైర్ కారును మార్కెట్లో ప్రవేశపెట్టారు. ఢిల్లీలో దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.6.79 లక్షల నుంచి రూ.10.14 లక్షల మధ్యన ఉంది. ఈ కారుతో సెడాన్ విభాగంలో మార్కెట్ వాటాను పెంచుకోగలుగుతామన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. ఇటీవలి కాలంలో ఎస్‌యూవీ విభాగం మంచి వృద్ధిని నమోదు చేస్తున్నప్పటికీ అగ్రస్థానాన్ని కాపాడుకోవాలంటే తమకి అన్ని విభాగాలూ అవసరమేనని తేల్చి చెప్పారు. ఎంఎస్ఐ ప్రస్తుతం కార్ల మార్కెట్లో 40 శాతం, సెడాన్ విభాగంలో 50 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. కొత్త డిజైర్ అభివృద్ధిపై రూ.1,000 కోట్లు ఇన్వెస్ట్ చేశామని ఆయన చెప్పారు.

ప్రపంచ మార్కెట్లో డిజైర్ అద్భుత విజయం సాధించిందని, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 30 లక్షల కార్లు విక్రయించామని ఆయన తెలిపారు. మొత్తం పరిశ్రమలో సెడాన్ విక్రయాలు క్షీణిస్తున్నప్పటికీ తమకు మాత్రం ఆ మార్కెట్ బాగుందని టకూచీ చెప్పారు.

స్పోర్ట్స్

ఒలింపిక్ ఆతిథ్యం దక్కకుండా కుట్ర?

భారత్‌కు వ్యతిరేకంగా ఐఓసీకి లేఖ రాసే యోచనలో పాక్

చాంపియన్స్ ట్రోఫీకి రోహిత్ సేన తమ దేశం రావడం లేదన్న అక్కసుతోనే

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీలో ఆడేందుకు రోహిత్ సేన పాకిస్థాన్ వెళ్లడంలేదని భారత్ స్పష్టంజేసింది. ఈమేరకు తమ నిర్ణయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ఇప్పటికే తెలియజేసింది. భారత్ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి ఐసీసీ వివరించింది కూడా. అయితే.. భారత్ ఈ నిర్ణయం..రెండు దేశాల ఇతర క్రీడా సంబంధాలపైనా తీవ్రంగా పడే అవకాశం కనిపిస్తోంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం భారత్‌కు దక్కకుండా ఉండాలని పాకిస్థాన్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. చాంపియన్స్ ట్రోఫీకి తమ దేశం వచ్చేందుకు నిరాకరించడంతో భారత్ ఒలింపిక్ బిడ్‌ను వ్యతిరేకించాలని పాకిస్థాన్ భావిస్తున్నట్టు తెలిసింది. 2036 ఒలింపిక్స్‌కు బిడ్ వేయాలని నిర్ణయించుకున్నామంటూ భారత్ ఆసక్తి వ్యక్తీకరణ లేఖను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి ఇటీవల అందజేసిన సంగతి తెలిసిందే. 'క్రీడా పోటీలను భారత్ రాజకీయం చేసింది' అనే కోణంలో భారత్ వ్యతిరేకంగా ఐఓసీకి లేఖ రాయాలని నిర్ణయించినట్టు సమాచారం. అంతేకాదు.. భారత్ బిడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని కూడా పాకిస్థాన్ భావిస్తున్నట్టు తెలిసింది.



హైబ్రిడ్ విధానంలో చాంపియన్స్ ట్రోఫీ!

ప్రతిపాదించిన ఐసీసీ

పీసీబీ స్పందన కోసం ఎదురు చూపు

దుబాయ్: పాకిస్థాన్ వెళ్లేందుకు భారత్ నిరాకరించడంతో..చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రతిపాదించింది. ఈమేరకు టోర్నీ ఆతిథ్య హక్కులు కలిగిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రతిస్పందన కోసం ఐసీసీ ఎదురు చూస్తోంది. 'ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ వదులుకోకుంటే.. భారత్ ఆడే మ్యాచ్‌లను యూఏఈలో, ఫైనల్‌ను దుబాయ్‌లో నిర్వహించాలని పీసీబీకి ప్రతిపాదించాం' అని ఐసీసీ అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. ఫైనల్‌ను పాకిస్థాన్‌లో గాకుండా దుబాయ్‌లో నిర్వహిస్తేనే చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ పద్ధతికి బీసీసీఐ అంగీకరించింది' అని కూడా ఆ అధికారి తెలిపారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహణకు అంగీకరిస్తే..పూర్తి ఆతిథ్య రుసుము చెల్లించడంతోపాటు మెజార్టీ మ్యాచ్‌లు పాకిస్థాన్‌లో నిర్వహించేలా ఐసీసీ హామీ ఇచ్చినట్టు సమాచారం. భారత్ తమ దేశం రాని నేపథ్యంలో ఆతిథ్య హక్కులను పాక్ కనుక వదులుకొంటే..చాంపియన్స్ ట్రోఫీని దక్షిణాఫ్రికాకు తరలించాలని కూడా ఐసీసీ ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ టోర్నీలో షెడ్యూల్ ప్రకారం పాక్ వేదికగా వచ్చే ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగాలి.



బుమ్రాకే పగ్గాలు!



రోహిత్ సందేహమే.. ఓపెనర్‌గా రాహుల్

బోర్డర్-గవాస్కర్ సిరీస్‌పై కోచ్ గంభీర్

ముంబై: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగే తొలి టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదని టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. ఒకవేళ అతను ఆడలేకపోతే వైస్‌కెప్టెన్ బుమ్రా ఆధ్వర్యంలో జట్టు బరిలోకి దిగుతుందని స్పష్టం చేశాడు. ఈ సిరీస్ కోసం భారత జట్టు ఆదివారం, సోమవారం రెండు విడతలుగా ఆస్ట్రేలియా పర్యటనకు బయలుదేరింది. ఈ బృందాల్లో రోహిత్ లేడు. ఈ నేపథ్యంలో కోచ్ గంభీర్ సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడాడు. 'ప్రస్తుతానికి రోహిత్ విషయంలో స్పష్టత లేదు. సిరీస్ ఆరంభ మ్యాచ్‌కు ముందు ఏ విషయం తెలుస్తుంది. ఒకవేళ రోహిత్ ఆడలేకపోతే పెర్త్ టెస్టుకు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రోహిత్ స్థానంలో ఆడేందుకు ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్, రాహుల్ మాకు అందుబాటులో ఉన్నారు. నాణ్యమైన జట్టుతోనే బరిలోకి దిగుతాం. రాహుల్‌కు ఓపెనర్‌గానే కాకుండా మూడు, ఆరు నెంబర్లలో ఆడిన అనుభవముంది. వన్డేల్లో కీపర్‌గానూ వ్యవహరించగలడు. ఎన్ని జట్లకు ఇలాంటి ఆటగాడు అందుబాటులో ఉంటాడు? అందుకే రోహిత్ స్థానంలో రాహుల్ ఆడే అవకాశం ఉంది' అని గౌతీ తేల్చాడు. ఇక శార్దూల్ ఠాకూర్‌ను ఎంపిక చేయకపోవడంపై స్పందిస్తూ.. ఆసీస్ పర్యటనకు తాము ఉత్తమ జట్టుతోనే వెళ్లనున్నట్టు వ్యాఖ్యానించాడు. చివరి భారత్ టూర్‌లో ఆల్‌రౌండర్‌గా శార్దూల్ అద్భుతంగా రాణించాడు. మరోవైపు పేసర్ హర్షిత్ రాణాపై పనిభారం పడకూడదనే భారత్ 'ఏ' తరఫున అతడిని ఎంపిక చేయలేదని వివరించాడు. దేశవాళీ క్రికెట్‌లో అతడికి తగిన ప్రాక్టీస్ లభించిందని గంభీర్ చెప్పాడు.

10 రోజులు చాలు..: ఈనెల 22న తొలి టెస్టు మొదలవనుంది. అయితే భారత జట్టు పది రోజుల ముందే ఈ సుదీర్ఘ సిరీస్ కోసం ఆసీస్‌లో అడుగుపెట్టనుంది. 'మా దగ్గర అనుభవం కలిగిన క్రికెటర్లకు కొదువ లేదు. అలాంటి వాళ్లు యువ ఆటగాళ్లకు సహాయకంగా ఉంటారు. ఈ పది రోజులు మాకు చాలా కీలకం. కానీ 22న ఉదయం నుంచి తొలి బంతి నుంచే చెలరేగేందుకు సిద్ధంగా ఉంటాం' అని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

మా గురించి ఆయనకు ఎందుకు?

ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలకు గంభీర్ మద్దతిచ్చాడు. అలాగే ఐదేళ్లలో కేవలం 2 సెంచరీలు చేసిన విరాట్‌కు జట్టులో చోటు అవసరమా? అని ప్రశ్నించిన ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్‌కు గౌతీ కౌంటరిచ్చాడు. 'భారత క్రికెట్‌తో పాంటింగ్‌కు ఏం సంబంధం? అతడు ఆసీస్ గురించి ఆలోచించాలి. ముఖ్యంగా విరాట్, రోహిత్‌పై ఆందోళన అతడికి అనవసరం' అని గంభీర్ సూటిగా తేల్చాడు.

గంభీర్‌తో మాట్లాడించొద్దు

మంజ్రేకర్ సూచన

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు తరఫున కోచ్ గంభీర్ మీడియా సమావేశంలో మాట్లాడడంపై మాజీ ఆటగాడు మంజ్రేకర్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇంకెప్పుడూ అతడిని ఇలాంటి వాటికి పంపకూడదని బీసీసీఐకి సూచించాడు. 'గంభీర్ మీడియా సమావేశం చూశాను. కానీ ముున్ముందు ఇలాంటి బాధ్యతలు అతడికి బీసీసీఐ అప్పగించకూడదు. ఎందుకంటే వారితో మాట్లాడేటప్పుడు ప్రవర్తనాలోపంతో పాటు అతను సరైన పదాలు కూడా వాడలేకపోయాడు. మీడియా భేటీలో మాట్లాడే హక్కు గంభీర్‌కు లేదు. అందుకే అతడిని తెర వెనకాలే ఉంచి రోహిత్ లేక చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌ను మీడియా ముందుకు పంపాలి' అని మంజ్రేకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.



అమ్మాయిల శుభారంభం

- మలేసియాపై ఘన విజయం
- హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్ (బిహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు అద్భుత శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత మహిళల బృందం 4-0 గోల్స్ తేడాతో మలేసియాను చిత్తు చేసింది. యువ స్ట్రయికర్ సంగీతా కుమారి (8వ నిమిషం, 55వ) రెండు గోల్స్‌తో విజృంభించగా.. ప్రీతి దూబే (43వ), ఉదిత (44వ) చెరో గోల్ సాధించారు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ను దక్షిణ కొరియాతో మంగళవారం తలపడనుంది. ఇతర మ్యాచుల్లో జపాన్, కొరియా జట్ల మధ్య పోరు 2-2తో డ్రాగా ముగియగా.. ఒలింపిక్ రజత పతక విజేత చైనా 15-0తో థాయ్‌లాండ్‌పై అద్భుత విజయం సాధించింది.

జ్యోతి సురేఖకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ జేవీడీ ఓపెన్ కింగ్స్ ఆర్చరీ అంతర్జాతీయ పోటీల్లో కాంస్యం పతకం సొంతం చేసుకుంది. సోమవారం నెదర్లాండ్స్‌లోని ఐండ్‌హోవెన్‌లో జరిగిన కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సురేఖ మూడోస్థానంలో నిలిచింది. ఎలీసా (ఇటలీ)కు స్వర్ణం, మార్టియా (ఈస్తోనియా)కు రజతం లభించాయి.

జిమ్నాస్ట్ నిషికకు పతకం



బెల్జియంలోని కీర్‌బెర్గెన్ నగరంలో జరిగిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో హైదరాబాద్ అమ్మాయి నిషిక అగర్వాల్ కాంస్య పతకం కొల్లగొట్టింది. వాల్ట్ విభాగంలో నిషిక 12.817 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది.



రష్మిక @1

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయి శ్రీవల్లి రష్మిక జాతీయ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా నిలిచింది. సోమవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో సింగిల్స్‌లో రష్మిక 209 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మరో తెలుగమ్మాయి సహజ (208) రెండో ర్యాంకులో ఉంది. సానియా, సహజ తర్వాత నెంబర్ వన్ ర్యాంక్ అందుకొన్న తెలుగు క్రీడాకారిణి రష్మికనే.



ఉమా మహేష్ బృందానికి స్వర్ణం

ప్రపంచ విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన మద్దినేని ఉమా మహేష్ పతకంతో సత్తా చాటాడు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఉమా మహేష్, ఐశ్వరీప్రతాప్, స్మిత్ రమేష్‌లతో కూడిన భారత బృందం స్వర్ణం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో స్మిత్ రమేష్ రజతం గెలిచాడు.



'ఆమె'గా మారిన సంజయ్ బంగర్ కుమారుడు

ముంబై: భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమారుడు ఆర్యన్ లింగమార్పిడి చేయించుకున్నాడు. 23 ఏళ్ల ఆర్యన్ పదకొండు నెలల పాటు హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్‌ఆర్‌టీ) కొనసాగించాక ఇటీవలే అమ్మాయిగా మారాడు. తన పేరును అనయ బంగర్‌గా మార్చుకున్నాడు. ముంబైలోని ఇస్లాం జింఖానా క్లబ్ తరఫున క్రికెట్ ఆడిన ఆర్యన్.. గతంలో ధోనీ, విరాట్‌తో దిగిన ఫొటోలతో పాటు అమ్మాయిగా మారిన క్రమాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

అర్జున్‌కు మూడోస్థానం

'చెన్నై గ్రాండ్‌మాస్టర్'గా అరవింద్

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్‌కు నిరాశే ఎదురైంది. ఈ టోర్నీలో తొలి ఐదు రౌండ్లలో సత్తాచాటిన అర్జున్ ఆఖరి రెండు రౌండ్లతో పాటు టైబ్రేకర్ పోటీల్లో పరాజయం పాలయ్యాడు. ఫలితంగా అర్జున్ టోర్నీలో మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అరవింద్ చిదంబరం (తమిళనాడు) టైటిల్ దక్కించుకోగా, లెవాన్ అరోనియన్ (అమెరికా) రెండో స్థానంలో నిలిచాడు. చెన్నై చాలెంజర్స్ ఓపెన్ చెస్ ఈవెంట్‌లో ప్రణవ్ (బెంగళూరు) విజేతగా నిలవగా.. తెలుగమ్మాయి హారిక ఏడు, వైశాలి ఎనిమిదో స్థానాలకు పరిమితమయ్యారు.

బరిలో సింధు, సేన్

నేటినుంచి జపాన్ ఓపెన్

కుమమోటో (జపాన్): జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం ఇక్కడ మొదలవనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన నాటినుంచి.. గతఫామ్‌ను అందుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న పీవీ సింధు, లక్ష్యసేన్ టోర్నీ బరిలో దిగుతున్నారు. సింగిల్స్ తొలిరౌండ్‌లో 8వ సీడ్ బుసానన్ (థాయ్‌లాండ్)ను సింధు.. లియాంగ్ జున్ (మలేసియా)ను లక్ష్యసేన్ ఢీకొంటారు. డబుల్స్ మొదటి రౌండ్‌లో సు యిన్/లిన్ యున్ (తైపీ)తో గాయత్రి/ట్రీసా జంట తలపడనుంది.



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎంపీ లక్ష్మణ్

దారుణంగా ధాన్యం కొనుగోళ్లు

- తూకాల కోసం రైతులు ప్రాధేయపడాల్సి వస్తోంది
- కాంగ్రెస్ పాలనలో మిల్లర్ల రాజ్యం నడుస్తోంది: లక్ష్మణ్
- దొడ్డు ధాన్యానికీ రూ.500 బోనస్ ఇవ్వాలి: ఈటల

చౌటుప్పల్ టౌన్/జనగామ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి దారుణంగా ఉందని, తూకాల కోసం రైతులు ప్రాధేయ పడాల్సిన పరిస్థితి ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చౌటుప్పల్ కొనుగోలు కేంద్రంలో తూకం వేసి పంపించిన 600 బస్తాల ధాన్యంలో 60 బస్తాల ధాన్యం బాగోలేదని ఓ మిల్లరు తిరిగి పంపించడం విచిత్రంగా ఉందని, కాంగ్రెస్ పాలనలో మిల్లర్ల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో 93లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, ఇందుకోసం రూ.27వేల కోట్లు ఖర్చు చేయనుందన్నారు. కానీ, ధాన్యం తూకాలు వేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. కాగా, 35 రోజులుగా ప్రాధేయ పడుతున్నా తన ధాన్యం తూకం వేయలేదంటూ చిన్నకొండూరు గ్రామానికి చెందిన రైతు చింతపల్లి పుల్లారెడ్డి తన గోడు వినిపించారు. రూ.వెయ్యి లంచం ఇచ్చిన వారి ధాన్యాన్ని వెంటనే తూకం వేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఎంపీ లక్ష్మణ్ దగ్గరుండి పుల్లారెడ్డి తెచ్చిన ధాన్యం కాంటా వేయించారు. కాగా, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం దొడ్డు, సన్న రకం అనే తేడా లేకుండా ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ చార్జీలను ప్రభుత్వామే చెల్లించాలన్నారు.

20 ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయం సహా రాష్ట్ర వ్యాప్తంగా 20 ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మెదక్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల్ని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రేవంత్ సర్కార్ జాగ్రత్త

- ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రలో బీజేపీ, బీఆర్ఎస్:కూనంనేని

జహీరాబాద్, నవంబరు 11: బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జతకట్టారని, అంతర్గతంగా ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. వాళ్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా నడుచుకోవాలని రేవంత్‌రెడ్డి సర్కారుకు సూచించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరిగిన సీపీఐ 100వ వార్షికోత్సవ బహిరంగ సభలో కూనంనేని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నిలబడాలనే ఉద్దేశంతోనే తాము మద్దతిచ్చామని చెప్పారు. కానీ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 10 నెలలు కావస్తున్నా పాలనపై దృష్టిపెట్టలేదని అన్నారు. పద్ధతి మార్చుకుని ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని రేవంత్‌రెడ్డికి సలహాఇచ్చారు.

ఎన్నుకున్న ఎమ్మెల్యే పార్టీ మారితే ప్రజలేం చేయాలి

- వారి హక్కులకు భంగం కలగకూడదంటే..

అనర్హతపై తక్షణ నిర్ణయం తీసుకోవాలి ..హైకోర్టులో ఏలేటి

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఐదేళ్ల కోసం తమ ఎమ్మెల్యేగా ఎన్నుకున్న వ్యక్తి ప్రజాభీష్టానికి విరుద్ధంగా పార్టీ మారితే వారు ఏం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని మహేశ్వర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో సింగిల్ జడ్జి తీర్పుపై అసెంబ్లీ కార్యదర్శి డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ కొనసాగించింది. ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది జె. ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ఎమ్మెల్యే పార్టీ మారడం వల్ల ఓటు వేసిన ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినట్లేనని పేర్కొన్నారు. మన దేశంలో సరిగా పనిచేయని ప్రజాప్రతినిధులను 'రీకాల్' చేసే అవకాశం లేదు.. కాబట్టి ప్రజలు తమ హక్కులను పరిరక్షించుకోవడానికి ఏం చేయాలని ప్రశ్నించారు. ప్రజల హక్కులకు భంగం కలగకూడదనే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ వేగంగా నిర్ణయం తీసుకోవాలని పొందుపర్చారని పేర్కొన్నారు. స్పీకర్ గరిష్ఠంగా మూడు నెలల్లో అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోవాలని నిర్దేశిస్తున్న కైశం మేఘాచంద్రసింగ్ ' తీర్పు ప్రామాణికం కాదు అనే వాదనలో పస లేదని తెలిపారు. సుప్రీంకోర్టు ఆర్టికల్ 141 లేదా 142ఏ అధికరణ కింద తీర్పు ఇచ్చినా శిరోధార్యమేనని.. ఫలానా ఆర్టికల్ కింద తీర్పు ఇచ్చారు కాబట్టి వర్తించదు అనే వాదన నిలబడదని పేర్కొన్నారు. ప్రతివాదుల వాదనలు ముగిసిన నేపథ్యంలో అసెంబ్లీ కార్యదర్శి తరఫున అడ్వకేట్ జనరల్ ప్రత్యుత్తరం ఇవ్వడానికి విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

విశాట్-2025 నోటిఫికేషన్ విడుదల

- విజ్ఞాన్ వర్సిటీలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి
- మార్చి 1 నుంచి పరీక్షలు



నోటిఫికేషన్ పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పి నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి విశాట్ 2025 నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షద్వారా విజ్ఞాన్ వర్సిటీలో బీటెక్, ఫార్మశీ, బీబీఏ, బీసీఏ, బీఏ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్), అగ్రికల్చరల్, ఫార్మాడీ తదితర కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తామని వీసీ ఆచార్య పీ. నాగభూషణ్ తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 1 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు తెలుగురాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. విశాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ చివరి తేదీగా నిర్ణయించామని తెలిపారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విజ్ఞాన్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విజ్ఞాన్.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణకిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ గౌరి శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు లేకుండా చేస్తాం

- ఆధునిక పద్ధతులతో గుంతలు పూడ్చుతాం
- ప్రజలపై అప్పుల భారం మోపిన కేసీఆర్ రోడ్లపై గుంతలు పూడ్చలేదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



యంత్రం పూడ్చిన గుంతను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి తదితరులు

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణ ప్రజలపై భారం మోపిన కేసీఆర్ కనీసం రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చలేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. గత సర్కారు చేసిన నిర్లక్ష్యం మూలంగా రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు అధునాతన పద్ధతులు, అవసరమైన యంత్రాలను ఉపయోగిస్తామని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలోని రహదారులపై గుంతలను పూడ్చేందుకు సిద్ధం చేసిన "ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్", "పాట్ హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ మిషనరీ" యంత్రాల పనితీరును మంత్రి పరిశీలించారు. ఈ యంత్రాలతో రోజుకు 10-20 కిలోమీటర్ల మేర గుంతలను పూడ్చే అవకాశం ఉందని టెక్నీషియన్లు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో 9వేల కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడ్చుతామని, భవిష్యత్తులో రహదారులపై గుంతలు లేకుండా చేస్తామని స్పష్టంచేశారు. సంప్రదాయ పద్ధతుల్లో గుంతలను పూడ్చేందుకు అధిక సమయం పడుతుందని, అందుకే యంత్రాలతో తక్కువ సమయంలో రోడ్ల మరమ్మతులు చేసే విధానాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పర్యావరణానికి ఎలాంటి హానిలేకుండా యంత్రాలతో మరమ్మతులు చేయవచ్చన్నారు. యంత్రాలతో తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో ఎక్కువ రోడ్లకు మరమ్మతులు చేయడం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు. కాగా చిలుకూరులో గుంతలను పూడ్చే యంత్రాలను పరిశీలించిన అనంతరం మంత్రి కోమటిరెడ్డి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చానల్‌తో మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రహదారులన్నింటినీ గుంతలమయం చేసిందన్నారు. గుంత చూపిస్తే రూ.వెయ్యి ఇస్తామంటూ గతంలో కేటీఆర్ ప్రకటించారని, కానీ ఇప్పుడు గుంతలు లేని రోడ్డు చూపిస్తే తాను కేటీఆర్‌కు రూ.లక్ష ఇస్తానన్నారు.

ఆస్తులు చెప్పం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. మొదటి, రెండో రోజు ఆశించిన స్థాయిలో సర్వే జరగలేదు. మరోవైపు ఒక్కో ఫారం నింపేందుకు ప్రభుత్వం భావించినదానికంటే ఎక్కువ సమయం పడుతోంది. ప్రశ్నావళిలోని 43 ప్రశ్నలకు ప్రజలు చెప్పిన సమాధానాలను బట్టి.. ప్రభుత్వం రూపొందించిన బుక్‌లెట్ చూసి సంబంధిత కోడ్ నమోదు చేయాలి. ఈ విషయంలో ఎన్యుమరేటర్లు కొంత తికమకపడుతున్నారు. దీంతో రోజుకు 6-7, కొన్నిచోట్ల అంతకంటే తక్కువ ఇళ్లలోనే వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. పల్లెల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుండడం, పట్టణాల్లో ప్రజలు ఎవరి పనుల నిమిత్తం వారు వెళ్లిపోతుండడంతో ఇండ్లలో ఎవరూ ఉండడం లేదని ఎన్యుమరేటర్లు అంటున్నారు. దీంతో సర్వే మందకొడిగా సాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివరాల సేకరణకు ఎప్పుడు వస్తారనే వివరాలను ప్రజలకు తెలియజేయాలని పలువురు సూచిస్తున్నారు. వివిధ జిల్లాల్లో సర్వే తీరుతెన్నులను పరిశీలిస్తే.. జగిత్యాల జిల్లాలో పలుచోట్ల కుటుంబ ఆస్తులు, భూముల వివరాలను చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ పలుచోట్ల ఇదే పరిస్థితి కనిపించింది. ప్రభుత్వ పథకాలు అందవేమో అన్న భయంతో ఆస్తుల వివరాలు ఎందుకని ఎన్యుమరేటర్లను పలువురు ప్రశ్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఇప్పటివరకు 18 వేల ఇండ్లలో సర్వే పూర్తి కాగా.. బ్యాంకు ఖాతా, ఆధార్ నంబరు చెప్పేందుకు జనం విముఖత చూపుతున్నారు. నిర్మల్ జిల్లాలో ఆధార్, రేషన్, ధరణి పాస్ బుక్, బ్యాంకు ఖాతా నంబర్లను ప్రజలు చెప్పకపోవడం కనిపించింది. ఈ జిల్లాలోని దిలావర్పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు సర్వేను బహిష్కరించారు. కరీంనగర్ జిల్లాలోనూ వివరాలు చెప్పేందుకు పలువురు సహకరించడం లేదని ఎన్యుమరేటర్లు అంటున్నారు. పెద్దపల్లి, కామారెడ్డి, రంగారెడ్డి, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కూడా కొన్నిచోట్ల ఇవే పరిస్థితులు ఉన్నాయి. గతంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు కదా.. మళ్లీ ఈ సర్వే ఎందుకంటూ వికారాబాద్ జిల్లాలో పలుచోట్ల ప్రజలు ఎన్యుమరేటర్లను ప్రశ్నించారు. మంచిర్యాల, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ కొంతమంది సర్వేకు సహకరించడం లేదు. ఖమ్మం జిల్లాలో సర్వే సిబ్బందికి సరిపడా స్టేషనరీ అందుబాటులో లేదనే ఫిర్యాదులున్నాయి. ఇన్ని ప్రశ్నలా అని కొందరు ప్రశ్నిస్తున్నారని, కొన్ని అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీల్లో ఇళ్లకు వెళ్లి కాలింగ్ బెల్ కొట్టినా బయటకురావడం లేదని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. హైదరాబాద్ బేగంపేట డివిజన్ మోతీలాల్ నెహ్రూ నగర్‌లో కొంతమంది సర్వేను వ్యతిరేకిస్తున్నారు. వాచ్‌మెన్లతో తమను బయటకు పంపిస్తున్నారని ఆ ఏరియా ఎన్యుమరేటర్ ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కొందరైతే ఇళ్లకు స్టిక్కర్ కూడా వేయనీయలేదన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,333 మంది ఇప్పటి వరకు 17 వేల కుటుంబాలను సర్వే చేశారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం కల్పించకపోవడంతో సర్వే పత్రాలను సంబంధిత మండల, మునిసిపల్ కార్యాలయాలకు చేరుస్తున్నారు.

సర్వే.. రాజకీయం..!

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యాలయానికి ఎన్యుమరేటర్లు వివరాల సేకరణకు వెళ్లగా ఆయన స్పందించిన తీరు ఆశ్చర్యపరిచింది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ చేపట్టిన సమగ్ర సర్వేపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియోను చూపించి, అప్పుడు సర్వేను వ్యతిరేకించిన వ్యక్తి ఇప్పుడెలా చేపట్టారంటూ ఎన్యుమరేటర్లను ప్రశ్నించారు. ఆస్తులు, వాహనాలు, స్థిర, చరాస్తుల వివరాలను ఎలా సేకరిస్తారని నిలదీశారు. మాధవరం ఎన్యుమరేటర్లను ప్రశ్నించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ మరో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా సర్వేపై ఘాటుగా స్పందించారు.

కులగణన వ్యతిరేకులు.. సమాజ వ్యతిరేకులే: ప్రొ. పీఎల్ విశ్వేశ్వర్‌రావు

రాష్ట్రంలో కులగణనను వ్యతిరేకిస్తున్న వారు సమాజ వ్యతిరేకులవుతారని విద్యా కమిషన్ సభ్యుడు ప్రొ. పీఎల్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. కులగణనపై బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆపాలని, దీనిపై ప్రజల్లోకి వెళ్లి చైతన్యం తీసుకొస్తామని చెప్పారు ఈ మేరకు సోమవారం గాంధీ భవన్‌లో ప్రొఫెసర్లు మురళీ మనోహర్, సింహాద్రి, సమ్మయ్యలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ కులగణనపై బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కులగణనకు ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతివ్వాలని మురళీమనోహర్ అన్నారు. కులగణనకు సహకరించాలంటూ ప్రజల్ని కోరేందుకు నియోజకవర్గాల వారీగా పర్యటనకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రొ. సమ్మయ్య తెలిపారు.



కామారెడ్డి జిల్లా పెద్ద దేవిసింగ్ తండావాసులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

కులాల జాబితాలో మా కులమేది?

- కులం పేరు తప్పుగా ఉందని సర్వే బహిష్కరణ
- కామారెడ్డి జిల్లాలో 2 వేల మథుర లంబాడా కుటుంబాల నిర్ణయం

పెద్దకొడప్‌గల్, ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో కులాల జాబితాలో తమ కులం పేరు లేదంటూ కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలో 2 వేల మథుర లంబాడా కుటుంబాలు సర్వేను బహిష్కరించాయి. విషయం తెలుసుకుని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం మండలంలోని పెద్ద దేవిసింగ్‌తండాకు వెళ్లి తండావాసులతో చర్చించి సర్వేకు సహకరించాలని చెప్పారు. అయినా వారు అందుకు ఒప్పుకోలేదు. జాబితాలో 240 కులాల పేర్లలో తమ కులం పేరు మధుర అని ఉందని, అది సరికాదని కిరణ్మయికి విన్నవించారు. తమ కులం పేరు మథుర లంబాడా, కాయితా లంబాడా, లబానా లంబాడాగా ఉండాలని, ఇలా లేనికారణంగా సర్వేలో పాల్గొనబోమని తేల్చి చెప్పారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సబ్ కలెక్టర్ చెప్పినా వారు సర్వేకు ఒప్పుకోలేదు. దాంతో మండలంలోని టికారాం, కుబ్యానాయక్, పోచారం, చావునితాండా, రాములు నాయక్, జగన్నాథపల్లి, అంజనీ, కొడప్‌గల్,మన్సూర్‌రాం, సముందర్‌తాండ,ధర్మపురి తాండాల పరిధిలో సర్వే నిలిచిపోయింది. మరోవైపు సోమవారం ఖమ్మం నగరంలో సమగ్ర సర్వే స్టిక్కర్‌ను ఇంటికి బదులు ఓ కారుకు అంటించడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 1,68,875 నివాసాలకు స్టిక్కరింగ్ కార్యక్రమం సోమవారం పూర్తయింది. 58వ డివిజన్‌లో ఎం రాధాకృష్ణ అనే వ్యక్తి ఇంటి మొదటి అంతస్థులో ఉంటున్నారు. అయితే సర్వే సిబ్బంది తన నివాసానికి కాకుండా పార్కింగ్ లోని తన కారుకు సర్వే స్టిక్కర్ అంటించి వెళ్లారని రాధాకృష్ణ ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఘటనపై స్పందించిన ఖమ్మం కేఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ.. ఘటనపై విచారణ జరిపి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రామ్‌గోపాల్ వర్మపై కేసులు

సోషల్‌మీడియాలో అసభ్య పోస్టులకు ప్రతిఫలం



ఒంగోలు క్రైం, తుళ్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు, గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. వర్మ రూపొందించిన 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్, నారా బ్రాహ్మణి, పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ ఫొటోలు తమ నాయకుల వ్యక్తిత్వాలను కించపరిచే విధంగా ఉన్నాయని పేర్కొంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామలింగం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రామ్‌గోపాల్‌వర్మపై ఐటీ యాక్టు కింది కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. కాగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టిన రాంగోపాల్ వర్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు సోమవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన పోస్టులతో ప్రజా ప్రతినిధులను అగౌరవ పరచడమే కాకుండా మానసిక క్షోభకు గురిచేసిన వర్మపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో తుళ్లూరు పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.

మళ్లీ ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

కొంచెం ఉపశమనం కలిగించింది. ఆయనను బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోస్టు నుంచి ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్‌ను బదిలీ చేసి.. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా నియమించింది. దేవాదాయ శాఖ కమిషనర్ జెండగె హనుమంతును ఆ పోస్టు నుంచి రిలీవ్ చేసింది. దేవాదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం దేవాదాయ కమిషనర్‌గా చేసే అధికారి వయసు 45 ఏళ్లు ఉండాలి. కానీ... హనుమంతుకు అంతకంటే తక్కువ వయసు ఉండడంతో ఆయనను బదిలీ చేసింది. ప్రస్తుతం ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. రవాణా శాఖ కమిషనర్ ఇళంబర్తిని కీలకమైన జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమించింది. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ కేడర్‌కు వచ్చిన ఐఏఎస్ అధికారులు శివశంకర్ లోతేటికి ఆరోగ్యశ్రీ సీఈవోగా, సృజనకు పంచాయతీ రాజ్ డైరెక్టర్‌గా, చేవూరి హరికిరణ్‌కు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పోస్టింగులు ఇచ్చింది.

ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు

పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయంలో ఐటి, వర్కింగ్ ప్లాన్ విభాగంలో చీఫ్ కన్జర్వేటర్‌గా ఉన్న ప్రియాంక వర్గీస్‌ను చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్‌లో డిప్యూటీ కన్జర్వేటర్‌గా ఉన్న శివాల రాంబాబును మహబూబ్‌నగర్ జోగులాంబ సర్కిల్ జిల్లా అటవీశాఖ అధికారిగా, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. నెహ్రూ జూపార్క్ క్యూరేటర్‌గా ఉన్న డాక్టర్ సునీల్ ఎస్ హీరేమత్‌ను జూపార్క్‌ల డైరెక్టర్‌గా, ఆయన స్థానంలో భూపాలపల్లి జిల్లా అటవీ శాఖాధికారి జె.వసంతను నియమించారు. సిద్దిపేట, భూపాలపల్లి జిల్లాల అటవీశాధికారులుగా పి.శ్రీనివాసరావు, మందాడి నవీన్ రెడ్డిని నియమించారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
స్మితా సభర్వాల్	ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి	యువజన సర్వీసులు, పర్యాటక శాఖ కార్యదర్శి. ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి, పురావస్తు శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
ఈ.శ్రీధర్	ఎక్సైజ్ శాఖ కమిషనర్	బీసీ సంక్షేమ కార్యదర్శి, దేవాదాయ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
అనితా రామచంద్రన్	పంచాయతీరాజ్ కమిషనర్	మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి
ఇళంబర్తి	రవాణా శాఖ కమిషనర్	జీహెచ్ఎంసీ కమిషనర్
కె.సురేంద్రమోహన్	గనుల శాఖ కార్యదర్శి	రవాణా శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
చేవూరు హరికిరణ్	వెయిటింగ్	ఎక్సైజ్ శాఖ డైరెక్టర్
డి.కృష్ణభాస్కర్	ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి	ట్రాన్స్‌కో సీఎండీ, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగింపు
శివశంకర్ లోతేటి	వెయిటింగ్	ఆరోగ్యశ్రీ సీఈవో
సృజన	వెయిటింగ్	పంచాయతీరాజ్ డైరెక్టర్
చిట్టెం లక్ష్మి	వెయిటింగ్	ఆయుష్ డైరెక్టర్
కృష్ణ ఆదిత్య	కార్మిక శాఖ సంచాలకులు	ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్, ఇంటర్ బోర్డు కార్యదర్శి, విద్య-సంక్షేమ- మౌలిక సదుపాయాల సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు
సంజయ్‌కుమార్	కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి	కార్మిక శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
గౌరవ్ ఉప్పల్	ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్	సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి (కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల కో-ఆర్డినేషన్)గా అదనపు బాధ్యతలు

సజ్జల భార్గవ్, అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో

బూతు, నీచ పోస్టులు

మొదటి పేజీ తరువాయి

సతీమణి భారతీరెడ్డి పీఏ వర్రా రవీంద్రారెడ్డితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశామని ప్రకటించారు. ఈ ముగ్గురినీ సోమవారం కడపలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి డీఐజీ కోయ ప్రవీణ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. సోషల్ మీడియాలో వైసీపీ వికృత చేష్టలన్నీ... సజ్జల భార్గవ్ రెడ్డితోపాటు అర్జున్‌రెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి నుంచి నడిచాయని డీఐజీ తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, హోం మంత్రి, ఇతర మహిళా నేతలపై సోషల్ మీడియాలో వీళ్లు వాడిన భాష నీచం, ఘోరం! గల్ఫ్ దేశాలలో అయితే ఊరిమధ్యలో పెట్టి రాళ్లతో కొట్టే శిక్ష విధించే వారు. వర్రా రవీంద్రరెడ్డి భారతీ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండే వాడు. 2012లో ఉద్యోగం మానేశాడు. అప్పటి ప్రభుత్వం చిన్న వాసుదేవరెడ్డిని డిజిటల్ కార్పొరేషన్ అధిపతిగా నియమించింది. వైసీపీ సోషల్ మీడియాలో ఆయన కీలక పాత్ర పోషించారు. వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా వివేకానంద రెడ్డి, కో కన్వీనర్‌గా వర్రా రవీంద్రా రెడ్డి ఉండేవారు. సజ్జల భార్గవ్‌రెడ్డి చేతుల్లోకి వైసీపీ సోషల్ మీడియా వెళ్లాక వీరందరి బూతుపురాణం ప్రారంభమైంది. 'జగనన్న కనెక్ట్' పేరుతో వైసీపీ సోషల్ మీడియా విభాగం నడిచింది. దానికి 2022 నుంచి సజ్జల భార్గవ రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. భార్గవ్ రెడ్డితోపాటు మరికొందరి ఆదేశాల మేరకు ఇతరులు పని చేస్తారు. మూడు రాజధానుల విషయంలో జడ్జిలపై కూడా పోస్టులు పెట్టారు. సోషల్ మీడియాలో వీరి వికృత చేష్టలు చెప్పలేం. ఇవన్నీ సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి నుంచి నడిచాయి. ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌తోపాటు మరో కార్పొరేషన్ ద్వారా ఉద్యోగులను నియమించుకుని... వారిని వైసీపీ సోషల్ మీడియా కోసం వాడుకున్నారు. వీరిలో ఐడ్రీమ్ నుంచి 60 మంది, అవినాశ్ రెడ్డి పీఏ బండి రాఘవ రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి ద్వారా 65 మంది ఉన్నారు. వీరికి అప్పటి ప్రభుత్వం నుంచి నిధులు మళ్లించి డబ్బులు ఇచ్చే వారు. వీరికి 40 యూట్యూబ్ చానళ్లు ఉన్నాయి. 400కుపైగా సోషల్ అకౌంట్ హ్యాండిల్స్‌ను నిర్వహిస్తున్నారు. తాడేపల్లిలోని పీవీఎస్ ఐకాన్ బిల్డింగ్ మూడో ఫ్లోరులోని వైసీపీ సోషల్ మీడియా కార్యాలయం నుంచి మొత్తం కార్యకలాపాలు జరిపారు. ఈ ముఠాలో 45 మందిని గుర్తించాం. పంచ్ ప్రభాకర్, జగనన్న సైన్యం (వెంకటేశ్ బాడి), ఇడ్లీ సాంబార్ (హరికృష్ణా రెడ్డి), రెడ్డిగారి అమ్మాయి వంటి ఖాతాలతోపాటు... బేతంపూడి నాని, కేసరి రాజశేఖర్ రెడ్డి, ఇందుకూరి శ్రీనివాసరాజు, రామాల మన్విత్ కృష్ణా రెడ్డి, మలకా అమరనాథ్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, ఇంటూరి రవి కిరణ్, షేక్ జాను, జగదీశ్వర్ రెడ్డి ఆళ్ల, శ్రీనివాసరెడ్డి, జింకల రామాంజనేయులు, ఎన్.బాలాజీ రెడ్డి, భార్గవ రెడ్డి, మునగాల హరీశ్వర్ రెడ్డి... తదితరులు సోషల్ మీడియాలో జుగుప్సాకరమైన సందేశాలు పోస్టు చేసినట్లు విచారణలో గుర్తించాం. కొందరి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు తీసుకుని వారి పేరుతో వైసీపీ సోషల్ మీడియా కార్యాలయంలోనే కొన్ని పోస్టులు పెట్టేవారు.

అవినాశ్ రెడ్డి 'డిక్టేషన్'తో...

ఎంపీ అవినాశ్ రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి వాట్సాప్ ద్వారా పంపిన 'కంటెంట్'ను సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు వర్రా రవీంద్రా రెడ్డి తన వాంగ్మూలంలో అంగీకరించాడు. అవినాశ్ రెడ్డి చెప్పింది రాసుకుని దానినే రాఘవరెడ్డి తనకు పంపించేవాడని వర్రా చెప్పాడు. షర్మిల, వైఎస్ సునీత, వైఎస్ విజయలక్ష్మిపై పెట్టిన పోస్టులు అవేనని తెలిపాడు. మంద కృష్ణ తల్లిపై అసభ్యకరంగా వారు పోస్టులు పెట్టారు. దీనికి సంబంధించి బండి రాఘవరెడ్డిపై కూడా కేసు నమోదు చేశాం. షర్మిల, సునీతల పోస్టులకు సంబంధించిన కేసులు తెలంగాణలో ఉన్నాయి. అవి ఇక్కడికి బదిలీ అయితే రాఘవరెడ్డిపై చర్యలు తీసుకుంటాం. సుమోటో కింద కేసు నమోదు చేయలేం. వర్రాపై రాష్ట్ర వ్యాప్తంగా 40 కేసులు ఉన్నాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లోనే 10 కేసులు ఉన్నాయి. వర్రాను మరింత లోతుగా విచారించేందుకు కస్టడీకి కోరుతాం.



అరెస్టయిన వర్రా రవీంద్రరెడ్డి, గుర్రంపాటి వెంకటసుబ్బారెడ్డి,గురజాల ఉదయ్‌కుమార్ రెడ్డి

అరెస్టు ఇలా...

కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి నాలుగురోజుల క్రితం వర్రాకు 41ఏ నోటీసు ఇచ్చాము. రాజంపేటకు సంబంధించిన కేసులో వర్రాను కస్టడీలోకి తీసుకోలేక పోవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఆదివారం మార్కాపురం వద్ద వర్రా రవీంద్రరెడ్డితో పాటు అతడికి సహకరించిన కమలాపురం మండలం నల్లింగాయపల్లికి చెందిన గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లికి చెందిన గురజాల ఉదయ్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కారును స్వాధీనం చేసుకున్నాం!

తెలంగాణ నిన్ను మర్చిపోయింది



అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

పత్రాలు ఇచ్చేందుకు ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, కలెక్టర్ అనుదీప్, జాయింట్ కమిషనర్ రమేశ్ చిదురతో కలిసి పది మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా.. ఈ పది నెలల్లో తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. టీచర్లకు పదోన్నతులు ఇచ్చామని, బదిలీలు చేశామని చెప్పారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించామని, త్వరలో 563 మంది అధికారులను తెలంగాణకు అందిస్తామని తెలిపారు. "బడి దొంగలను విన్నాం. కానీ.. అసెంబ్లీకి రానోళ్లను ఎప్పుడైనా చూశామా? శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయంటే ప్రతిపక్షం పోటీ పడి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీయాలి. అడగాలి. కడగాలి. ఆయన రానే రాడు. ఉల్టా అయిపోయింది. రమ్మని మేం అడుక్కోవాల్సి వస్తోంది. తెలంగాణలో విచిత్ర పరిస్థితి ఉంది" అని విమర్శించారు.

సారా బుడ్లతో దీపావళా..?

దీపావళికి చిచ్చు బుడ్లతో పండుగ చేసుకుంటామని, కానీ, కొంతమంది సారా బుడ్లతో దావత్ చేసుకున్నామని అంటున్నారని, ఆ దావత్‌లో డ్రగ్స్ తీసుకున్నోళ్లు దొరికితే వాళ్లను ఎలా పట్టుకుంటారని అడుగుతున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇలాంటి వాళ్లు సమాజానికి చీడపురుగులని, వారిని సామాజిక బహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. ఫామ్ హౌస్‌ల్లో డ్రగ్స్ తీసుకునే వాళ్లు మనకు ఆదర్శం కాదని స్పష్టం చేశారు. "మన పిల్లలు చెడిపోతే మనం ఎంత గొప్పవాళ్లమైనా.. ఎంత సంపాదించినా.. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వృథానే. మనం ఎంత సాధించినా నిష్ప్రయోజనమే. వ్యసనాలకు బానిసలైన పిల్లల వల్ల కుటుంబాలు కుప్పకూలుతయి. పిల్లలను నియంత్రించేలా మనం సామాజిక బాధ్యతగా సహకరించాలి. పక్క రాష్ట్రాలు, దేశాల నుంచి రోడ్డు మార్గంలో డ్రగ్స్ వస్తున్నాయి. రవాణా, పోలీస్ విభాగాలు కఠినంగా ఉండాలి. గంజాయి వాసన వచ్చిందంటే కూకటివేళ్లతో పెకిలించాలి. తెలంగాణ సరిహద్దులో ఎవడైనా డ్రగ్స్‌తో కాలు పెట్టాలంటే వారి వెన్నులో చలి జ్వరం రావాలి" అని దిశానిర్దేశం చేశారు. గంజాయి వ్యసనానికి బానిసలై ఇప్పుడు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, వైద్య విద్య చదివే పిల్లలు వాటిని అమ్మే దుస్థితికి దిగజారారని, ఈ పరిస్థితి మారాలని ఆకాంక్షించారు.

నెలకొక్కసారైనా స్వగ్రామాలకు వెళ్లండి

ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశమున్నా.. పరీక్షలు నిర్వహించకుండా నాటి పాలకులు బాధ్యతారహితంగా వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కోర్టులు, వివాదాల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి న్యాయ నిపుణులను సంప్రదించి.. న్యాయస్థానాల్లో బలంగా వాదనలు వినిపించి, చిక్కుముళ్లు విప్పి.. పది నెలల్లో 50 వేల మందికి నియామక పత్రాలు అందించడం గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆనాడు నిరుద్యోగులకు మాట ఇచ్చానని, మిమ్మల్ని నమ్మించి మోసం చేసిన వారి ఉద్యోగాలు ఊడగొడితే మీకు ఉద్యోగాలు వస్తాయని చెప్పానని, ఇప్పుడు అదే జరిగిందని, మీకు ఉద్యోగాలు వస్తున్నాయని స్పష్టం చేశారు. "గ్రామంలో ఎవరికైనా ఉద్యోగం వస్తే వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా వాళ్లు చదువుతారు. మిమ్మల్ని చూసినప్పుడు ఇతర పిల్లల తల్లిదండ్రులకూ విశ్వాసం వస్తుంది. కుటుంబంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఆ కుటుంబ జీవన ప్రమాణాలు మారతాయి. సామాజిక బాధ్యతగా భావించి నెలకు ఒక్కసారైనా స్వగ్రామాలకు వెళ్లండి. ప్రభుత్వ, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులతో మాట్లాడండి. వాళ్లకు ప్రభుత్వం పట్ల విశ్వాసం కల్పించండి. చదువు సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని ఇస్తుందనే అవగాహన కల్పించండి" అని సూచించారు. ఉద్యోగం బాధ్యత కాదని, భావోద్వేగమని అన్నారు. పది కాలాలపాటు పేదల కష్టాలు తీర్చేందుకు సామాజిక బాధ్యతగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి నగరంలో కాలుష్యాన్ని తగ్గించనున్నామని, ఇక్కడి డీజిల్ బస్సులను గ్రామీణ ప్రాంతాలకు పంపుతామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక పాలసీ తీసుకువస్తామని, ఇందుకు రవాణా శాఖ సహకరించాలని కోరారు. రెండో విడత అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులకు రెండో విడత ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. కొత్తగా నియమితులైన ఉద్యోగుల సేవలను చెక్ పోస్టుల్లో కాకుండా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో వినియోగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తెలంగాణలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో రోజూ సగటున 20 మంది మృతి చెందుతున్నారని, సురక్షిత ప్రయాణాలకు రవాణా శాఖ నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని చెప్పారు.

రైతులను ఇబ్బంది పెడితే ఎస్మా

» కొనుగోళ్లలో మోసాలకు పాల్పడినా, వేధించినా కఠినంగా వ్యవహరించండి

» అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిపై 'ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్టు (ఎస్మా)'ను ప్రయోగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో అక్కడక్కడ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు తన దృష్టికి రావడంతో సోమవారం ఆయన అధికారులతో మాట్లాడారు. రైతులు పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడినా, రైతులను గందరగోళానికి గురి చేసినా, వేధించినా కఠినంగా వ్యవహరించాలని నిర్దేశించారు. ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు.

డ్రగ్స్ నిర్మూలనకు దైవ ఆశీర్వాదమే కావాలి

సీఎంగా తీవ్రంగా శ్రమిస్తున్నా కావట్లేదు

చెడు వ్యసనాలపై అవగాహన కల్పించాలి

మత వివక్ష, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు: సీఎం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు చదువుకున్న యువత, డాక్టర్లు, ఇంజినీర్లు సైతం డ్రగ్స్ గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, ఈ వ్యసనాలను ప్రోత్సహించే వారిని శిక్షించాలని ముఖ్యమంత్రిగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నానని, అయినా సరిపోవడం లేదని, వీటి నిర్మూలనకు ఇక దైవ ఆశీర్వాదమే కావాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రముఖ క్రైస్తవ మత బోధకుడు, కల్వరి టెంపుల్ వ్యవస్థాపకుడు సతీశ్ కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం ఎల్బీ స్టేడియంలో జరిగాయి. వీటికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వంటి వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రతి ఆదివారం టెంపుల్‌లో ప్రచారం చేయాలని, సామాజిక బాధ్యతగా సందేశాల్లో దీనిని ప్రస్తావించాలని కోరారు. అన్నం పెట్టారనో, దుప్పట్లు ఇచ్చారనో తరతరాలుగా ఆచరిస్తున్న మతాన్ని వదిలి ఇతర మతాల్లోకి మారేంత బలహీనులు మన భారతీయులు కాదని చెప్పారు. విశ్వాసాన్ని ఆచరించడం, మతాన్ని స్వీకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని కాపాడే బాధ్యతను పాలకులుగా తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎవరూ మత వివక్షకు గురికాకుండా, మత వివక్ష దాడులు జరగకుండా కట్టడి చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని, అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు జరుగుతున్నా.. దాడులకు పాల్పడే వారిని శిక్షించే బాధ్యతను తీసుకుంటున్నామని చెప్పారు.

నేడు ఢిల్లీకి సీఎం

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో జరిగే 'అడ్డా' కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం పది గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలు దేరి ఢిల్లీకి వెళుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. అక్కడ సాయంత్రం 6.30 గంటలకు జరిగే అడ్డా కార్యక్రమానికి హాజరవుతారు. అలాగే ఈ టూర్‌లో అందుబాటులో ఉన్న కాంగ్రెస్ పెద్దలను సీఎం రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల వ్యూహానికి సంబంధించిన చర్చల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. కాగా.. అడ్డా కార్యక్రమం ముగిసిన తర్వాత ఢిల్లీలోనే బస చేయనున్న రేవంత్‌రెడ్డి.. బుధవారం ముంబయికి బయలుదేరి వెళతారు. అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. కాగా, వచ్చే వారం మరోమారు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి సీఎం వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ వేడుకలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

హిందూ ముస్లింలు 2 కళ్లు

» జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లిములు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీరంతా అండగా ఉంటే.. విద్య, వైద్యం, ఉపాధి విషయాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళతానని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మైనారిటీలు కీలక పాత్ర పోషించారని చెప్పారు. జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకలను సోమవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెబ్‌సైట్, ఆన్ లైన్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ప్రారంభించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. "దేశంలో ఉన్నవి రెండే పరివార్‌లు. ఒకటి మోదీ పరివార్.. రెండోది గాంధీ పరివార్. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోదీ పరివార్ పని చేస్తోంది. దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి చేస్తోంది" అని వివరించారు. ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రాంతీయ పార్టీలకు ఓట్లు వేస్తే... కేంద్రంలో మోదీకి మద్దతు ఇస్తాయని చెప్పారు. మోదీ పరివార్‌తో ఉండాలో గాంధీ పరివార్‌తో ఉండాలో నిర్ణయించుకోవాలని మైనారిటీలకు సూచించారు. ముస్లిములు అప్పుడప్పుడు కాంగ్రెస్ పార్టీపై అలుగుతారని, వారిని తాము ఓటర్లుగా చూడటం లేదని, సోదరులుగా, కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మైనారిటీని కూడా ఎమ్మెల్యేగా గెలిపించుకోలేదని, అందుకే మైనారిటీ మంత్రి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. అయినా, షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా చేశామని, నాలుగు ఎమ్మెల్సీల్లో ఒకటి అమీర్ అలీ ఖాన్‌కు ఇచ్చామని గుర్తు చేశారు. ఎనిమిది కార్పొరేషన్లలో మైనారిటీలకు అవకాశాలు ఇచ్చామని, వైఎస్ తర్వాత మళ్లీ ఇప్పుడు సీఎంవోలో మైనారిటీ అధికారిని నియమించామని తెలిపారు.

కాళేశ్వరం కమిషన్ గడువు మరో 2 నెలలు పెంపు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మరో 2 నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పొడిగింపు ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. మంగళవారం నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేసే అవకాశముంది. వాస్తవానికి ఈనెల 12 నుంచి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది. అయితే పొడిగింపు జీవో వెలువడకపోవడంతో కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ షెడ్యూల్ విడుదల చేయలేదు. ఇప్పటికే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, మాజీ ఈఎన్‌సీలతో పాటు చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన కమిషన్.. ఇక నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా, ఇతర హోదాల్లో పనిచేసిన ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌లను విచారించి బ్యారేజీల నిర్మాణంలో కీలక నిర్ణయాలు ఎవరు తీసుకున్నారన్న అంశంపై సాక్ష్యాలను సేకరించేందుకు సన్నద్ధమైంది. ఇద్దరు కీలక మాజీ ప్రతినిధులకు ఈ దఫా కమిషన్ కబురు పంపే అవకాశముంది. ఏదేమైనా డిసెంబరులో విచారణ ప్రక్రియలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని తెలుస్తోంది.

మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌తో ఏసీ బస్సుల్లో 10% రాయితీ

హైదరాబాద్ సిటీ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్ వినియోగదారులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త తెలిపింది. ఈ బస్‌పాస్‌తో లహరి, రాజధాని, గరుడ ప్లస్, ఈ-గరుడ ఏసీ సర్వీసుల్లో ప్రయాణించే వారికి టికెట్‌లో 10 శాతం రాయితీని ప్రకటించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అన్ని టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో 10% డిస్కౌంట్ వర్తిస్తోందని సంస్థ ఎండీ వీసీ.సజ్జనార్ తెలిపారు. మెట్రో ఎక్స్‌ప్రెస్‌తో పాటు మెట్రో డీలక్స్, గ్రీన్ మెట్రో, ఎయిర్ పోర్ట్ పుష్పక్ బస్‌పాస్ వినియోగదారులు కూడా ఈ రాయితీని పొందవచ్చన్నారు. 2025 జనవరి 31 వరకు ఏసీ బస్సుల్లో ఈ 10 శాతం రాయితీ అమల్లో ఉంటుందని తెలిపారు.

ధాన్యం ధర తగ్గిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

చేసుకోవచ్చు. అయితే సన్నాలకు బోనస్‌తో కలిపి రూ. 2,800, దొడ్డు రకాలకు రూ. 2,300 ఎమ్మెస్పీ కంటే తక్కువ ధర ఎవరైనా చెల్లిస్తే మాత్రం ఉపేక్షించేది లేదు. రైస్‌మిల్లర్లయినా, వ్యాపారులైనా.. రైతులకు నష్టం కలిగిస్తే రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది." అని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు, కొత్త ధాన్యం సేకరణ పాలసీని తీసుకొచ్చిన నేపథ్యంలో.. 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఉత్తమ్.. సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు. గతంలో మంచి పంట వచ్చినపుడు బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల వచ్చిందని అసత్య ప్రచారం చేసిందని, ఈ ఖరీఫ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క కూడా నీరు విడుదల చేయకుండానే... 66.7 లక్షల ఎకరాల్లో వరి సాగుచేసి... 155 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 45 లక్షల మంది రైతులు ఈ ఘనత సాధించారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇంటర్వ్యూ విశేషాలు...

ధాన్యం సేకరణకు కొత్త పాలసీ తయారుచేసినా రైతులు... మిల్లర్లు, ప్రైవేటు ట్రేడర్ల వైపు మొగ్గుచూపటానికి కారణం ఏమిటి?

ధాన్యం సేకరణ పాలసీ- 2024 లో ప్రధానంగా రెండు నిబంధనలు పెట్టాం. బయటి రాష్ట్రాల నుంచి ఎట్టి పరిస్థితుల్లో మన రాష్ట్రానికి ధాన్యం రానిచ్చేదిలేదు. సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటుచేసి కట్టుదిట్టం చేశాం. రాష్ట్రంలో ఉత్పత్తిచేసిన ధాన్యాన్ని మాత్రం రైతులు తమ కిష్టమైన చోట అమ్ముకునే వెసులుబాటు కల్పించాం. ఇక్కడ అమ్మినా, ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేసుకున్నా అభ్యంతరంలేదు. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఎఫ్‌సీఐ నుంచి తెలంగాణ రైస్ కావాలని కోరుకుంటున్నారు. ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, మలేషియా దేశాల నుంచి కూడా తెలంగాణ బియ్యం కావాలనే ప్రతిపాదనలొచ్చాయి. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి అవుతుండటంతో డిమాండ్ పెరిగింది.

సంక్రాంతి నుంచి సన్నబియ్యం పంపిణీచేస్తామని హామీ ఇచ్చారు. సన్నాలు కొనుగోలు కేంద్రాలకు రాకపోతే ఏంచేస్తారు?

దేశంలో ఎక్కడ లేనివిధంగా సన్నాలకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం. కార్పొరేషన్ నుంచి ఎమ్మెస్పీ, ఆర్థికశాఖ నుంచి బోనస్ చెల్లించేలా ఏర్పాట్లుచేశాం. గతంలో రైతుల ఖాతాల్లో డబ్బులు వేయటానికి నెలల తరబడి సమయం పట్టేది. ఇప్పుడు మూడు, నాలుగు రోజుల్లో ఖాతాల్లో జమచేసేలా ఏర్పాట్లుచేశాం. రాష్ట్రంలో 80- 85 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం ఉత్పత్తి అవుతోంది. ఇందులో పీడీఎస్‌కు 36 లక్షల టన్నులు సరిపోతుంది. ఈమేరకు ధాన్యం సెంటర్లకు వస్తుందన్న నమ్మకం ఉంది. దీనిని మిల్లింగ్‌చేస్తే 24 లక్షల టన్నుల సన్నబియ్యం వస్తాయి. నెలకు 2 లక్షల టన్నుల సన్నబియ్యం పేదలకు పంపిణీచేస్తాం. జనవరి నుంచి రాష్ట్రంలో సన్నబియ్యం పథకం ప్రారంభం అవుతుంది.

రైస్‌మిల్లర్లు కొన్నిచోట్ల ధాన్యం దించుకోకుండా సహాయ నిరాకరణ చేస్తున్నారు. మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రైస్‌మిల్లర్ల విషయంలో గత ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది. మిల్లర్లకు ఏ బ్యాంకు గ్యారెంటీ సెక్యూరిటీ లేకుండా వేల కోట్ల ధాన్యం అప్పగించింది. మిల్లర్లు, గత ప్రభుత్వంలో పాలకులు విలాఖత్ అయిపోయి అడ్డగోలుగా ధాన్యం అమ్ముకున్నారు. వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసరఫరాలశాఖను పూర్తిగా ప్రక్షాళనచేశాం. బ్యాంకు గ్యారెంటీ నిబంధన తీసుకొచ్చాం. రైస్‌మిల్లర్లను మూడు కేటగిరీలుగా విభజించి.. 10 శాతం, 20 శాతం, 25 శాతం గ్యారెంటీ ఇవ్వాలని సూచించాం. పాత బకాయిలున్న వారికి సీఎంఆర్ ఇవ్వటంలేదు. ఒకవేళ ఇప్పటికిప్పుడు పాత బకాయిలు తీర్చినవారికి కూడా ధాన్యం ఇస్తాం. తక్కువ సమయంలో బ్యాంకు గ్యారెంటీ ఇవ్వలేని మిల్లర్లకు... వంద రూపాయల బాండ్ పేపర్‌పై అండర్ టేకింగ్ తీసుకొని ధాన్యం కేటాయింపులు చేస్తున్నాం.

మిల్లులకు కాకుండా మధ్యంతర గోదాములకు ధాన్యం తరలిస్తే... రవాణా, నిల్వతో ఆర్థికభారం రెట్టింపు అవుతుంది కదా?

రైస్‌మిల్లర్లు ధాన్యం దించుకోకుండా సహాయ నిరాకరణ చేసేచోట... ప్రభుత్వం కొనుగోలుచేసిన ధాన్యాన్ని మధ్యంతర గోదాములకు తరలిస్తున్నాం. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, మార్కెట్ కమిటీల్లో ఉన్న 30 లక్షల టన్నుల స్థలాన్ని తీసుకున్నాం. రవాణా, నిల్వ ఖర్చులు రెట్టింపయినా ప్రభుత్వం భరిస్తుంది. ఈమేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. రైస్‌మిల్లర్ల వైఖరితో రైతులకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకునేదిలేదు. రైతులకోసం ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఎదుర్కొంటాం. జిల్లా కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇచ్చాం. ఒకవేళ క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఏవైనా నిధులు ఖర్చుచేసినా... ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ చేస్తామని చెప్పాం. తెలంగాణ చరిత్రలో, ఉమ్మడి ఏపీ చరిత్రలో ఇంత రికార్డు స్థాయిలో 155 లక్షల టన్నుల ధాన్యం ఇదివరకు జరగలేదు. మిల్లర్లు ధాన్యం దించుకోని చోట... కర్ణాటక, తమిళనాడు నుంచి ఎవరైనా రైస్‌మిల్లర్లు వచ్చి సీఎంఆర్ కోసం ధాన్యం తీసుకెళ్తామంటే కూడా ఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

17 శాతం తేమ నిబంధన అమలుపై కేంద్ర మంత్రులే ఆరోపణలు చేస్తున్నారు? నిబంధనలు సడలించే అవకాశం ఉందా?

17 శాతం గానీ అంతకంటే తక్కువ తేమశాతం ఉన్న వడ్లకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు ఉన్నాయి. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిబంధనల ప్రకారమే ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లలో ధాన్యం సేకరణ చేస్తున్నాం. ఈవిషయంపై బీజేపీ నేతలకు అవగాహనలేకపోవటంతో అసత్యాలు మాట్లాడుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఇతర నేతలకు సత్తా ఉంటే.. 17 శాతం ఉన్న నిబంధనను సడలింపుచేసి... 25- 30 శాతానికి కొనాలని నిబంధనలు మార్పిస్తే... కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేం ధాన్యం కొనుగోళ్లు చేస్తాం.

టెండర్లలో అమ్మిన ధాన్యం రికవరీ కాలేదు. మిల్లర్ల వద్ద వేల కోట్ల బకాయిలున్నాయి? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వేలం పాటలో అమ్మిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లర్ల నుంచి రికవరీ చేయటానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బాధ్యతలు అప్ప గించాం. ఈప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. మొత్తం ధాన్యాన్ని రికవరీ చేస్తాం. కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని డిసెంబరు 31 నాటికి గడువు ఇచ్చాం. ఆలోపు ఏజెన్సీలకు ధాన్యం అప్పగించకపోతే... గత ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం 25 శాతం జరిమానా వేస్తాం.

ధాన్యం కొనుగోళ్లకు టోకెన్లు

రైతుల ఆందోళనల నేపథ్యంలో నిర్ణయం

మిర్యాలగూడ రైస్‌మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమీక్ష

నల్లగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో సన్న ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం తలెత్తకుండా చూసేందుకు ఈ నెల 14 నుంచి రైతులకు టోకెన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం మిర్యాలగూడలో రైస్‌మిల్లర్లు, అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మిర్యాలగూడలోని మిల్లు పాయింట్ల వద్ద ధాన్యం కొనుగోలు ఆలస్యమవుతుండడం, సన్నధాన్యానికి మద్దతు ధర కల్పించకపోవడంతో ఆదివారం రైతులు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సీరియస్‌గా తీసుకున్నారు. మిల్లుల వద్ద కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను ఆదేశించారు. దీంతో ఈ అధికారులిద్దరూ సోమవారం మిర్యాలగూడ ప్రాంతంలోని శెట్టిపాలెం, బాదలాపురం వద్ద మిల్లులను తనిఖీ చేశారు. మిల్లు పాయింట్ల వద్ద ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించని విషయాన్ని గుర్తించి.. మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు కూడా పెట్టాల్సివస్తుందన్నారు. అనంతరం మిర్యాలగూడలో మిల్లర్లు, రైతుల ప్రతినిధులు, మార్కెటింగ్, సివిల్ సప్లయిస్, వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి.. సన్నధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మిర్యాలగూడ పరిసరాల్లోని 84 మిల్లుల సామర్థ్యం రోజుకు 3వేల ట్రాక్టర్ల వరకే ఉంటుందని, అంతకుమించి ధాన్యం రావడం వల్లనే గందరగోళం తలెత్తుతోందని మిల్లర్లు తెలిపారు. ధాన్యం రాకను క్రమబద్ధీకరిస్తే కొనుగోళ్లు సజావుగా సాగుతాయని వారు చెప్పడంతో టోకెన్ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. వరి కోతలు అయిన వెంటనే వ్యవసాయాధికారులు రైతులకు టోకెన్లు ఇస్తే.. సీరియల్ ప్రకారం ఏ రోజు, ఏ సమయానికి, ఏ మిల్లుకు ధాన్యం తీసుకురావాలో సూచిస్తారని, ఆ మేరకు ధాన్యం విక్రయించుకోవచ్చని అన్నారు. కాగా, నల్లగొండ జిల్లా నుంచే కాకుండా సూర్యాపేట జిల్లా నుంచి కూడా మిర్యాలగూడ ప్రాంతంలోని మిల్లులకు ధాన్యం ఎక్కువగా వస్తుండడంతో ఆ జిల్లా అధికారులతోనూ సమన్వయం చేసుకుని టోకెన్లను పంపిణీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు రెవెన్యూ, సివిల్ సప్లయిస్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖతో పాటు పోలీస్ అధికారులతో కలిపి పర్యవేక్షణ కమిటీలను నియమిస్తామని అధికారులు చెప్పారు. మిల్లుల్లో విధిగా కొనుగోళ్ల రిజిస్టర్లు, ధాన్యం వివరాలు, రైతుల, స్టాక్ వివరాలు నమోదు చేయాలన్నారు.

సూర్యాపేట మార్కెట్‌కు 52,499 బస్తాల ధాన్యం

భానుపురి: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ సోమవారం ధాన్యం రాశులతో కళకళలాడింది. 770 మంది రైతులు 52,499 బస్తాల ధాన్యం తీసుకువచ్చారు. ఈ సీజన్‌లో ఇదే అధికం. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,360 కాగా, అత్యధికంగా బీపీటీ పాత రకం ధాన్యానికి రూ.2,649, జై శ్రీరామ్ రకానికి రూ.2,464 పలికింది. భారీగా ధాన్యం వస్తుండటం, ధాన్యం కాంటాలకు, ఎగుమతికి ఆలస్యమవుతుండటంతో ఖరీదుదారుల విన్నపం మేరకు మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు.

పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



ఆదిలాబాద్ మార్కెట్‌లో నిలిచిపోయిన పత్తి బండ్లు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనల కారణంగా మిల్లర్లు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారంటూ తెలంగాణ కాటన్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పత్తి కొనుగోళ్లను 4 గంటల పాటు నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయిన నేపథ్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితిని వివరించి, రైతులను ఆదుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గిరిరాజ్‌సింగ్, తెలంగాణలో పత్తి కొనుగోళ్లు జరపాలని సీసీఐని ఆదేశించారు. దీంతో పత్తి కొనుగోళ్లు మళ్లీ ప్రారంభమయ్యాయి. పత్తి కొనుగోళ్లలో గత ఏడాది సీసీఐ అనుసరించిన నియమ నిబంధనలనే ఈ ఏడాదీ పాటించనుందని కిషన్‌రెడ్డి కార్యాలయం తెలిపింది. కనీస మద్దతు ధరకే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుందని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

సీసీఐ అధికారులతో తుమ్మల చర్చలు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం హైదరాబాద్‌లో సీసీఐ సీఎండీ లలిత్ కుమార్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో చర్చలు జరిపారు. పత్తి కొనుగోళ్లలో తలెత్తుతున్న ఎల్ 1, ఎల్2, ఎల్3తో పాటు తేమ విషయంలో వస్తున్న ఇబ్బందులు, నిబంధనల సడలింపుపై బొమ్మినేని రవీందర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. చర్చలు సఫలం కావడంతో మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లకు అనుమతించారు.

ముందస్తు సమాచారం లేక ఇబ్బందులు

ఆదిలాబాద్ మార్కెట్‌తో పాటు నిర్మల్ జిల్లాలోని భైంసా, కామారెడ్డి జిల్లాలోని మద్నూర్‌లో కాటన్ వ్యాపారులు సీసీఐ, ప్రైవేట్ మిల్లులలో పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. కాటన్ మిల్లు యాజమానుల సమ్మెకు సంబంధించి ఎలాంటి ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో వందలాది మంది రైతులు తమ పత్తి దిగుబడులను విక్రయించేందుకు తీసుకొచ్చారు. అయితే సీసీఐ కొనుగోలు కేంద్రాలతో పాటు ప్రైవేట్ మిల్లులలో సైతం కొనుగోలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఆయా చోట్ల పత్తి రైతులు ఆందోళన చేశారు. నిర్మల్ జిల్లాలోని భైంసా జాతీయ రహదారిపై బైఠాయించారు. వాహనాల రాకపోకలను అడ్డుకొని ట్రాఫిక్ వ్యవస్థను పూర్తిగా స్తంభింపజేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతులకు సంఘీభావంగా పత్తి వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేసి నిరసన తెలిపారు. రెండు గంటల పాటు కొనుగోళ్లు స్తంభించాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మార్కెట్‌లో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. విషయం తెలియక మార్కెట్‌కు వచ్చిన రైతులు ఇబ్బందిపడ్డారు. పరిస్థితిని గమనించిన మార్కెట్ అధికారులు గ్రేడ్-2 వ్యాపారులతో పత్తి కొనిపించారు. సీసీఐ నిబంధనలను ఎత్తివేయాలని సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండలంలోని మర్రిపల్లి గ్రామ సమీపంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రాహదారిపై పత్తి రైతులు రాస్తారోకో నిర్వహించారు. 2 గంటల పాటు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లిలో పత్తి రైతులు ఆందోళనకు దిగారు. గుడిపల్లి మండలం నీలంనగర్ సమీపంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై పత్తి రైతులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి రోడ్డుపై పడుకుని ధర్నా నిర్వహించారు.



లారీ కింద ఇరుక్కున్న మహిళ

లారీ కింద ఇరుక్కున్న మహిళ.. బండి సంజయ్ చొరవతో బయటికి

» సాయం చేసి ఆస్పత్రికి పంపించిన కేంద్రమంత్రి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీ కింద ఇరుక్కుని అవస్థ పడుతోన్న ఓ మహిళ... కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవడంతో ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ వద్ద సోమవారం జరిగింది. మానకొండూరు మండలం కెల్లెడకు చెందిన దివ్యశ్రీ, ఆమె భర్త, పిల్లలు బైక్‌పై హుజూరాబాద్ నుంచి మానకొండూరుకు వెళ్తున్నారు. సింగాపూర్ శివారులో వాహనం అదుపు తప్పడంతో భర్త, పిల్లలు ఒకవైపు పడిపోగా దివ్యశ్రీ రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వచ్చిన లారీ వెనక టైర్ల కింద దివ్యశ్రీ జడ చిక్కుకుపోయింది. దీంతో ఆమెను లారీ కొంత దూరం ఈడ్చుకు పోయింది. చుట్టుపక్కల వాళ్లు కేకలు వేయడంతో డ్రైవర్ లారీ ఆపేశాడు. ఈ క్రమంలో ములుగు పర్యటనకు వెళ్తున్న బండి సంజయ్ తన కాన్వాయ్‌ను ఆపి మహిళను రక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. వెంట్రుకలు కత్తిరించి ఆమెను బయటకు తీశారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్సకు అయ్యే ఖర్చులు తానే చెల్లిస్తానని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



శివయ్యా...పాహిమాం!

హిందువులు పవిత్రంగా భావించే కార్తీక మాసం ప్రారంభంకావడంతో భక్తులు పరమశివుడి సేవలో తరిస్తున్నారు. కార్తీక రెండో సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు చేరుకొని పూజలు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రముఖ శివక్షేత్రం... కీసర గుట్టలో శ్రీరామలింగేశ్వర స్వామికి ఘనంగా రుద్రాభిషేకం జరిగింది. ఆలయం వెలుపల ఉన్న శివలింగాలకు భక్తులు అభిషేకాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ క్రమంలో ఓ వానరం గుట్టపై ఉన్న ఓ శివలింగాన్ని అత్యంత భక్తి ప్రపత్తులతో మొక్కింది. పక్కనే కొబ్బరి చిప్పలున్నా 'కోతి' చేష్టలు చేయకుండా దండంపెడుతున్న ఈ ఆసక్తికర దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. - కీసర, ఆంధ్రజ్యోతి

మీ చుట్టూ తిరిగే వారికే పదోన్నతులు, బదిలీలా?

ఓ ఉద్యోగ సంఘం నేతలను నిలదీస్తూ తహసీల్దారు లేఖ

ఒకే జిల్లాలో జీవితాంతం పనిచేయాలా అంటూ ఆవేదన

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు, బదిలీల్లో ఉద్యోగ సంఘాల కార్యాలయాలు, సంఘాల నేతల చుట్టూ తిరిగే వారికి ఒక న్యాయం, ఇతర ఉద్యోగులకు ఒక న్యాయమా.. అని ఓ ఉద్యోగ సంఘం నేతలను ప్రశ్నిస్తూ తహసీల్దార్ లేఖ రాయడం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. పదోన్నతి లేదా బదిలీ ద్వారా ఒక జిల్లాకు వెళ్తే అదే జిల్లాలో జీవితాంతం పని చేయాలా..? బదిలీకి అవకాశం ఉండదా అంటూ ఆ తహసీల్దార్ ఆవేదన చెందారు. 'అభివృద్ధి చెందిన జిల్లాల్లో పని చేస్తున్న వారు ఏళ్ల తరబడి ఆ జిల్లాలోనే ఉండలా.. వారికి బదిలీలుండవా.. మారుమూల జిల్లాల్లో పని చేయడానికి వారు అతీతులా..? అసలు రెవెన్యూ శాఖలో బదిలీలపై ఒక స్పష్టమైన ఆదేశాలు గానీ, ప్రణాళిక గానీ లేదా.. తహసీల్దారు మల్టీ జోన్ పోస్టు అయినప్పుడు సీసీఎల్ఏ జిల్లాకు కేటాయించిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోకుండా పనిచేస్తున్న ప్రాంతాన్ని ప్రామాణికంగా తీసుకోవడం ఎంతవరకు సబబు..? ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాల మేరకు ఒకే జిల్లాలో మూడేళ్లు పని చేయడాన్ని ప్రామాణికంగా తీసుకుని మరో జిల్లాకు బదిలీ చేసినప్పుడు సాధారణ బదిలీల్లో ఎందుకు ప్రామాణికంగా తీసుకోరు?' అని లేఖలో ప్రశ్నించారు.

అధీన ధ్రువపత్రం ఇచ్చే అధికారం వారికెక్కడిది?

» సివిల్ కోర్టుదే ఆ అధికారం : హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఫలానా వ్యక్తి అధీనంలో ఫలానా వ్యవసాయ భూమి ఉందని పేర్కొంటూ అధీన లేదా అనుభవ లేదా కబ్జా ధ్రువీకరణ పత్రం జారీ చేసే అధికారం రెవెన్యూ అధికారులకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. వ్యవసాయ భూములకు అధీన ధ్రువపత్రం(పొజెషన్) జారీ చేసేలా ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్వోఆర్ యాక్ట్(తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్స్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్-2020) రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాన్ని కట్టబెట్టలేదని స్పష్టం చేసింది. సంబంధిత సివిల్ కోర్టుకు తప్ప హైకోర్టు, సుప్రీంకోర్టుకు సైతం అధీన ధ్రువపత్రం జారీ చేసే అధికారం లేదని.. తహసీల్దార్ నుంచి రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ కూడా అధీన ధ్రువపత్రం జారీ చేయలేరని తెలిపింది. భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్‌లోని 122వ సర్వే నంబరులో ఉన్న రెండెకరాల భూమికి జిల్లా కలెక్టర్ అధీన ధ్రువపత్రం జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఎన్.మల్లయ్య తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. చట్టప్రకారం అసలు అధీనపత్రం జారీచేసే అధికారం రెవెన్యూ అధికారులకు ఎక్కడిదని ప్రశ్నించింది. వివాదంలో ఉన్న భూ లావాదేవీలపై స్టేటస్‌కో విధించింది. ఏ అధికారంతో అధీన పత్రం జారీ చేశారో వివరణ ఇవ్వాలని కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను డిసెంబరు 9కి వాయిదా వేసింది.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన... టీచర్‌పై వేటు

రాజేంద్రనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు అలా చేయవద్దన్న సహచర ఉపాధ్యాయులతో దురుసుగా వ్యవహరించడం, ప్రధానోపాధ్యాయురాలిని బూతులు తిడుతున్నారన్న ఆరోపణలతో బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ సైన్స్ టీచర్) వేణుగోపాల్‌రావును అధికారులు సస్పెండ్ చేశారు. అంతకుముందు వేణుగోపాల్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరసనకు దిగారు. అదే సమయంలో, బాలికల తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాలకు రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. చివరకుఈ విషయం రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి వెళ్లగా.. వేణుగోపాల్‌రావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నౌహీరా ఆస్తుల వేలానికి సుప్రీంకోర్టు అనుమతి

» మూడు నెలల్లో పూర్తి చేయాలని ఈడీకి ఆదేశం

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హీరాగోల్డ్ కుంభకోణం కేసులో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) నౌహీరాషేక్ ఆస్తుల వేలానికి సోమవారం సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. మూడు నెలల్లో వేలం ప్రక్రియను పూర్తి చేయాలని ఈడీని ఆదేశించింది. హీరో గోల్డ్ కుంభకోణంపై గత నెల 18న సుప్రీంకోర్టులో విచారణ జరిగినప్పుడు నౌహీరా తీరుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆస్తులను వేలం చేసి బాధితులకు న్యాయం చేస్తానంటూ ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించింది. ఆమె బెయిల్‌ను రద్దు చేసింది. దాంతో తనకు ఉపశమనం కల్పించాలని కోరుతూ గత నెల 22న మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆస్తులను వేలం వేసి డిపాజిటర్లకు డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆ విజ్ఞప్తిని ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. ఆస్తులను వేలం వేసేందుకు ఈడీకి అనుమతి ఇచ్చింది.

దక్కని కడసారి చూపు.. జైలులోనే తండ్రి

» ఐదు రోజులుగా ఫ్రీజర్‌లో కుమార్తె మృతదేహం

సారంగాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన కుమార్తెను కడసారీ చూడలేకపోయాడు ఆ తండ్రి. జగిత్యాల జిల్లా రేచపల్లి గ్రామానికి చెందిన పోగుల రాజేశం, మల్లీశ్వరి కుమార్తె లత అనుమానాస్పద స్థితిలో నిర్మల్ జిల్లాలోని రేగోజీపేటలో ఐదు రోజుల క్రితం మృతి చెందింది. మావోయిస్టులకు సహకరిస్తున్నాడంటూ ఆమె తండ్రి రాజేశంను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన జగ్దల్‌పూర్ జైలులో ఉన్నారు. కుమార్తె మృతదేహాన్ని తండ్రి కడసారి చూపు కోసం ఐదు రోజులుగా ఫ్రీజర్‌లోనే ఉంచారు. రాజేశం బెయిల్ కోసం పౌరహక్కుల నేతలు ఎన్ఐఏ కోర్టులో బెయిల్ పిటిషన్ వేసినా.. బెయిల్ మంజూరు కాలేదు. దీంతో భార్య మల్లీశ్వరి పుట్టెడు దుఃఖంతో తిరుగు ప్రయాణం అయ్యారు. మంగళవారం లత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హసన్‌పర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కథనం ప్రకారం ... కాజీపేట సోమిడి గ్రామానికి చెందిన మూల రాజిరెడ్డి (38) ద్విచక్ర వాహనంపై సోమవారం హసన్‌పర్తి మండలం సీతనాగారంలోని సమీప బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తున్నాడు. ముచ్చర్ల ఔటర్ రింగు రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

లగచర్ల.. రణరంగం

(మొదటి పేజీ తరువాయి)





వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడుతున్న దృశ్యం; వాహనంపై రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

అక్కడకు వచ్చిన అధికారులు.. మీ సమస్య, డిమాండ్లు చెప్పాలంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నా వినిపించుకోకుండా ఆగ్రహంతో ఊగిపోయారు. అప్పటికీ అధికారులు సంయమనం కోల్పోకుండా రైతులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా... సమావేశానికి వచ్చిన రైతులు, ప్రజలు ఆగ్రహంతో అధికారులపైకి దూసుకువచ్చారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూ రు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలను ముందుకు తోస్తూ చాలా దురుసుగా వ్యవహరించారు. తమ ఎదురుగా ఉన్నది కలెక్టర్ అనీ కూడా చూడకుండా రణరంగం సృష్టించారు. ఊహించని పరిణామానికి అధికారులు, వారి వెంట వచ్చిన సిబ్బంది హాహాకారాలు, రైతుల ఆగ్రహావేశాలు, దూషణలతో లగచర్లలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫార్మా కంపెనీ కోసం భూ సేకరణ చేపట్టేందుకు సోమవారం దుద్యాల మండలం, లగచర్లలో సమావేశం ఏర్పాటు చేశారు. భూములు కోల్పోతున్న పోలెపల్లి, హకీంపేట్, పులిచర్ల కుంట తండా, రోటిబండ తండా, లగచర్ల గ్రామాల రైతులు సమావేశాన్ని బహిష్కరించి.. నిరసనగా లగచర్లలోనే ఉండిపోయారు. సమావేశం ఏర్పాటు చేసిన స్థలం వద్దకు కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర అధికారులు వెళ్లగా అక్కడ కొందరు రైతులు మాత్రమే ఉన్నారు. రైతులు ఎక్కడున్నారని అక్కడున్న వారిని ప్రశ్నించగా, రైతులందరూ లగచర్ల గ్రామంలో ఉన్నారు, అక్కడికి వచ్చి మాట్లాడాలంటూ లగచర్లకు చెందిన బోగమోని సురేశ్‌తో పాటు అక్కడున్న మరికొందరు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి లగచర్లకు వాహనాల్లో చేరుకున్నారు. అధికారులు వాహనాల్లో నుంచి దిగుతుండగానే అక్కడున్న రైతులు ఒక్కసారిగా కలెక్టర్ డౌన్, డౌన్, కలెక్టర్ గో బ్యాక్.. అంటూ నినాదాలు చేశారు. రైతుల ఆగ్రహాన్ని గుర్తించిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తుండగా, వినిపించుకోకుండా అధికారులపైకి దూసుకువచ్చారు. అధికారులు చెప్పేది వినిపించుకోకుండా ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. దీంతో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వెంటనే అప్రమత్తమై కలెక్టర్‌ను చాకచక్యంగా అక్కడి నుంచి కారులో పంపించేశారు. కోపోద్రిక్తులైన రైతులు అక్కడే ఉన్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిపై పిడిగుద్దులు కురిపిస్తూ కింద పడేసి పలుమార్లు దాడి చేశారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపై రైతులు దాడి చేయగా, వారికి స్వల్ప గాయాలయ్యాయి. అధికారులను పోలీసులను అక్కడి నుంచి తప్పించే ప్రయత్నంలో కోపోద్రిక్తులైన రైతులు అధికారుల వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడిచేసి ధ్వంసం చేశారు. తన వెంట పడ్డ రైతుల నుంచి రక్షించుకునేందుకు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సమీపంలోని పొలాల్లోకి పరుగులు తీసి సొమ్మసిల్లి పడిపోయారు. అయినా రైతులు కనికరించకుండా ఆయనపై దాడి చేసే ప్రయత్నం చేశారు. పోలీసులు, ప్రత్యేక బలగాలు ఆయన్ను తప్పించి.. కొడంగల్‌కు తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. కాగా దాడి వెనుక ఎంతటివారున్నా వదిలిపెట్టేప ప్రసక్తేలేదని ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐజీ సత్యనారాయణ చెప్పారు. ఈ దాడికి సంబంధించి 3ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సూత్రదారి ఆయనే?

లగచర్ల శివారులో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేస్తే.. గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడాలని కోరిన వ్యక్తులే.. దాడి ఘటనకు ప్రధాన సూత్రధారులని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన వెనక ఓ రాజకీయ పార్టీ హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో శాంతి భద్రతల సమస్యను సృష్టించి ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించేలా స్కెచ్ వేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా అధికారులపై దాడి చేసే అవకాశం ఉందని స్థానిక పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా... మన రైతులు దాడి చేసే ప్రయత్నం చేయరనే ఉద్దేశంతో అధికారులు రైతుల వద్దకు వెళ్లారు. అయితే రైతుల ముందస్తు వ్యూహాన్ని అంచనా వేయడంలో నిఘా విభాగం వైఫల్యం చెందిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా న్యూస్‌నెట్‌వర్క్

దాడి ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా

లగచర్లలో అధికారులపై జరిగిన దాడి సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది. జరిగిన ఘటన గురించి సమగ్ర సమాచారం తెప్పించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ... దాడి వెనక ఉన్నవారిని వదిలి పెట్టకూడదని ఉన్నతాధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చే అధికారులపై దాడి జరగవచ్చన్న సమాచారం అప్పటికే కొందరికి ఉందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కాగా, ఈ దాడిలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు చెందిన బంగారు గొలుసు చోరీకి గురికావడం గమనార్హం.

ధర్నా, నిరసనలొద్దు: కలెక్టర్

దాడి ఘటనపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. కలెక్టరేట్ ఉద్యోగులు ధర్నా, నిరసన కార్యక్రమాలేవీ చేయొద్దని సూచించారు. "లగచర్ల గ్రామస్థులు మాట్లాడటానికి పిలిచారు. మేమూ మాట్లాడటానికే వెళ్లాం. తమపై దాడి జరిగిందనే పదాన్ని వాడొద్దని మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నా" అని కోరారు.



రైతుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పక్కకు తీసుకెళ్తున్న అధికారులు

విధులు బహిష్కరించిన ఉద్యోగులు

లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు రెవెన్యూ అధికారులపై అక్కడి రైతులు దాడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తాండూరు తహసీల్దార్ కార్యాలయ ఇబ్బంది పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ కే రక్షణ లేకుండా ఉంటే కింది స్థాయి సిబ్బంది పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పూడూరు తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి సిబ్బంది నిరసన తెలిపారు. మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన తెలిపారు. యాలాల తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి.. నినాదాలు చేశారు. పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు విధులు బహిష్కరించారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగులపై దాడి.. హేయమైన చర్య

» బాధ్యులను కఠినంగా శిక్షించాలి

» తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం

» నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద రెవెన్యూ ఉద్యోగుల నిరసన

» దాడిని ఖండించిన ఉద్యోగ సంఘాలు

హైదరాబాద్/ నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు రెవెన్యూ అధికారులపై దాడిని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి హేయమైన చర్య అని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారులపై రైతుల ముసుగులో అసాంఘిక శక్తులు దాడికి పాల్పడ్డాయని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. చంద్రమోహన్, ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఇదే విషయమై తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి సచివాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. దాడికి ఉసిగొల్పిన, పాల్పడిన వారి మీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడిని ట్రెసా తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గౌతమ్ కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల ఐకాస చైర్మన్ కె.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. రైతుల ముసుగులో దాడి చేయడం హేయమైన చర్య అని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధానకార్యదర్శి ఎ.సత్యనారాయణ పేర్కొన్నారు. ఉద్యోగులతో కలిసి కొత్తగూడెంలో నల్లరిబ్బన్లతో వారు నిరసన తెలిపారు. దాడికి దిగడం సమంజసం కాదని ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి పద్మావతి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న కలెక్టర్‌తో పాటు సిబ్బందిపై దాడిని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణిరెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన తెలిపారు.

అక్షరం మసక

(మొదట పేజీ తరువాయి)

కనిపించడం లేదని గుర్తించారు. ఈ ఏడాది జూన్ నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తుండగా మరో ఆరు లక్షల మందికి చేయాల్సి ఉందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. ఐదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు విద్యార్థులకు ఈ పరీక్షలు చేస్తున్నారు. కంటిచూపు సమస్య అబ్బాయిల కంటే అమ్మాయిల్లో ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా నవంబరు 9 వరకు 10,21,727 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో అమ్మాయిలు 5.33 లక్షల మంది, అబ్బాయిలు 4.87 లక్షల మంది ఉన్నారు. అమ్మాయిల్లో 28,467 మందికి (2.78 శాతం), అబ్బాయిల్లో 15,134 మందికి (1.47 శాతం) కంటి చూపు సమస్యలు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. దీంతో పాటు కంటికి సంబంధించిన ఇతర సమస్యలు కూడా ఉన్నట్లు గుర్తించారు. అందులోనూ అమ్మాయిలే ఎక్కువ. మొత్తం 2,597 మందిలో 1,441 మంది అమ్మాయిలు, 1,156 మంది అబ్బాయిలు ఉన్నారు. ఎక్కువగా 8-10వ తరగతి విద్యార్థుల్లో కంటిచూపు సమస్యలు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. అదీ హైదరాబాద్‌లో ఈ సమస్య ఎక్కువగా ఉందని తెలిపాయి. భాగ్యనగరంలో 22,094 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 2,195 మందిలో ఈ సమస్య ఉన్నట్లు గుర్తించారు. రంగారెడ్డిలో 66 వేల మందిలో 4,701 మందికి, మెదక్‌లో 52 వేల మందిలో 2,331 మందికి కంటిచూపు సమస్య ఉందని తేల్చారు.

కరోనా సమయంలో అత్యధికంగా...

కరోనా సమయంలో పిల్లలంతా ఆన్‌లైన్‌లో తరగతులకు హాజరయ్యారు. స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌ల ద్వారా పాఠాలు విన్నారు. రోజూ ఏడెనిమిది గంటల పాటు వాటికి అతుక్కుపోయారు. దాంతో వారికి కంటిచూపు సమస్య తీవ్రత పెరిగింది. వైద్య ఆరోగ్య శాఖ 2021-22 మధ్య పైలట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అందులో 23 శాతం మంది పిల్లల్లో కంటిచూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో అత్యధికంగా 36 శాతం, రంగారెడ్డిలో 18, నాగర్ కర్నూల్‌లో 9 శాతం మంది పిల్లలు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడైంది.

సెల్‌ఫోన్, గాడ్జెట్స్‌తోనే సమస్య



ప్రస్తుతం పిల్లలు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో కంటిచూపు తగ్గుతోంది. గతం కంటే ఈ సమస్య ఇప్పుడు పెరిగింది. అబ్బాయిలు బయట ఆడుకోవడానికి వెళ్తారు. దాంతో సెల్‌ఫోన్ చూసే సమయం తగ్గుతుంది. ఆడపిల్లలు ఎక్కువసేపు ఇంట్లోనే ఉంటూ సెల్‌ఫోన్, గాడ్జెట్స్ చూస్తున్నారు. అందువల్ల వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. స్కూల్ ముగిసిన తర్వాత వీలైనంత వరకు పిల్లల్ని బయట ఆడుకోనివ్వాలి.


- డాక్టర్ రాజలింగం, ఆప్తమాలజీ హెచ్‌వోడీ, భువనగిరి ప్రభుత్వ వైద్య కళాశాల

చనిపోతున్నా.. పిల్లలను బాగా చూసుకో

భర్తకు ఫోన్ చేసి.. వివాహిత ఆత్మహత్య

» ఆస్పత్రిలో సహోద్యోగుల వేధింపులు

» దురుసు ప్రవర్తనతో మనస్తాపం



కిరణ్మయి (ఫైల్)

సూర్యాపేట క్రైం/సూర్యాపేట సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పని చేసే చోట సహోద్యోగి వేధింపులు, యాజమాన్యం దురుసు మాటలకు మనస్తాపంతో ఓ మహిళా ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని చంద్రన్నకుంటలో ఉంటున్న కొత్తపల్లి కిరణ్మయి(32) జిల్లా కేంద్రం జమ్మిగడ్డలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో నాలుగు నెలలుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోంది. అక్కడ టెక్నీషియన్ పవన్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలు మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా.. వేధింపులు ఆగలేదు. ఈక్రమంలో వేధింపుల నుంచి తనకు రక్షణ కల్పించాలని, వేతనం పెంచాలని పాలక వర్గ ప్రతినిధులను ఆమె కోరారు. వారు సైతం దురుసుగా ప్రవర్తించడంతో మనస్తాపం చెందిన కిరణ్మయి తన భర్త ప్రవీణ్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపింది. తాను చనిపోతున్నానని, పిల్లలను బాగా చూసుకోవాలని చెప్పింది. ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వెంటనే ప్రవీణ్ వెళ్లి చూడగా.. కిరణ్మయి చనిపోయి ఉంది. దీంతో కిరణ్మయి బంధువులు... ఆమె మృతదేహాన్ని లయన్స్ కంటి ఆస్పత్రికి తీసుకువచ్చి ఆందోళన చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2024-25 ఏపీ వార్షిక బడ్జెట్

మొత్తం బడ్జెట్ రూ.2,94,427.25 కోట్లు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టింది. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో పతనం అంచుల్లోకి నెట్టిన రాష్ట్రానికి ఆర్థిక పునరుజ్జీవం పోయడమే బడ్జెట్ లక్ష్యమని ప్రకటించింది. సరళమైన ప్రభుత్వం ప్రతిభావంతమైన పాలన అనే సూత్రంతో పాలనను క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజల స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2,94,427.25కోట్ల పద్దు సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. శాఖల వారీగా కేటాయింపులు, రెవెన్యూ-మూలధన వ్యయం, జీఎస్‌డీపీ-ద్రవ్యలోటు గురించి తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. ఇందులో రెవెన్యూ వ్యయం 2.34లక్షల కోట్లు కాగా, మూలధన వ్యయం 32,712 కోట్ల రూపాయలు. అయితే ద్రవ్యలోటు 68,743కోట్లు ఉండొచ్చని ఆర్థిక మంత్రి సభలో వెల్లడించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.